www.peoplesnews.in

హైదరాబాద్
# పీపుల్స్ న్యూస్
దినపత్రిక
ప్రజల గొంతుక...

ఎడిటర్ : కె. శ్రావణ్ కుమార్

తెలంగాణ - ఆంధ్రప్రదేశ్ సంపుటి : 16 సంచిక : 61 గురువారం, జూలై 16, 2026, పేజీలు - 12 వెల: 2/-

Circulated to Hyderabad, Rangareddy, Karimnagar, Nalgonda, Adilabad, Mahaboobnagar, Khammam, Medak, Warangal, Nizamabad

రండి.. అక్షరాన్ని
అనుకున్న విధంగా రాద్దాం

అసలైన అక్షరాన్ని రుచి చూపేందుకు..
కన్నది విన్నది పంచుకున్నది ప్రజలకు అందించాలని..
వారి సాధకబాధకాల్లో మమేకమై
పరిష్కార మార్గాలకు దిక్సూచిగా
మారాలని అనుకుంటున్నారా? విశాలమైన జర్నలిజం
వృత్తిలో రాణించాలని కోరుకుంటున్నారా? అయితే..

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
జిల్లా, మండల మరియు నియోజకవర్గాల
వారిగా రిపోర్టర్లు కావలెను

సంప్రదించండి
తెలంగాణ | ఆంధ్రప్రదేశ్
9866330400

# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

## - గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నాం

**మా ప్రభుత్వానికి పాలసీ పెరాలసిస్ లేదు**

**పాలమూరు-రంగారెడ్డి ఎత్తిపోతలకు 9 టిఎంసిల నీటికి యత్నం**

**దివిటిపల్లిలో అమరరాజా బ్యాటరీ ప్రారంభించిన సిఎం రేవంత్**





**మహబూబ్‌నగర్,జూలై 15 :**తెలంగాణ అభివృద్ధి లక్ష్యంగా గత ప్రభుత్వాల పాలసీలను కొనసాగిస్తున్నామని, అందులో మంచివుంటే మరింత మెరుగ్గా ముందుకు సాగుతున్నామని సిఎం రేవంత్ రెడ్డి అన్నారు. మా ప్రభుత్వానికి పాలసీపెరాలసిస్ లేదని అన్నారు. గత ప్రభుత్వాల పాలసీలను మరింత మెరుగుపర్చి ముందుకు తీసుకెళు న్నాం అని అన్నారు. 1994 నుంచి 2004వరకు చంద్రబాబునాయుడు, 2004 నుంచి 2014వరకు వైఎస్ రాజశేఖర్ రెడ్డి, 2014 నుంచి 2023డిసెంబర్ వరకుగత ప్రభుత్వాలు తీసుకువచ్చిన పాలసీలను మా ప్రభుత్వం ముందుకు తీసుకెళ్తోందన్నారు. గతప్రభుత్వాల మిగతా2లో...




### 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల
# ఎకానమీ లక్ష్యం

- ఫ్యూచర్ సిటీలో అమెజాన్‌ది కీలక పాత్ర
- అత్యంత అధునాతనంగా ఫ్యూచర్ సిటీ నిర్మాణం
- అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన

**హైదరాబాద్,జూలై 15 :** రాష్ట్రానికి వచ్చే పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని తెలంగాణ సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. పెట్టుబడులపై ప్రతి నెలా సమీక్ష నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ కొత్త డేటా సెంటర్‌కు సీఎం శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా నిర్వహించిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. అమెజాన్ డేటా సెంటర్ ఫ్యూచర్ సిటీలో కీలక పాత్ర పోషించనుందని అన్నారు. అత్యంత అధునాతన నగరంగా ఫ్యూచర్ సిటీని నిర్మిస్తున్నాం. ఇక్కడ మరిన్ని పెట్టుబడులను ఆహ్వానిస్తున్నాం. దేశ జీడీపీలో తెలంగాణ వాటా 10 శాతం ఉండాలనేది మా లక్ష్యం. 2034 నాటికి ఒక ట్రిలియన్ డాలర్లు, 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యాన్ని చేరుకుంటాం. ఐఎస్‌బీ, నల్సార్ సహా అనేక సంస్థలతో కలిసి పనిచేస్తున్నాం. పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నాం. తెలంగాణ అభివృద్ధిలో ఓఆర్ఆర్, విమానాశ్రయం, ఫార్మా కంపెనీలు అనేక సేవలు మిగతా2లో...

## కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

### - సిసి రోడ్ల పనులకు బండి శంకుస్థాపన



**కరీంనగర్,జూలై 15 :** కరీంనగర్ అభివృద్ధికి మరిన్ని నిధులు తీసుకుని వచ్చేందుకు కృషి చేస్తానని కేంద్ర మంత్రి బండి సంజయ్ మిగతా2లో...

### మేడిగడ్డపై కేంద్రం
# తీరు దారుణం





● ఎన్‌డిఎస్‌ఎ రిపోర్టుపై మండిపాటు ● పోలవరం విషయంలో ఒకలా..ఇక్కడ మరోలా ● రాష్ట్ర ఇంజనీర్ల నివేదికను బహిర్గతం చేయాలి ● సిసిఐని తెరిపించాలని కేంద్ర మంత్రికి వినతి ● ఢిల్లీలో మీడియాతో బిఆర్ఎస్ వర్కింగ్ ప్రసిడెంట్ కెటిఆర్

**న్యూఢిల్లీ,జూలై 15 :** గతంలో పోలవరం డయాఫ్రమ్ వాల్ దెబ్బతింటే.. ఎన్డీఎస్ఏ పట్టించుకోలేదు. మేడిగడ్డ పిల్లర్ కుంగితే మాత్రం ప్రత్యేక శ్రద్ధ తీసుకుందని కేంద్రం తీరుపై కెటిఆర్ మండిపడ్డారు. మేడిగడ్డ బ్యారేజీపై నివేదిక ఇచ్చింది ఎన్డీఎస్ఏ కాదు.. ఎన్డీఏ అన్నారు. ఢిల్లీలో మీడియాతో ఆయన చిట్‌చాట్ నిర్వహించారు. ఈ సందర్భంగా మేడిగడ్డ విషయంలో నేషనల్ డ్యాం సేఫ్టీ అథారిటీ (ఎన్డీఎస్ఏ) తీరుపై కేటీఆర్ విమర్శలు చేశారు. తెలంగాణలో కోటి ఎకరాలకు పైగా నిషేధిత జాబితాలో చేర్చారు. రెవెన్యూ మంత్రి 30 శాతం వసూళ్లు చేస్తున్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ఇచ్చిన హామీలకు చేస్తున్న పనులకు పొంతన లేదు. కాళేశ్వరంపై ఆయన పగబట్టి వ్యవహరిస్తున్నారు. రాష్ట్ర ఇంజినీర్ల మిగతా2లో...

## 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

### - బిజెపి అధ్యక్షుడు రాంచంద్రరావు వెల్లడి



**హైదరాబాద్,జూలై 15 :**

వరంగల్ ఎయిర్‌పోర్టును 2028 నాటికి పూర్తిచేయాలని కేంద్ర ప్రభుత్వం నిర్ణయించిందని భాజపా రాష్ట్ర అధ్యక్షుడు రామచం దర్‌రావు తెలిపారు. ఈ మేరకు కేంద్రప్రభుత్వం అన్ని చర్యలు తీసుకుంటుందోన్నారు. అయితే ఆ క్రెడిట్ తీసుకునేందుకు సీఎం రేవంత్ ప్రయత్నిస్తున్నారని మిగతా2లో...




### త్వరలో నామినేటెడ్
# పోస్టుల భర్తీ

### టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటన

**హైదరాబాద్,జూలై 15 :** ఈనెలలోనే 50 నామినేటెడ్ పదవులను భర్తీ చేస్తామని టీపీసీసీ చీఫ్ మహేశ్ కుమార్ గౌడ్ ప్రకటించారు. బుధవారం మీడియాతో నిర్వహించిన చిట్‌చాట్‌లో మాట్లాడుతూ.. గతంలో పనితీరు కనబరిచిన వారిని రెన్యూవల్ చేసే అవకాశం ఉందన్నారు. డీసీసీల పనితీరు బాగోలేకపోతే మార్చే అవకాశం ఉందని వెల్లడించారు. పార్టీ పదవులపై మీనాక్షి నటరాజన్‌తో చర్చించామని తెలిపారు. రెండు రోజుల్లో సీఎం రేవంత్‌రెడ్డితో భేటీ అవుతామన్నారు. రెన్యువల్ విషయంలో ఇంకా ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. మండల కమిటీలో డీసీసీల రిపోర్ట్స్ ÷నైల్ అని స్పష్టం చేశారు. మిగతా2లో...

## తెలంగాణలో సర్ నమోదు పక్రియ

### గడువును అగస్ట్ 3 వరకు పొడిగించిన ఎన్నికల సంఘం



**హైదరాబాద్,జూలై 15 :**

తెలంగాణలో సర్ నమోదు పక్రియను కేంద్ర ఎన్నికల సంఘం ఆగస్టు 3 వరకు పొడిగిం చింది. సెప్టెంబర్ 9 వరకు మిగతా2లో...

## కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

### - కెటిఆర్ విమర్శలపై మండిపడ్డ పొంగులేటి

**హైదరాబాద్,జూలై 15 :** ఢిల్లీలో మీడియాతో చిట్‌చాట్‌లో బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ చేసిన వ్యాఖ్యలపై తెలంగాణ మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించారు. కేసీఆర్ పదేళ్ల పాలనను 'ఫాంహౌస్ పాలన'గా ఆయన అభివర్ణిం చారు. ప్రజలు ఇచ్చిన అధికారాన్ని వినియోగించు కోకుండా ఫాంహౌస్‌కే ఆయన మిగతా2లో...



## చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ



# పారిశ్రామిక అభివృద్ధి లక్ష్యంగా ప్రోత్సాహం

(మొదటి పేజీ తరువాయి)

పాలసీల్లో ఉన్న మంచి మేం కూడా ప్రోత్సహిస్తున్నాం.. మహబూబ్ నగర్ జిల్లా దివిటిపల్లిలో అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి ప్రారంభించారు. మంత్రులు శ్రీధర్ బాబు,జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి,అమర రాజా గ్రూప్ చైర్మన్ గల్లా జయదేవ్,ప్రభుత్వ విప్ యన్నం శ్రీనివాస్ రెడ్డి,ఎంపీ లు డీకే అరుణ,మల్లు రవి, ఉమ్మడి జిల్లా ఎంఎల్ఏ లు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు హాజరయ్యారు. అమర రాజా గిగా కారిడార్‌లో కస్టమర్ క్వాలిఫికేషన్ ప్లాంట్ తయారీ యూనిట్ ను ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పరిశీలించారు. అనంతరం ప్లాంట్ ఆవరణలో ముఖ్యమంత్రి మొక్క నాటారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ అమరరాజా అద్భుతమైన పరిశ్రమను ఇక్కడ ఏర్పాటు చేసిందని, 1983 లో అమరరాజా చిత్తూరు జిల్లాలో మొదటిసంస్థను ఏర్పాటు చేసిందన్నారు. అమర రాజా సంస్థ ఏర్పాటు చేసి 40 యేళ్లు అవుతోందన్నారు. అమర రాజా గ్లోబల్ సంస్థ.. అంటూ అమర రాజా కు దేశంలో పోటీ లేదన్నారు. చైనా, జపాన్, జర్మని, కొరియా లాంటి దేశాలనుఆదర్శంగా తీసుకుని అమర రాజా సంస్థ పనిచేస్తోందన్నారు. ప్రపంచంలో చైనా ఈవీవెహికిల్స్ కు లీడర్ గా ఉంది.. ఈవీ లో చైనాతో అమర రాజా సంస్థ పోటీ పడిపనిచేస్తోంది.. కాలుష్యం వేగంగా విస్తరిస్తోంది.. వాతావరణంలో మార్పులు వేగంగా వస్తున్నాయి.. ఎలినినో ప్రభావం కారణంగా వర్షాలు పడటం లేదు.. రైతులు ఇబ్బంది పడుతున్నారు.. కోవిడ్ తర్వాత వాతావరణంలోచాలా మార్పులు వచ్చాయని సిఎం అన్నారు. కాలుష్యం తగ్గించుకోవాల్సిన అవసరం ఉంది.. కాలుష్య నియంత్రలోఈవీవెహికిల్స్అవసరం ఉంది.. దివిటిపల్లి అమర రాజా యూనిట్ లో 700 మంది ఉద్యోగులు పనిచేస్తున్నారు..ఇందులో 400 మంది మహిళా ఉద్యోగులు ఉండటంమహిళా సాధికారిత కు నిదర్శనం.. తెలంగాణ రైజింగ్ 2047 లో భాగంగా పాలసీలుతీసుకువస్తున్నాం.. ప్రస్తుతం దేశ జీడీపీలో5 శాతం తెలంగాణ వాటా గా ఉంది.. కాని నేను దీనిపైన సంతోషంగా లేను.. దేశ జీడీపీలో తెలంగాణ వాటాను 10 శాతానికి పెంచడమే మా లక్ష్యం.. 2034 నాటికి తెలంగాణను వన్ట్రిలియన్డాలర్ల ఆర్థిక వ్యవస్థగా మార్చాలన్నదే మా ధ్యేయం అన్నారు. అమర రాజా లాంటి సంస్థలు తెలంగాణ రైజింగ్ కు మద్దతుగా ఉంటున్నాయి.. తెలంగాణనుక్యూర్, ప్యూర్, రేర్ గా విభజించిపాలసీలు రూపొందించి ముందుకు వెళ్తున్నాం.. తెలంగాణ పరిశ్రమలు పెట్టాలంటే మౌలిక సదుపాయాలు ముఖ్యం.. పారదర్శకంగా విధానాలు రూపొందించుకుని ప్రభుత్వం ముందుకు వెళ్తోంది.. ఢిల్లీకి రాజు అయినా తల్లికి బిడ్డ అన్నట్లు గా నేను పాలమూరుబిడ్డను. ఆదర్శవంతంగా జిల్లా గా మహబూబ్నగర్ ను తీర్చిదిద్దుతున్నాం.. ఒకప్పుడుకరువు జిల్లాగా ఉండే మహబూబ్నగర్ ఇప్పుడు ఇతరజిల్లాలనుదత్తత తీసుకునే స్థాయికి ఎదిగాం.. విద్య లో భాగంగా ట్రిబుల్ ఐటీ, ఇంజనీరింగ్ కాలేజీలు,ఏటీసీ సెంటర్లు, యంగ్ ఇండియా ఇంటిగ్రేటేడ్ స్కూల్స్ జిల్లాలో ఏర్పాటు చేశాం.. బ్లూ కాలర్ జాబ్ ల కోసం ఏటీసీలు, పాలిటెక్నిక్ లు ఏర్పాటు చేస్తున్నాం.. ఉమ్మడి జిల్లాలోని కల్వకుర్తి, బీమా, ఆర్డీఎస్, నెట్టంపాడు వంటి ప్రాజెక్టులను పూర్తి చేస్తున్నాం.. త్వరలోనే మహబూబ్‌గర్ జిల్లా ప్రజలకుశుభవార్త వినిపిస్తున్నాం. పక్క రాష్ట్రంతో సంప్రదింపులుజరుగుతున్నాయి.. పాలమూరు రంగారెడ్డి ఎత్తిపోతలకు 90 టీఎంసీ లు సాధించే దిశగాచర్చలుజరుగుతున్నాయి.. డిండి ప్రాజెక్టుకు 30 టీఎంసీ కేటాయింపుల పై చర్చలుజరుపుతున్నాం.. పరిశ్రమలకు అనుకూల వాతావరణంసృష్టించి జిల్లా లో ఉపాధి అవకాశాలుకల్పిస్తాం.. పాలమూరు జిల్లాలో చాలా మంది రైతులు అమర రాజా కు భూములు ఇచ్చారు.. అత్యధిక ఉద్యోగాలు వాళ్లకుఇవ్వాలని కోరుతున్నట్లు వెల్లడించారు. ఆర్ అండ్ బీ మినిస్టర్ గా గల్లాజయ్ దేవ్ తల్లి గల్లా అరుణ కొడంగల్ లో చాలా రోడ్లు మంజూరు చేశారు.. నేను రెండో సారి గెలవడానికి నాకు అవి ఉపయోగపడ్డాయని రేవంత్ అన్నారు.

# 2047 నాటికి మూడు ట్రిలియన్ డాలర్ల ఎకానమీ లక్ష్యం

(మొదటి పేజీ తరువాయి)

అందిస్తున్నాయి. దేశంలో అత్యంత అభివృద్ధి చెందిన రాష్ట్రంగా మారబోతున్నాం. పరిశ్రమలు, టూరిజం, క్రీడా నైపుణ్యం, వైద్య రంగాల్లో పాలసీలు తెచ్చాం. హైదరాబాద్‌లోని 3వేల ఆర్టీసీ బస్సులు, 2లక్షల ఆటోలను ఈవీలుగా మార్చేందుకు కృషి చేస్తున్నాం. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నాం. గొప్ప నగరంగా మారాలనే మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టాం. ఫార్మా పరిశ్రమలను ఓఆర్ఆర్ బయటకు తీసుకెళ్తున్నాం. హైదరాబాద్‌లో కాలుష్యం, ట్రాఫిక్ సమస్యలపై ప్రత్యేక దృష్టి పెట్టాం' అని రేవంత్‌రెడ్డి అన్నారు. పన్నెండేళ్ల వ్యవధిలో అమెజాన్ విస్తరణకు రూ.60వేల కోట్ల పెట్టుబడులు పెట్టేలా ఆ సంస్థతో తెలంగాణ ప్రభుత్వం ఇప్పటికే పరస్పర అంగీకారం కుదుర్చుకుంది. ఫ్యూచర్ సిటీలో అమెజాన్ డేటా సెంటర్ విస్తరణ కోసం 202 ఎకరాలు, చందన్‌వెల్లిలో 98 ఎకరాలను ప్రభుత్వం కేటాయించింది. రూ.125 కోట్ల విలువ చేసే ప్రోత్సాహకాలు, రాయితీలు అమెజాన్‌కు అందించింది. తొలి విడతలో భాగంగా.. 24 నెలల్లో నిర్మాణ సంబంధిత పనులు పూర్తవుతాయి. అనంతరం రాబోయే 10 ఏళ్లలో మిగతా పనులు పూర్తి చేస్తారు. హైదరాబాద్‌లో క్లౌడ్ కంప్యూటింగ్, కృత్రిమ మేధ, డిజిటల్ బ్యాంకింగ్, ఈ-కామర్స్, ఆరోగ్య సేవలు, ప్రభుత్వ డిజిటల్ సేవలు, స్టార్టప్‌లు, పరిశ్రమలకు అవసరమైన డిజిటల్ మౌలిక వసతులు మరింత బలోపేతం కావడంలో అమెజాన్ వెబ్ సర్వీసెస్ దోహదపడుతుందని ప్రభుత్వం భావిస్తోంది. 2047 కల్లా 3 ట్రిలియన్ ఎకానమీకి చేరుకుంటామని ధీమా వ్యక్తం చేశారు. భారత జీడీపీకి 10శాతం అందించడమే తమ లక్ష్యమని స్పష్టం చేశారు. కాలుష్యరహిత నగరంగా హైదరాబాద్‌ను తీర్చిదిద్దుతా మని చెప్పారు. నగరంలో ఉన్న పరిశ్రమలను బయటకు తరలిస్తామన్నారు. మూసీ ప్రక్షాళన, మెట్రో విస్తరణ చేపట్టామని, డీజిల్ నుంచి ఈవీలుగా బస్సులను మారుస్తామని వెల్లడించారు. ఈవీ వాహనాల రిజిస్ట్రేషన్‌లో జీరో ట్యాక్స్ అమలు చేస్తున్నామని అన్నారు. ఫార్చ్యూన్ కంపెనీలకు హబ్‌గా హైదరాబాద్ మారనుందని, ప్రపంచంలోనే అత్యంత అధునాతనమైన నగరాన్ని నిర్మిస్తున్నామని వెల్లడించారు. పరిశ్రమలకు సింగిల్ విండో ద్వారా అనుమతులు ఇస్తున్నామని, పారిశ్రామికవేత్తలకు అనేక రకాల ప్రోత్సాహకాలు అందిస్తున్నామని సీఎం చెప్పుకొచ్చారు. ప్రతి రంగానికి ప్రత్యేక పాలసీలు రూపొందించామని తెలిపారు. పాలసీలపై ఎప్పటికప్పుడు రివ్యూలు నిర్వహిస్తున్నామన్నారు. ఫ్యూచర్ సిటీకి అమెజాన్ డేటా సెంటర్ స్టెప్పింగ్ స్టోన్‌గా ఉంటుందన్నారు. ఫ్యూచర్ సిటీకి రాబోయే రోజుల్లో మరిన్ని పెట్టుబడులు రానున్నాయని సీఎం రేవంత్ రెడ్డి పేర్కొన్నారు. కాగా, ఫ్యూచర్ సిటీలో 202 ఎకరాల్లో అమెజాన్ డేటా సెంటర్ నిర్మాణం జరగనుంది. 12 ఏళ్లలో రూ.60వేల కోట్లను అమెజాన్ వెచ్చించనుంది. ఈ కార్యక్రమంలో మంత్రులు శ్రీధర్ బాబు, జూపల్లి కృష్ణా రావు, వాకిటి శ్రీహరి, శాసనమండలి చీఫ్ విప్ పట్నం మహేందర్ రెడ్డి, ఎమ్మెల్యే మల్ రెడ్డి రంగారెడ్డి, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సంజయ్ జాజు, సలహాదారు రామకృష్ణా రావు, ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# మేడిగడ్డపై కేంద్రం తీరు దారుణం

(మొదటి పేజీ తరువాయి)

ఇచ్చిన నివేదికను బయటపెట్టాలని కెటిఆర్ ఢిల్లీలో మీడియాతో అన్నారు. గత రెండేళ్లలో కేసీఆర్ ఏ ఒక్కరి పేరు పెట్టి విమర్శలు చేయలేదు. రేవంత్‌కు మాత్రం.. కేసీఆర్ పేరు తలవని రోజు లేదు. రెండు రోజులు దిల్లీలోనే ఉన్న సీఎం.. ఎన్డీఎస్ఏ అధికారులను ఎందుకు కలవలేదన్నారు. ఎన్డీఎస్ఏ ప్రాథమిక నివేదికకు.. తుది నివేదికకు చాలా వ్యత్యాసం ఉంది. మేడిగడ్డపై చూపిన శ్రద్ధ.. మిగతా రాష్ట్రాలపై ఎందుకు చూపలేదని కేటీఆర్ ప్రశ్నించారు. ఈ సందర్భంగా ఏపీ ప్రభుత్వ పనితీరును బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ కొనియాడారు. ఎల్‌నినో పరిస్థితుల్లోనూ నీటి సమస్య రాకుండా ఆ రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టిందన్నారు. ఈ క్లిష్ట సమయంలోనూ పట్టిసీమ నుంచి నీటిని ఎత్తిపోస్తూ రైతుల ప్రయోజనాలకు అధిక ప్రాధాన్యం ఇస్తోందన్నారు. నీటిపారుదల ప్రాజెక్టులను పూర్తి చేస్తోందని చెప్పారు. ఈ విషయంలో ఆ ప్రభుత్వం ఇస్తున్న ప్రాధాన్యత.. తెలంగాణ ప్రభుత్వం ఇవ్వట్లేదన్నారు. సముద్రంలోకి పోయే నీటి వినియోగానికి ఏపీ అన్ని ప్రయత్నాలు చేస్తోందని కేటీఆర్ పేర్కొన్నారు. సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా సిసి ఫ్యాక్టరీ పునరుద్ధరణ కోసం బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ బృందం ఢిల్లీకి వెళ్లి కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్‌డీ కుమారస్వామిని కలిసింది. అనంతరం కేటీఆర్ మీడియాతో మాట్లాడుతూ.. ఆదిలాబాద్ నుంచి మాజీ మంత్రి జోగురామన్న, ఎంపీ వద్దిరాజు రవిచంద్రతోపాటు సీసీఐ సాధాన సమితి సభ్యులను అందరినీ తీసుకొని కేంద్ర భారీ పరిశ్రమలు, ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామిని కలిశామని అన్నారు. 1980వ దశకంలో ఏర్పాటు చేయబడ్డ సిమెంట్ కార్పోరేషన్ ఆఫ్ ఇండియా ఎ÷-లాంట్ ఒకదశలో ప్రత్యక్షంగా, పరోక్షంగా 6 వేల మందికి ఉద్యోగాలు కల్పించిందని అన్నారు. రాబోయే 100 సంవత్సరాల వరకు మీకు మైన్ స్టోన్ రిజర్వ్‌లు కూడా మీకు ఉన్నాయి. 4 లక్షల మెట్రిక్ టన్నుల కెపాసిటీతో ఉన్న ఈ ప్లాంట్‌ను నడిపేందుకు అవకాశాలు సంపూర్ణంగా ఉన్నాయన్నారు. గతంలో 2019లో కేంద్రహోంశాఖ మంత్రి అమిత్ షా మాటిచ్చారు. బీజేపీ అధికారంలోకి వస్తే ఈ ప్లాంట్‌ను తప్పకుండా తెరిపిస్తామని పార్లమెంట్ ఎన్నికల సందర్భంగా చెప్పారు. ఎ÷-లాంట్‌ను తెరిపిస్తామని కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి హన్స్‌రాజ్ గంగారాం కూడా మాటిచ్చారు. కానీ ఈ రోజు ఆదిలాబాద్ సీసీఐని తుక్కు కింద అమ్మేస్తున్నరని వారికి వివరంగా చెప్పడం జరిగిందన్నారు.సీసీఐ సాధన సమితి చేస్తున్న పోరాటం అభినందనీయం. మేం కూడా దీన్ని మళ్లీ నడపాలని కోరికతోనే ఉన్నామని కేంద్రమంత్రి అన్నారని కేటీఆర్ వెల్లడించారు. దాదాపు 230 ఎకరాలు అక్కడ ల్యాండ్ ఉన్నది. ఒక 770 ఎకరాలు ప్రైవేట్ పట్టా ల్యాండ్ కంపెనీకి ఉంది. అట్లాగే 1500పై చిలుకు ఎకరాలు లీజ్ ల్యాండ్ ఉంది. మరి 2 వేల కోట్ల రూపాయల పెట్టుబడితో కొత్త ఫ్యాక్టరీతో పెడితే బాగుంటదన్నారు. ఏమైంది ఎందుకు తెరవలేకపోతున్నరని అడిగితే రాష్ట్ర ప్రభుత్వం కొంత స్పందించడం లేదు.. సంవత్సర కాలంగా మేం ప్రయత్నం చేస్తున్నం. కానీ రాష్ట్ర ప్రభుత్వం మైనింగ్ లీజ్ పొడిగించాలి. వాళ్లు ముందుకు రావడం లేదు. మరి రాష్ట ప్రభుత్వం ఏం సబ్సిడీ ఇస్తదా.. ఏమన్నా పెట్టుబడి పెడ్తతా..? జీఎస్టీ మినహాయింపు ఇస్తదా? చెప్పమంటే చెప్పడం లేదు. రాష్ట్ర ప్రభుత్వం ఏడాది నుంచి పెద్దగా స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారని కేటీఆర్ వివరించారు. సానుకూలంగా స్పందించిన కేంద్రమంత్రికి సీసీఐ సాధన సమితి తరపున ధన్యవాదాలుతెలియజేస్తూ.. మేం అధికారంలో ఉన్నప్పుడు సిర్పూర్ పేపర్ మిల్లు తెరిపించాం. అదే ఆదిలాబాద్‌జిల్లాలో మళ్లీ వెంబడ పడి తిరిగి తెరిపించి ఇవాళ వేలాది మందికిఉద్యోగ ఉపాధి అవకాశాలు కల్పించినం. సీసీఐని పునరుద్ధరిస్తామని ఎన్నికల ప్రచారంలో అమిత్ షా చెప్పారు. కేంద్ర ప్రభుత్వం ఇచ్చిన మాట నిలబెట్టుకోవాలి. రాష్ట్ర ప్రభుత్వం స్పందించడం లేదని కేంద్రమంత్రి చెప్పారు. సీసీఐని పునరుద్ధరిస్తే వేలాదిమందికి ఉద్యోగాలు వస్తాయన్నారు.

# బోనాల జాతరలో హస్తకళా మేళా

## - 16 నుంచి హైదరాబాద్ హెచ్‌ఎండిఎ గ్రౌండ్‌లో ప్రదర్శన

**హైదరాబాద్,జూలై 15 :**ఆషాఢమాస బోనాల మహోత్సవాల సందర్భంగా ఈనెల 16 నుంచి హైదరాబాద్‌లోని హెచ్‌ఎండీఏ గ్రౌండ్‌లో రాష్ట్రస్థాయి చేతివృత్తి కళాకారుల వస్తు ప్రదర్శన అమ్మకాల మేళా నిర్వహిస్తున్నట్లు బీసీ సంక్షేమ శాఖ ప్రిన్సిపల్ సెక్రటరీ , కమిషనర్ బాల మాయాదేవి తెలిపారు. బోనాల పండుగకు అవసరమైన అన్ని రకాల చేతివృత్తుల ఉత్పత్తులు ఒకే వేదికపై ప్రజలకు అందుబాటులో ఉండేలా ఈ మేళాను ఏర్పాటు చేస్తున్నామని వెల్లడించారు. రాష్ట్ర మంత్రులు భట్టి విక్రమార్క , పొన్నం ప్రభాకర్, కొండా సురేఖ ,వాకిటి శ్రీహరి , బీసీ సంక్షేమ శాఖ సలహాదారు వి.హెచ్. హనుమంతరావు, ఎంపీలు, ఎమ్మెల్యేలు ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొంటారని వివరించారు.గత ఏడాది 30 స్టాల్స్ ఏర్పాటు చేయగా, ఈ ఏడాది 60 స్టాల్స్ ఏర్పాటు చేస్తున్నామన్నారు. రాష్ట్రవ్యాప్తంగా




ఉన్న చేతివృత్తులు కుమ్మరి, కమ్మరి, వడ్రంగి, మేదరి, చేనేత , పూసల తదితర సంప్రదాయ కులవృత్తులకు చెందిన కళాకారులు తమ ఉత్పత్తులను నేరుగా ప్రజలకు విక్రయించే అవకాశాన్ని ఈ మేళా కల్పిస్తుందని ఆమె వివరించారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రజలు పెద్ద ఎత్తున ఈ మేళాను సందర్శించి సంప్రదాయ చేతివృత్తులను ఆదరించి మేళాను విజయవంతం చేయాలని కోరారు.

# కరీంనగర్ అభివృద్ధికి కృషి చేస్తా...

(మొదటి పేజీ తరువాయి)

అన్నారు. కరీంనగర్ ను మరింతగా అభివృద్ధి చేయాల్సి ఉందన్నారు. నగరంలోని 47వ డివిజన్‌లో యూడీఎఫ్ నిధులు రూ.50 లక్షలతో చేపట్టనున్న సీసీరోడ్డు పనులకు కేంద్ర మంత్రి బండి సంజయ్ శంకుస్థాపన చేశారు. అనంతరం 62వ డివిజన్ మంకమ్మతోటలో రూ. 98లక్షల వ్యయంతో చేపట్టనున్న డ్రైనేజీ నిర్మాణ పనులకు మేయర్ శ్రీనివాస్‌తో కలిసి భూమిపూజ చేశారు. ఆయన మాట్లాడుతూ.. అభివృద్ధే లక్ష్యంగా భాజపా పని చేస్తోందన్నారు. కరీంనగర్ నగరాన్ని ఇంకా అభివృద్ధి చేయాల్సి ఉందని.. మరిన్ని నిధులు తీసుకొచ్చి పనులు పూర్తి చేస్తామని మంత్రి తెలిపారు.

# తెలంగాణలో సర్ నమోదు పక్రియ

(మొదటి పేజీ తరువాయి)

అభ్యంతరాల స్వీకరణ, అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల చేస్తామని ప్రకటించింది. ఈనెల 24 వరకు ఉన్న ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణ గడువును ఆగస్టు 3వ తేదీవరకు పొడిగించింది. అనేక జిల్లాలో సర్‌పై అవగాహన లేక మందకోడిగా కొనసాగుతుండగా గడువు సమీపిస్తుండడంతో అనేక రాజకీయ పార్టీల నాయకులు, వివిధ సంఘాల ప్రతినిధులు ఎన్యూమరేషన్ ఫారాల స్వీకరణను పొడిగించాలని రాష్ట్ర ఎన్నికల సంఘానికి వినతి పత్రాలు అందించాయి దీంతో స్పందించిన కేంద్ర ఎన్నికల సంఘం ఈ గడువు పొడిగింపును ప్రకటించింది. అర్హత తేదీగా అక్టోబర్ 1వ తేదీ నాటికి ఓటర్ల వివరాల సవరణను పరిగణనలోకి తీసుకుంటూ నూతన షెడ్యూల్‌ను ప్రకటించింది. ఈ నూతన షెడ్యూల్ ప్రకారం బూత్ స్థాయి అధికారులు ఇప్పటికే జూన్ 25 నుంచి ప్రారంభించిన ఇంటింటి సర్వే పక్రియ ఆగస్టు 3 వరకు కొనసాగుతుంది. పోలింగ్ కేంద్రాల క్రమబద్ధీకరణ పనులను సైతం అధికారులు ఆగస్టు 3 నాటికి పూర్తి చేస్తారు. ఆ తర్వాత ఆగస్టు 10న రాష్ట్రవ్యాప్తంగా ఓటర్ల ముసాయిదా జాబితా అధికారికంగా విడుదల కానుంది. ముసాయిదా జాబితా విడుదలైన అనంతరం, కొత్తగా ఓటు హక్కు కోసం దరఖాస్తు చేసుకునేందుకు , తప్పుల మార్పులు-చేర్పులకు సంబంధించిన అభ్యంతరాల స్వీకరణకు ఎన్నికల సంఘం నెల రోజుల పాటు గడువునిచ్చింది. ప్రజలు ఆగస్టు 10 నుంచి సెప్టెంబర్ 9 వరకు తమ దరఖాస్తులను సమర్పించే అవకాశం కల్పించారు. ప్రజల నుంచి వచ్చే ఈ అభ్యంతరాలు, క్లెయిమ్‌లకు సంబంధించిన నోటీసుల జారీ, వాటి పూర్తి స్థాయి పరిష్కార పక్రియను అధికారులు ఆగస్టు 10 నుంచి అక్టోబర్ 8 వరకు పూర్తి చేయాల్సి ఉంటుంది. ఆ పక్రియ అంతా ముగిసిన తర్వాత అన్ని సవరణలతో కూడిన తుది ఓటర్ల జాబితాను అక్టోబర్ 12న అధికారికంగా ప్రకటించనున్నారు.

# త్వరలో నామినేటెడ్ పోస్టుల భర్తీ

(మొదటి పేజీ తరువాయి)

ఎంపీ రేణుకా చౌదరితో మాట్లాడానని మహేశ్ తెలిపారు. 'తాను మాట్లాడిన ఉద్దేశం వేరని నాతో అన్నారు. ఖమ్మంలో బీజేపీ, బీఆర్ఎస్ రెండూ కూడా కాంగ్రెస్ వైపు చూస్తున్నాయని అన్నట్లు రేణుక నాతో చెప్పారు.. కానీ ఆ వ్యాఖ్యలపై దుష్ప్రచారం చేశారు' అని తెలిపారు. కూనంనేని మిత్రపక్షం అయినప్పటికీ అక్కడ కాంగ్రెస్ క్యాడర్ కూడా ఉందన్నారు. దానిని కాపాడుకునే ప్రయత్నంలో ఎంపీ రఘురాం రెడ్డి మాట్లాడి ఉంటారని చెప్పుకొచ్చారు. కూనంనేనితో తమకెలాంటి విభేదాలూ లేవన్నారు. స్థానిక గా ఉన్న సమస్యలను స్థానికంగానే పరిష్కరించుకోవాలని చెప్పారు. ప్రతి చిన్న విషయానికి గాంధీభవన్‌కు రావటం మానుకోవాలని క్యాడర్‌కు సూచించారు. నలుగురు ఐదుగురు మినహా అందరు డీసీసీ అధ్యక్షుల పని తీరు బాగుందని మహేశ్ గౌడ్ పేర్కొన్నారు.

# 2028 నాటికి వరంగల్ ఎయిర్‌పోర్టు పూర్తి

(మొదటి పేజీ తరువాయి)

ఆరోపించారు. 2011లో రైట్స్ కంపెనీ దేశంలో ఎయిర్ పోర్టుల నిర్మాణాలకు సాధ్యాసాధ్యాలపై చేసిన అధ్యయనంలో వరంగల్, కడప పేర్లు ఉన్నాయి. మోదీ ప్రభుత్వం వచ్చాక ఉడాన్ స్కీంతో ఎయిర్ పోర్టుల పెంపునకు శ్రీకారం చుట్టింది. కొత్తగా 88 ఎయిర్‌పోర్టులకు ఆమోదం తెలిపింది. అందులో వరంగల్ కూడా ఉంది. భూసేకరణ పూర్తికాకపోవడం వల్లే ఎయిర్ పోర్టు నిర్మాణం ఇంత ఆలస్యమైంది. వరంగల్‌కు ఎయిర్‌పోర్టు వస్తోందంటే దానికి కారణం మోదీ. ఆదిలాబాద్‌లో డిఫెన్స్ ఎయిర్‌పోర్టు రాబోతోందని రామచందర్‌రావు చెప్పారు.

# కెసిఆర్‌ది ఫామ్‌హౌజ్ పాలన

(మొదటి పేజీ తరువాయి)


పరిమితమయ్యారని విమర్శించారు. ప్రభుత్వ వ్యవస్థలను నిర్వీర్యం చేసి పలు రంగాల్లో వైఫల్యాలకు కారణమయ్యారని పొంగులేటి ఆరోపించారు. సీఎం రేవంత్‌రెడ్డి నేతృత్వంలోని కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజల్లోకి వెళ్లి పాలన అందిస్తోందన్నారు. ప్రజలకు మెరుగైన సేవలు అందించేందుకు అధికారులు కృషి చేస్తున్నారని చెప్పారు. ప్రజల కోసం పనిచేసే నాయకత్వంతోనే సుపరిపాలన సాధ్యమవుతుందని పొంగులేటి పేర్కొన్నారు.

# చల్లని కబురు చెప్పిన వాతావరణ శాఖ

**హైదరాబాద్ ,జూలై 15 :** బలహీనపడిన నైరుతి రుతుపవనాలు మళ్లీ పుంజు కోనున్నాయని వాతావరణ శాఖ తెలిపింది. బంగాళాఖాతంలో మార్పుల వల్ల సముద్రపు గాలులు బలంగా వీస్తూ దట్టమైన మేఘాలు అలుముకోనున్నాయని పేర్కొంది. రెండు, మూడు రోజుల్లో ఇది అల్పపీడనంగా మారి ఒడిశా, బెంగాల్ తీరాల వైపు పయనించి, తూర్పు భారతదేశంలో వర్షాలు కురిపించనుందని వెల్లడించింది. జులై 19 వరకు తెలంగాణలోని ఉత్తర, పశ్చిమ జిల్లాల్లో వర్షాలు కురిసే అవకాశాలున్నాయని, గురువారం జోరందుకుంటాయని అంచనా వేసింది.

# సీతమ్మసాగర్‌కు పర్యావరణ అనుమతులు

- కేంద్రంతో నిరంతర సంప్రదింపులు
- ఉమ్మడి జిల్లాకు గోదావరి జలాల తరలింపు
- ప్రధాన అంశాలపై మంత్రి ఉత్తమ్‌తో తుమ్మల చర్చ



**హైదరాబాద్,జూలై 15** అత్యంత ప్రతిష్ఠాత్మకమైన సీతమ్మసాగర్ బహుళార్థ సాధక ప్రాజెక్టుకు పర్యావరణ అనుమతులు వీలైనంత త్వరగా లభించేలా కేంద్ర ప్రభుత్వంతో నిరంతరం సంప్రదింపులు జరుపుతామని రాష్ట్ర వ్యవసాయ శాఖ మంత్రి తుమ్మల నాగేశ్వరరావు తెలిపారు. బుధవారం సచివాలయంలో నీటిపారుదల శాఖ మంత్రి ఉత్తమ్ కుమార్‌రెడ్డితో ఆయన ప్రత్యేకంగా భేటీ అయ్యారు. సీతారామ ఎత్తిపోతల పథకంతోపాటు సీతమ్మసాగర్ ప్రాజెక్టుకు సంబంధించిన ప్రధాన సమస్యలను మంత్రి ఉత్తమ్ దృష్టికి తుమ్మల తీసుకెళ్లారు. రేపు మంత్రి ఉత్తమ్ ప్రాజెక్ట్ సందర్శన వెళ్తున్న నేపథ్యంలో సమస్యలను పరిష్కరించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి తుమ్మల విజ్ఞప్తి చేశారు. మంత్రి తుమ్మల మాట్లాడుతూ, పర్యావరణ, అటవీ మరియు వాతావరణ మార్పుల మంత్రిత్వ శాఖ (ఎంవోఈఎఫ్‌అండ్‌సీసీ) అనుసరిస్తున్న ప్రామాణిక కార్యా చరణ విధానం (ఎస్‌వోపీ)కు సంబంధించిన అంశం సుప్రీంకోర్టు పరిధిలో పెండింగ్‌లో ఉండటం తో మార్చి 2023 నుంచి ప్రాజెక్టు పనులు నిలిచిపోయిన సంగతిని గుర్తుచేశారు. ఈ న్యాయ పరమైన చిక్కులు వీలైనంత త్వరగా పరిష్కారమయ్యేలా, పర్యావరణ అనుమతులు మంజూరయ్యేలా రాష్ట్ర ప్రభుత్వం అన్ని స్థాయిల్లోనూ కృషి చేస్తోందని వివరించారు.

# సీఎం రేవంత్ రెడ్డి జిల్లా పర్యటకు పకడ్బందీ భద్రతా ఏర్పాట్లు చేయండి

- ●జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్
- ●అంజనపురం పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవం కు సిద్ధం.
- ● తరలివచ్చే రైతులు, ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పూర్తి చర్యలు చేపట్టాలి.
- ●ముఖ్యమంత్రి ప్రారంభించబోతున్న కొణిజర్ల మండలంలోని గోద్రైజ్ పామాయిల్ ఫ్యాక్టరీ





**ఖమ్మం/ జూలై 15/(పీపుల్స్ న్యూస్ )**
వైరా నియోజకవర్గంలోని కొణిజర్ల మండలం అంజనపురం గ్రామంలో నూతనంగా నిర్మించిన గోద్రైజ్ పామాయిల్ ఫ్యాక్టరీ ప్రారంభోత్సవానికి రాష్ట్ర ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి రానున్న నేపథ్యంలో చేపడుతున్న ఏర్పాట్లను జిల్లా కలెక్టర్ దివాకర టీఎస్, పోలీసు కమిషనర్ సునీల్ దత్, అదనపు కలెక్టర్ పి. శ్రీనివాసరెడ్డితో కలిసి బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఫ్యాక్టరీ ప్రాంగణం, సభా వేదిక, హెలిప్యాడ్, పార్కింగ్ ప్రాంతాలు, రాకపోకల మార్గాలు, భద్రతా ఏర్పాట్లు, ప్రజలకు కల్పించాల్సిన సౌకర్యాలపై అధికారులు, గోద్రైజ్ సంస్థ ప్రతినిధులకు పలు సూచనలు చేశారు.ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ దివాకర టిఎస్ మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రి పర్యటన అత్యంత ప్రతిష్ఠాత్మకమైన కార్యక్రమమని, పనిచేసి ప్రతి ఏర్పాటును ముందస్తుగా పూర్తి చేయాలని, ప్రారంభోత్సవ కార్యక్రమానికి రైతులు, ప్రజలు తరలివచ్చే అవకాశం ఉన్నందున వారికి ఎలాంటి ఇబ్బందులు కలగకుండా అన్ని సౌకర్యాలు కల్పించాలని సూచించారు.సభా ప్రాంగణంలో ప్రవేశ, నిష్క్రమణ మార్గాలను శాస్త్రీయంగా రూపొందించాలని, వీఐపీలు, ప్రజాప్రతినిధులు, రైతులు, మహిళలు, మీడియా ప్రతినిధులు, ప్రజల కోసం ప్రత్యేక మార్గాలు, ప్రత్యేక కూర్చునే ఏర్పాట్లు చేయాలని తెలిపారు. బ్యారికేడింగ్, సూచిక బోర్డులు, తగినంత వెలుతురు, తాగునీటి సదుపాయం, తాత్కాలిక మరుగుదొడ్లు, పారిశుధ్య నిర్వహణ వంటి అంశాలను అత్యంత ప్రాధాన్యతతో పూర్తి చేయాలని సూచించారు.ఈ పరిశీలనలో పోలీసు ఉన్నతాధికారులు, అదనపు కలెక్టర్లు, ఆర్ అండ్ బీ, పంచాయతీరాజ్, రెవెన్యూ, విద్యుత్, వైద్య ఆరోగ్య, అగ్నిమాపక, రవాణా, మున్సిపల్, వ్యవసాయ, ఉద్యాన, పరిశ్రమల శాఖల అధికారులు, గోద్రైజ్ సంస్థ ప్రతినిధులు తదితరులు పాల్గొన్నారు.



# బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌లో ఎస్పీ ఆకస్మిక తనిఖీ.. సిబ్బంది పనితీరుపై ప్రశంసలు

**పటాన్‌చెరు, జూలై 15:**
వార్షిక తనిఖీలలో భాగంగా సంగారెడ్డి జిల్లా ఎస్పీ పరితోష్ పంకజ్ (ఐపీఎస్), ఈరోజు బి.డి.ల్ భానూర్ పోలీస్ స్టేషన్‌ను సందర్శించారు. ఈ సందర్భంగా స్టేషన్ ఆవరణలోని పరిసరాలు, రికార్డుల నిర్వహణ మరియు సిబ్బంది పనితీరును ఆయన క్షుణ్ణంగా పరిశీలించారు.

**మొక్కలు నాటిన ఎస్పీ:**
పోలీస్ స్టేషన్‌కు చేరుకున్న ఎస్పీకి సిబ్బంది గౌరవ వందనం సమర్పించారు. అనంతరం పటాన్ చెర్వు డీఎస్పీతో కలిసి స్టేషన్ ప్రాంగణంలో మొక్కను నాటారు. స్టేషన్ పరిసరాల పరిశుభ్రత, సిబ్బంది బ్యారక్స్ నిర్వహణ పట్ల ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. సిబ్బందికి కేటాయించిన కిట్ ఆర్టికల్స్‌ను తనిఖీ చేస్తూ, వాటిని నిరంతరం సిద్ధంగా ఉంచుకోవాలని సూచించారు.

**దర్యాప్తులో నాణ్యత ముఖ్యం:**
స్టేషన్ రికార్డులను పరిశీలించిన ఎస్పీ, ప్రతి కేసులోనూ నాణ్యమైన దర్యాప్తు నిర్వహించాలని ఆదేశించారు. పెండింగ్‌లో ఉన్న కేసులు, మిస్సింగ్ కేసుల పరిష్కారానికి ఒక ప్రత్యేక 'ప్లాన్ ఆఫ్ యాక్షన్' సిద్ధం చేసుకోవాలన్నారు. బాధితులకు అండగా నిలవాలని,కేసులదర్యాప్తు నిష్పక్షపాతంగా ఉండాలని స్పష్టం చేశారు.

**ట్రాఫిక్, క్రైమ్ కంట్రోల్‌పై దిశానిర్దేశం:**
హైదరాబాద్ ఔటర్ రింగ్ రోడ్డుకు సమీపంలో ఉండటం వల్ల పెరిగే ట్రాఫిక్ సమస్యలను అధిగమించేందుకు తరచూ ఎన్‌ఫోర్స్‌మెంట్ డ్రైవ్స్ నిర్వహించాలని సూచించారు. పరిశ్రమలు అధికంగా ఉన్నందున వలస కార్మికుల కదలికలపై నిఘా ఉంచాలని, ఆస్తి సంబంధిత నేరాలు జరిగే అవకాశం ఉన్న 'బ్లాక్ స్పాట్ల'లో పగలు-రాత్రి బీట్ విధులు కఠినతరం చేయాలని ఆదేశించారు. నేరాల నియంత్రణలో సీసీ కెమెరాల పాత్రపై ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు.

**సాంకేతికతపై పట్టు సాధించాలి:**
మారుతున్న కాలానికి అనుగుణంగా సీసీటీఎన్ఎస్-2.0, టీఎస్-కాప్, సైబర్ క్రైమ్ పోర్టల్, ఈ-సాక్ష్య వంటి సాఫ్ట్‌వేర్ అప్లికేషన్లపై సిబ్బంది పూర్తిస్థాయి పట్టు సాధించాలని ఎస్పీ దిశానిర్దేశం చేశారు. స్టేషన్ రికార్డులను ఎప్పటికప్పుడు ఆన్‌లైన్‌లో నమోదు చేయాలని, సిబ్బందికి వర్టికల్ వారీగా బాధ్యతలు అప్పగించాలని ఎస్‌హెచ్‌ఓకు సూచించారు. వ్యక్తిగత





లేదా విధి నిర్వహణలో సమస్యలు ఉంటే నేరుగా తన దృష్టికి తీసుకురావచ్చని సిబ్బందికి భరోసా ఇచ్చారు.చివరగా, పోలీస్ స్టేషన్ నిర్వహణ, రికార్డుల మెయింటెనెన్స్ పట్ల ఎస్పీ సంతృప్తి వ్యక్తం చేస్తూ.. సిబ్బందిని ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో పటాన్ చెర్వు డీఎస్పీ ప్రభాకర్, స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్.హెచ్.ఓ) విజయ్ కృష్ణ, ఎస్ఐ నాగలక్ష్మి మరియు ఇతర పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

# బౌద్ధ స్తూపం పర్యాటకుల సౌకర్యార్థం నూతన బోరెవెల్ ప్రారంభోత్సవం.



**ఖమ్మం /నేలకొండపల్లి/జులై 15/(పీపుల్స్ న్యూస్ )**నెలకొండపల్లి లోని ప్రాచీనా బౌద్ధస్తూప ఆవరణములో పర్యాటకుల, సమీప స్థానికుల, ప్రయాణికుల మంచి నీటి సౌకర్యర్థం నెలకొండపల్లి శ్రీ, శ్రీమతి,శీలం. నరసింహారావు, వెంకటలక్ష్మి (నెలకొండపల్లి సర్పంచ్ ) మరియు హైదరాబాద్ చాప్టర్ వారు హ్యాండ్ బోర్ నువేయించి దానిని ఈ రోజు నెలకొండపల్లి ఎంపీడీఓ శ్రీ యర్రయ్య మరియు ఏం ఆర్వో రామ్ ప్రసాద్ లచే ప్రారంభోత్సవం చేయించారు, ఈ కార్యక్రమమును దమ్మపద చారిటబుల్ ట్రస్ట్ నల్గొండ మరియు గ్రీన్ వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ వారు సంయుక్తముగా నిర్వహించారు. ఈ కార్యక్రమము నకు నెలకొండపల్లి గ్రామ సర్పంచ్ శీలం. వెంకటలక్ష్మి బౌద్ధ బిక్షువు శ్రీ బంతే సిద్ధా రక్కిత,బి ఎల్ ఐ ఎ మెంబెర్ బసవయ్య, యూనిటీ ఇన్ డైవర్సిటీ చైర్మన్ యస్ కే .. జాఫర్, సుధా రాణి, 7వ, వార్డు మెంబెర్. లింగం. యలమంద, గ్రీన్వే ఎన్విరాన్మెంటల్ సొసైటీ అధ్యక్షులు రవికుమార్,గ్రామపంచాయతీ సిబ్బంది పాల్గొన్నారు.

# సైబరాబాద్ పరిధిలో పరిశుభ్రత పాటించని రెస్టారెంట్లు - స్విగ్గీ, జొమాటోలకు నోటీసులు



**సైబరాబాద్ :**ఊరు, పేరు లేని హోటళ్లతో కలిసి ప్రజారోగ్యాన్ని ప్రమాదంలోకి నెట్టే బంధాలను తెంచుకోవాలంటూ సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ (సీఎంసీ) ఆన్‌లైన్ ఫుడ్ డెలివరీ సంస్థలు జొమాటో, స్విగ్గీలకు స్పష్టం చేసింది. సైబరాబాద్ పరిధిలో తాము సూచించిన నిబంధనలు తప్పనిసరిగా అమలు చేయాలంటూ సైబరాబాద్ నగరపాలక సంస్థ కమిషనర్ జి.సృజన ఆ రెండు సంస్థలకు నోటీసు జారీ చేశారు.ఇది రెండో దశ మాత్రమే : సైబరాబాద్‌లోని హోటళ్లు, రెస్టారెంట్లు, ఇతర ఆహార విక్రయ కేంద్రాలు నాణ్యత ప్రమాణాలు అమలు చేయాలనే ఉద్దేశంతో నెల రోజులుగా సీఎంసీ ముమ్మర తనిఖీలు చేస్తోంది. ఆన్‌లైన్ డెలివరీలను నిలిపేస్తే నిర్వాహకులు ఆహార నాణ్యతకు ప్రాధాన్యమిస్తారనే ఉద్దేశంతో కమిషనర్ సృజన మంగళవారం స్విగ్గీ, జొమాటో ప్రతినిధులతో సమావేశం నిర్వహించారు. అడ్రస్ ?లేని, పరిశుభ్రత పాటించని, లైసెన్సు లేని హోటళ్లను ఆన్‌లైన్ ప్లాట్?ఫామ్? నుంచి తీసేయాలని ఆమె స్పష్టంగా చెప్పారు.మొదలైన తొలగింపు : జొమాటోలో శ్రీ ద్వారక గ్రాండ్ పేరుతో, స్థానికంగా రెడ్డి క్యాటరింగ్ సర్వీసెస్ పేరుతో చలామణి అవుతున్న కూకట్‌పల్లి బాగ్‌అమీర్ ప్రాంతంలోని హోటల్ వంటగదిలో పిల్లులు సంచరిస్తున్న వీడియో తాజాగా సోషల్? మీడియాలో వైరల్ అయ్యింది. దీంతో అధికారులు ఆ హోటల్‌ను పరిశీలించారు. గడువు ముగిసిన లైసెన్సుతో, పాడైపోయిన ఆహారపదార్థాలు, ఎలుకలు, బొద్దింకలతో వంట గది భయానకంగా ఉండటాన్ని చూశారు. కిచెన్ దారుణంగా ఉందని నోటీసు ఇచ్చారు. సమాచారాన్ని తెలుసుకున్న జొమాటో ఆన్‌లైన్ ఫ్లాట్‌ఫామ్ నుంచి ఆ హోటల్ పేరు పూర్తిగా తొలగించింది.పర్యవేక్షణ మీ బాధ్యతే : జీహెచ్‌ఎంసీ, ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ లైసెన్సులున్న సంస్థలనే ఆన్‌లైన్‌లో పెట్టాలని ఆయా సంస్థలకు కమిషనర్ సూచించారు. లైసెన్సు గడువు పూర్తికాగానే వాటి పేర్లు ఆన్‌లైన్ నుంచి తొలగించాలని అన్నారు. రోజువారీ తనిఖీల్లో భాగంగా హోటళ్లకు, వంట గదులకు సైబరాబాద్ మున్సిపల్ కార్పొరేషన్ ఇచ్చే రేటింగ్‌ను సరిచూసుకుంటూ ఆ మేరకు చర్యలు తీసుకోవడం మీ బాధ్యతే అని తెలిపారు. ఆ విషయంలో సీఎంసీతో కలిపి పనిచేసేందుకు ఓ నోడల్ అధికారిని నియమించాలని స్పష్టం చేశారు. ఆన్‌లైన్ వేదికపై నమోదయ్యే ప్రతి హోటల్, క్లౌడ్ కిచెన్ అడ్రస్? స్పష్టంగా పేర్కొనాలని చెప్పారు. గూగుల్ లొకేషన్ సైతం ఉండాలన్నారు. ప్రస్తుతం సీఎంసీ పరిధి నుంచి ఎన్ని హోటళ్లు మీ వద్ద నమోదయ్యాయో జాబితా ఇవ్వాలని, వారం రోజుల్లో ఫిర్యాదులపై రిపోర్టు సమర్పించాలని కమిషనర్ ఆయా సంస్థల ప్రతినిధులకు స్పష్టం చేశారు.కల్తీ ఆహారంపై ఉక్కుమోదం మోపాలన్న ప్రభుత్వ ఆదేశాలతో హైదరాబాద్ పోలీసుల ఆధ్వర్యంలో సీపీ సజ్జనార్ హెచ్?ఫాస్ట్?ను క్రియేట్ చేశారు. హెచ్ ఫాస్ట్ పేరిట ప్రత్యేక బృందాన్ని ఏర్పాటు చేసి కల్తీ పదార్థాలపై కఠిన చర్యలు తీసుకుంటున్నారు. కల్తీ లేని స్వచ్ఛమైన ఆహారం పొందడం ప్రతి పౌరుడి హక్కు అని టాస్క్‌ఫోర్స్ డీసీపీ వైభవ్ గైక్వాడ్ తెలిపారు. ఆ హక్కును కాపాడుతూ భావితరాలకు సురక్షితమైన భవిష్యత్తును అందించడమే లక్ష్యంగా హెచ్-ఫాస్ట్ పనిచేస్తుందని స్పష్టం చేశారు. వంద రోజుల్లో హైదరాబాద్ నగర వ్యాప్తంగా వివిధ జోన్ల పరిధిలో 185 కేసులు నమోదు చేసి, సుమారు 121.87 టన్నుల ప్రమాదకరమైన కల్తీ ఆహార పదార్థాలను గుర్తించి కేసులు నమోదు చేసింది.

# నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన కల్పించాలి

**సిరిసిల్ల అర్బన్, జూలై 15 :** బాలింత లకు నవజాత శిశువుల సంరక్షణపై అవగాహన కల్పిం చాలని కలెక్టర్ గరిమ అగ్రవాల్ వైద్యాధికారులను ఆదే శించారు. కలెక్టరేట్‌లో బుధవారం నవజాత శిశు వుల మరణాల నివారణ తదితర అంశాలపై వైద్య ఆరోగ్య శాఖ అధికారుతో పాటు ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల గైనకాలజిస్టులు, చిన్నపిల్లల వైద్య నిపుణులతో సమీక్ష సమావేశాన్ని కలెక్టర్ గరిమ అగ్రవాల్ నిర్వహించారు. గత మూడు నెలల్లో నవజాత శిశువుల మరణాలు, కార ణాలపై సుదీర్ఘంగా సమీక్షించారు. జిల్లా కేంద్రంలోని ప్రభుత్వం జనరల్ ఆసుపత్రి, వేములవాడ ఏరియా ఆసుపత్రిలో ఎస్‌ఎన్‌సీయూలో సేవలపై ఆరా తీశారు. ఈ సందర్భంగా కలెక్టర్ గరిమ అగ్రవాల్ ?తెలిపారు. జిల్లాలో మరణాలు సున్నా శాతం ఉండేలా చర్యలు తీసుకోవాలని సూచిం చారు. గర్భిణులకు క్రమం తప్పకుండా అన్ని ఆరోగ్య పరీక్షలు చేయాలని ఆదేశించారు. బీపీ, షుగర్, రక్త పరీ క్షలు, ఇతర వైద్య పరీక్షలు క్రమంతప్పకుండా చేయాల ని సూచించారు. అశాతం ఉండేలా చర్యలు తీసుకోవాలనిందరి వైద్య పరీక్షల వివరాలు భద్రప ర్చాలని స్పష్టం చేశారు. గర్భిణులతో అవసరమైన వ్యా యామం, యోగా ఆసనాలు వేయించాలని, నార్మల్ డెలి వరీతో లాభాలు తెలియజేస్తూ ప్రోత్స హించాలని పిలుపునిచ్చారు. ప్రభుత్వ, ప్రైవేటు ఆసుపత్రుల్లో నార్మల్ డెలివరీలు ఎక్కువ సంఖ్యలో అయ్యేలా చూడాలని పేర్కొన్నారు. బాలింతలు అప్పుడే పుట్టిన పిల్లలకు పాలు ఇవ్వడం, ఇతర జాగ్రత్తలపై వైద్యులు, సిబ్బంది అవగాహ న కల్పించాలన్నారు.పంచాయతీ అధికారి జయశీల, డీసీ హెచ్‌ఎస్ రవీం దర్, మెడికల్ ఆఫీసర్లు, గైనకాలజిస్ట్, పిల్లల వైద్య నిపు ణులు, ఐఎంఏ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# అంబరాన్నంటిన బండి రమేష్ జన్మదిన వేడుకలు.

**-ఎం డి చున్నుపాషా ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహణ.**

**కూకట్ పల్లి : జూలై 15 (పీపుల్స్ న్యూస్)** తెలంగాణ కమ్మ సంఘం కార్పొరేషన్ చైర్మన్, టీపీసీసీ ఉపాధ్యక్షులు కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జ్ బండి రమేష్ జన్మదిన వేడుకలు అంగరంగ వైభవంగా జరిగాయి. ఈ సందర్భంగ, కాంగ్రెస్ పార్టీ మూసాపేట్ డివిజన్ మాజీ అధ్యక్షులు ఎండి చున్నుపాషా ఆధ్వర్యంలో ఆంజనేయనగర్ చౌరస్తాలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగ బండి రమేష్ ని శాలువాతో ఘనంగా సన్మానించి, వారితో కేక్ కట్ చేయించి ఆనందోత్సాహాల మధ్య వేడుకలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కూకట్‌పల్లి నియోజకవర్గం కాంగ్రెస్ పార్టీ ముఖ్య నాయకులు, డివిజన్ అధ్యక్షులు, నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొని



బండి రమేష్ కి హృదయపూర్వక జన్మదిన శుభాకాంక్షలు తెలియజేసి, ఆయురారోగ్యాలతో ప్రజాసేవలో మరిన్ని విజయాలు



సాధించాలని ఆకాంక్షించారు.

## ఉమ్మడి ఆల్విన్ కాలనీ డివిజన్లో ఎస్.ఐ.ఆర్ ప్రక్రియను ప్రత్యేకంగా పరివేక్షించిన ఎర్రబెల్లి సతీష్ రావు



**కూకట్ పల్లి:** ఎస్.ఐ.ఆర్ (SIR) ప్రక్రియలో ఈరోజు శేర్లింగంపల్లి ఆల్విన్ కాలనీ డివిజన్ మరియు షంషిగూడా డివిజన్ల పరిధిలోని పలు బూత్‌లలో విస్తృతంగా సందర్శించి, అక్కడ జరుగుతున్న SIR ప్రక్రియను క్షుణ్ణంగా పరిశీలిస్తూ సంబంధిత బీ.ఎల్.ఓ లతో ప్రజలకు పంపిణీ చేసిన ఎస్.ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ల గురించి,తిరిగి అందిన ఫారమ్‌ల వివరాలు,ఇంకా పెండింగ్‌లో ఉన్న దరఖాస్తుల సమాచారాన్ని తెలుసుకుంటూ,మొత్తం ప్రక్రియను పారదర్శకంగా పర్యవేక్షించి. .అలాగే,ఏ ఒక్క అర్హత కలిగిన ఓటరు కూడా నిర్లక్ష్యానికి గురికాకుండా, ప్రతి కుటుంబం తప్పనిసరిగా ఎ.స్ఐ.ఆర్ ఎన్యూమరేషన్ ఫారమ్‌ను నింపి సంబంధిత బీ.ఎల్.ఓ కు అందించాలని ప్రజలకు మరియు అధికారులను కోరిన బీ.ఆర్.ఎస్ పార్టీ శేరిలింగంపల్లి సీనియర్ నాయకులు ఎర్రబెల్లి సతీష్ రావు..

# నకిలీ, మార్పులు చేసిన నంబర్ ప్లేట్లపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ఉక్కుపాదం

**- గత వారంలో 5 క్రిమినల్ కేసులు నమోదు**




**హైదరాబాద్ కమిషనరేట్, క్రైమ్ బ్యూరో జూలై 15 (పీపుల్స్ న్యూస్)** వాహనాల నంబర్ ప్లేట్లను తారుమారు చేయడం, నకిలీ .అనధికారిక రిజిస్ట్రేషన్ నంబర్ ప్లేట్లను ఉపయోగించడంపై పౌరుల నుండి ఫిర్యాదులు వెల్లువెత్తడంతో, హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ ప్రత్యేక నిఘా ,తనిఖీలను మరింత తీవ్రతరం చేసింది. ఇటువంటి ఉల్లంఘనలు మోటారు వాహనాల చట్టం ఇతర సంబంధిత చట్టపరమైన నిబంధనల ప్రకారం తీవ్రమైన నేరంగా పరిగణించబడతాయి.ఈ నిరంతర తనిఖీలలో భాగంగా, వాహనాల అసలు గుర్తింపును దాచడం, ట్రాఫిక్ చలానాల నుండి తప్పించుకోవడం మరియు నిబంధనలను ఉల్లంఘించడం కోసం నకిలీ రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగిస్తున్న వ్యక్తులపై గత వారంలో ఐదు (05) క్రిమినల్ కేసులు నమోదయ్యాయి. ఈ ఆపరేషన్ సమయంలో నిబంధనలకు విరుద్ధంగా ఉన్న పలు వాహనాలను గుర్తించి, సీజ్ చేయడం జరిగింది. క్రిమినల్ కేసులు నమోదైన లా అండ్ ఆర్డర్ పోలీస్ స్టేషన్ల వివరాలు జుబ్లీహిల్స్ పోలీస్ స్టేషన్ , మలక్‌పేట్ పోలీస్ స్టేషన్ , బేగంబజార్ పోలీస్ స్టేషన్ , అబిడ్స్ పోలీస్ స్టేషన్ , కాచిగూడ పోలీస్ స్టేషన్ హెచ్ఎస్ఆర్‌పీ ప్లేట్లు తప్పనిసరి: ప్రభుత్వం ఆమోదించిన హై-సెక్యూరిటీ రిజిస్ట్రేషన్ ప్లేట్లు మాత్రమే చట్టబద్ధంగా అనుమతించబడతాయి. నంబర్ ప్లేట్లపై ఎలాంటి అదనపు మార్పులు చేసినా, నంబర్లు సరిగ్గా లేకపోయినా, లేదా తాత్కాలిక స్టిక్కర్లను ఉపయోగించినా అది పూర్తిగా చట్టవిరుద్ధ మన్నారు. నకిలీ , తప్పుడు వాహన రిజిస్ట్రేషన్ పద్ధతులపై హైదరాబాద్ ట్రాఫిక్ పోలీస్ విభాగం 'జీరో టాలరెన్స్' (ఎలాంటి ఉల్లంఘనలను సహించేది లేదు) విధానాన్ని పునరుద్ఘాటించింది. నకిలీ లేదా మార్పులు చేసిన రిజిస్ట్రేషన్ ప్లేట్లను ఉపయోగిస్తే క్రిమినల్ ప్రాసిక్యూషన్‌తో పాటు వాహనాన్ని తక్షణమే సీజ్ చేయడం వంటి తీవ్రమైన చట్టపరమైన చర్యలు ఉంటాయని పౌరులను హెచ్చరిస్తున్నాము.ప్రజా భద్రత, చట్టబద్ధమైన రోడ్డు వినియోగం , నేరాల నియంత్రణను నిర్ధారించడానికి నగరవ్యాప్తంగా ఈ తనిఖీలు నిరంతరాయంగా, వ్యవస్థీకృతంగా మరియు మరింత కఠినంగా కొనసాగుతాయి. వాహన యజమానులందరూ నిర్దేశిత నంబర్ ప్లేట్ నిబంధనలను మరియు ట్రాఫిక్ నియమాలను ఖచ్చితంగా పాటించాలని ఈ సందర్భంగా కోరుతున్నాము.

## సానుకూలంగా స్పందించి పరిష్కరించండి



**కుత్బుల్లాపూర్, :** కులగణనలో ప్రతి కులానికి "యూనిక్ నేషనల్ కాస్ట్ కోడ్" అమలు చేయాలని కేంద్ర సామాజిక న్యాయం మరియు సాధికారత శాఖ సహాయ మంత్రి రాందాస్ అథవాలే కు వినతిపత్రం సమర్పించడం జరిగింది. బీసీలకు సంబంధించిన కేంద్ర ప్రభుత్వ పరిధిలోని సమస్యలు, ఓబీసీ రిజర్వేషన్ల అమలు, బ్యాక్‌లాగ్ పోస్టుల భర్తీ, విద్యా అవకాశాల పెంపు తదితర అంశాలపై కేంద్ర మంత్రి సానుకూలంగా స్పందించి, సంబంధిత శాఖలతో చర్చించి పరిష్కారం దిశగా కృషి చేస్తామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో సోషల్ జస్టిస్ పార్టీ వ్యవస్థాపకులు చామకూర రాజు, రాష్ట్ర ఇన్‌చార్జి కేవీ గౌడ్, బీసీ సమన్వయ వేదిక రాష్ట్ర అధ్యక్షులు బొమ్మ రఘురాం, వెంకట్రామయ్య , బీసీ సంఘం జిల్లా అధ్యక్షులు అశోక్ గంగపుత్ర వివిధ బీసీ సంఘాల నాయకులు, బీసీ జేఏసీ ప్రతినిధులు, సామాజిక సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు.

# ఆదిలాబాద్ సీసీఐ ను పునఃప్రారంభించండి

**- కేంద్ర మంత్రి ని కలిసిన బీఆర్ఎస్ ప్రతినిధి బృందం**



**హైదరాబాద్, :** ఆదిలాబాద్‌లోని సిమెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) పరిశ్రమను తక్షణమే పునఃప్రారంభించాలని డిమాండ్ చేస్తూ భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) ప్రతినిధి బృందం బుధవారం ఢిల్లీ లో కేంద్ర భారీ పరిశ్రమల శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామిని కలిసింది. బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్, పార్లమెంటరీ పార్టీ నేత వద్దిరాజు రవిచంద్ర, మాజీ మంత్రి జోగు రామన్నల ఆధ్వర్యంలోని సీసీఐ సాధన కమిటీ కేంద్ర మంత్రి కుమారస్వామిని కలిసి పరిశ్రమ పునరుద్ధరణకు సంబంధించి ఒక వినతిపత్రాన్ని అందజేసింది. ఈ సందర్భంగా యువనేత కేటీఆర్ మంత్రి కుమార స్వామి కి పుష్ప గుచ్చం అందజేసి, శాలువాతో సత్కరించారు. ఆదిలాబాద్ ప్రాంత ప్రజల దశాబ్దాల డిమాండ్ అయిన సీసీఐ పునఃప్రారంభంపై కేంద్ర ప్రభుత్వం సానుకూల నిర్ణయం తీసుకోవాలని మంత్రి కుమార స్వామి కి కేటీఆర్ విజ్ఞప్తి చేశారు. కేంద్ర మంత్రి ని కలిసిన ప్రతినిధి బృందం లో పలువురు పార్టీ ఎమ్మెల్యేలు, ఇతర ముఖ్య నాయకులు ఉన్నారు.

# ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాలి

**- కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు**







**శేరిలింగంపల్లి, జూలై 15 (పీపుల్స్ న్యూస్)** ఎస్.ఐ.ఆర్ కార్యక్రమం పై ప్రజలకు ఉన్న సందేహాలను నివృత్తి చేయాల్సిన బాధ్యత మనపై ఉందని శేరిలింగంపల్లి ఇంచార్జి బి.ఆర్.ఎస్ పార్టీ ఇంచార్జి,కూకట్ పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు అన్నారు. బి.ఆర్.ఎస్ పార్టీ చందానగర్ డివిజన్ మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి ఆధ్వర్యంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని ఎస్ఐ ఆర్ మీద బీఎల్ఏ కు , బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులకు, కార్య కర్తలకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాధవరం కృష్ణ రావు మాట్లాడుతూ ప్రధా నంగా.ఎప్పటికప్పుడు బి.ఎల్.ఎ, బి.ఎల్.ఓ లకు అందుబాటులో ఉండి ఏదైనా సమస్య ఉంటే వాటిని సరి చేయాలని సూచించారు. మాజీ కార్పొరేటర్ బొబ్బ నవత రెడ్డి మాట్లాడుతూ ఓటర్ల ఎవరైనా అందుబాటులో లేనప్పుడు వారి సమాచారం సేక రించి తిరిగి మళ్లీ బి.ఎల్.ఎ..బి.ఎల్.ఓ లకు వారి సమాచారం అందించి వారి ఓటును పరిరక్షించాల్సిన బాధ్యత మనపై ఉంద ని,ఓటు ప్రతి ఒక్కరి పౌరుహక్కని. ఓటును కాపాడుకోవాల్సిన బాధ్యత మన అందరిపై ఉందని అన్నారు.ఆఫీసర్లు ఇంటికి వచ్చినప్పుడు ఏమైనా సందేహాలు ఉంటే అక్కడికక్కడే తెలుసుకుని వారు ఇచ్చిన దరఖాస్తు నింపి ఇవ్వాలని ఇవన్నీ కూడా దగ్గరుండి చూసుకోవాల్సిన బాధ్యత మనందరిపై ఉందని ఈ సందర్భంగా ఆయన సూచించారు. ఈ కార్యక్రమంలో బీఎల్ ఎ, బి.ఆర్.ఎస్ పార్టీ నాయకులు ,కార్యకర్తలు పాల్గొన్నారు

## హాలో కార్మిక... చలో బాచుపల్లి.



**కుత్బుల్లాపూర్, :** కనీస వేతనాల జీవో అమలు, కార్మికుల హక్కుల పరిరక్షణ కోసం సీఐటీయూ మేడ్చల్--మల్కాజిగిరి జిల్లా కమిటీ ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీ సాయంత్రం 4:00 గంటలకు ఐడీఏ బాచుపల్లి బొల్లారం చౌరస్తాలో నిర్వహించనున్న భారీ బహిరంగ సభను జయప్రదం చేయాలని కోరుతూ బాచుపల్లిలో పోస్టర్ ఆవిష్కరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ బాచుపల్లి మండల కన్వీనర్ రాథోడ్ సంతోష్ మాట్లాడుతూ, రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన కనీస వేతనాల జీవోను అన్ని పరిశ్రమల్లో తక్షణమే అమలు చేయాలని డిమాండ్ చేశారు. కార్మికులకు చట్టబద్ధమైన కనీస వేతనాలు, ఈఎస్ఐ, పీఎఫ్ తదితర హక్కులు కల్పించాలని, కార్మికులపై యాజమాన్యాల వేధింపులను అరికట్టాలని అన్నారు. జిల్లా కమిటీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ బహిరంగ సభకు పరిశ్రమల్లో కార్మికులు కర్షకులు భారీ సంఖ్యలో హాజరై విజయవంతం చేయాలని ఆయన పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమం సిఐటియు మండల కమిటీ సభ్యులు పి.స్వామి, నరసింహ, ఎల్లమ్మ, లక్ష్మి, శీను, అంజి, మౌనిక, అలివేలు కార్మికులు తదితరులు పాల్గొన్నారు.

# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా శాపురం నర్సింహా రెడ్డి

## - 5,000 ఆర్థిక సాయం అందజేత



**పటాన్‌చెరు, జూలై 15**
సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామానికి చెందిన గుంటి అంతయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నర్సింహా రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళు లర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తన సొంత నిధుల నుంచి ?5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు.
ఈ సందర్భంగా శాపురం నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. "ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆపదలో ఉన్న కుటుంబాలకు మనవంతు సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన, భవిష్యత్తులో కూడా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# చేగుంట శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఉప సర్పంచ్ రఫీ బారి విరాళం



**చేగుంట జులై 15** చేగుంట మండలం చేగుంట శ్రీ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల వచ్చే నెల 9వ తేదీన మొదలవుతున్న సందర్భంగా చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ 1,50,000( ఒక లక్ష యాభై వేల రూపాయలు) తన వంతుగా విరాళం ఇచ్చారు. డబ్బులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడం జరిగినది వారు మాట్లాడుతూ ఆ తల్లి దీవెనలతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి, మంచిగా వర్షాలు పడాలి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆ దేవత కరుణించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పెంపు - ఎన్నికల సంఘం ప్రకటన



**హైదరాబాద్ :** తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పది రోజులు పొడిగించారు. ఈ నెల 24న పూర్తి కావల్సిన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ముసాయిదా జాబితా ఆగస్టు 10న పబ్లిష్ కానుంది. ఆ రోజు నుంచి సెప్టెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబరు 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలించి అదే నెల 12న తుది జాబితాను ప్రకటిస్తారు. ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు సగమే పూర్తయింది.రాష్ట్రంలో ఎస్ఐఆర్ షెడ్యూలును కేంద్ర ఎన్నికల కమిషన్ సవరించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వినతి మేరకు పది రోజులు పొడిగించింది. గత నెల 25 నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. పాత షెడ్యూలు ప్రకారం ఈనెల 24వరకు ఎన్యుమరేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. రాష్ట్రంలో 3 కోట్ల 38 లక్షల 26 వేల 448 మంది ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది.రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.99శాతం పూర్తయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇంకా కొన్ని ఫారాలు ఇవ్వాల్సి ఉండగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఫారాల పంపిణీ పూర్తయిందని సీఈవో కార్యాలయం వెల్లడించింది. అయితే ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి తిరిగి ఇచ్చే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55 శాతం ఓటర్లే ఫారాలు నింపి ఇచ్చారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు వెనకబడి ఉన్నాయి.
అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల : ఓటర్లకు 2002 జాబితాలో పేర్లు వెదకడం కష్టంగా ఉండటం బీఎల్‌ఓలు అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని ఓటర్లతో పాటు రాజకీయ పార్టీలు కోరాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను వివరిస్తూ ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి లేఖ రాశారు. కొత్త షెడ్యూలు ప్రకారం ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీ వరకు జరగనుంది. ఆగస్టు 3వరకు ఎన్యుమరేషన్ ఫారాలన్నీ నింపి బీఎల్‌ఓలకు ఇవ్వాల్సి ఉంటుంది.ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వక పోతే ముసాయిదా జాబితాలో ఓటు ఉండదని ఈసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఆగస్టు 10 వతేదీన డ్రాఫ్ట్ జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా ఎలాంటి అభ్యంతరాలున్నా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 9 వరకు సమర్పించవచ్చు. ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆగస్టు 10 నుంచి అక్టోబరు 8 వరకు పరిశీలించి, పరిష్కరిస్తారు. ప్రక్రియ అంతా పూర్తి చేసి అక్టోబరు 12న తుది ఓటరు జాబితాను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది.

# విద్యాసంస్థల్లో డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం: డీజీపీ సి.వి. ఆనంద్

## - ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్ నియామకం









**హైదరాబాద్, క్రైమ్ బ్యూరో జూలై 15 (పీపుల్స్ న్యూస్)**
రాష్ట్రంలోని అన్ని విద్యాసంస్థలను పూర్తిస్థాయిలో డ్రగ్స్ రహితంగా తీర్చిదిద్దడంతో పాటు విద్యార్థుల భద్రత, ఆరోగ్యం, సంక్షేమాన్ని పరిరక్షించేందుకు తెలంగాణ ప్రభుత్వం కీలక చర్యలు చేపడుతోందని రాష్ట్ర డైరెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (డీజీపీ) సి.వి. ఆనంద్ తెలిపారు. ఈ లక్ష్యంతో ఈగల్ అధికారులతో బుధవారం డీజీపీ ఉన్నతస్థాయి సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా డీజీపీ మాట్లాడుతూ మానవతా విలువలు, క్రమశిక్షణ, బాధ్యతాయుత పౌరులను తీర్చిదిద్దే విద్యా సంస్థల్లో డ్రగ్స్‌కు ఏమాత్రం చోటు ఉండకూడదని స్పష్టం చేశారు. పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థలు డ్రగ్స్ రహిత ప్రాంతాలుగా ఉండేలా కఠిన చర్యలు తీసుకోవాల్సిన అవసరం ఉందన్నారు. యువత డ్రగ్స్ బారిన పడకుండా సమగ్ర భద్రతా వ్యవస్థను ఏర్పాటు చేయడం అత్యంత కీలకమని పేర్కొన్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలోని అన్ని పాఠశాలలు, కళాశాలలు, ఇతర విద్యాసంస్థల్లో యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీలు ఏర్పాటు చేయాలని నిర్ణయించినట్లు తెలిపారు. అలాగే ప్రతి విద్యాసంస్థలో క్యాంపస్ సేఫ్టీ కోఆర్డినేటర్ నియామకాన్ని తప్పనిసరి చేయాలని సూచించారు. విద్యార్థుల భద్రత, డ్రగ్స్ నివారణ చర్యలు, అవగాహన కార్యక్రమాలు, కౌన్సెలింగ్, తల్లిదండ్రులతో సమన్వయం వంటి అంశాలను ఈ కమిటీలు పర్యవేక్షించనున్నాయి. సమావేశంలో ఈగల్ అధికారులు యాంటీ డ్రగ్స్ అండ్ సేఫ్టీ కమిటీల నిర్మాణం, బాధ్యతలు, అమలు విధానం, పర్యవేక్షణ వ్యవస్థ, విద్యాసంస్థలు పాటించాల్సిన నిబంధనలకు సంబంధించిన సమగ్ర ప్రజెంటేషన్ ఇచ్చారు. ప్రజెంటేషన్‌ను పరిశీలించిన డీజీపీ, విధివిధానాలను మరింత సమర్థవంతంగా రూపొందించే దిశగా పలు మార్పులు, చేర్పులు సూచిస్తూ అధికారులకు కీలక ఆదేశాలు జారీ చేశారు. అలాగే విద్యాశాఖ అధికారులు, ఇతర సంబంధిత శాఖలు, నిపుణుల సూచనలు, అభిప్రాయాలను పరిగణనలోకి తీసుకుని స్టాండర్డ్ ఆపరేటింగ్ ప్రొసీజర్స్, మార్గదర్శకాలను రూపొందించాలని అధికారులను ఆదేశించారు. తుది ప్రతిపాదనను ప్రభుత్వానికి సమర్పించే ముందు మరో సమీక్ష సమావేశం నిర్వహించాలని నిర్ణయించారు. డ్రగ్స్‌పై జీరో టాలరెన్స్ విధానం.విద్యాసంస్థల్లో డ్రగ్స్ విషయంలో జీరో టాలరెన్స్ విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలని డీజీపీ స్పష్టం చేశారు. డ్రగ్స్ విక్రయం, వినియోగం లేదా ప్రోత్సాహానికి సంబంధించిన ఘటనలు వెలుగులోకి వస్తే సంబంధిత విద్యాసంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని, అవసరమైతే ఆయా విద్యాసంస్థల గుర్తింపును రద్దు చేసేలా సంబంధిత అధికారులకు సిఫార్సు చేయాలని ఆదేశించారు. విద్యార్థులు విద్యాసంస్థల్లో చేరే సమయంలోనే డ్రగ్స్ వ్యతిరేక అవగాహన కల్పించడం, సైకాలజిస్టులు, కౌన్సెలర్ల సేవలు అందుబాటులో ఉంచడం, అవసరమైన వారికి కౌన్సెలింగ్ అందించడం, తల్లిదండ్రుల భాగస్వామ్యాన్ని పెంచడం, స్వచ్ఛంద సంస్థల సహకారంతో నిరంతర అవగాహన కార్యక్రమాలు నిర్వహించడం వంటి అంశాలపై సమావేశంలో విస్తృతంగా చర్చించారు.డ్రగ్స్ నియంత్రణలో పోలీసు శాఖ, విద్యాశాఖ, ఆరోగ్యశాఖ, ఇతర సంబంధిత శాఖలు సమన్వయంతో పనిచేసి సమర్థవంతమైన కార్యాచరణను అమలు చేయాలని డీజీపీ అధికారులను ఆదేశించారు.ప్రతి విద్యార్థికి సురక్షితమైన, ఆరోగ్యకరమైన, డ్రగ్స్ రహిత విద్యా వాతావరణాన్ని కల్పించడమే ప్రభుత్వ లక్ష్యం" అని డీజీపీ సి.వి. ఆనంద్ పేర్కొన్నారు.ఈ సమావేశంలో ఈగల్ డైరెక్టర్ సందీప్ శాండిల్య, ఐజీ పద్మజా రెడ్డి, ఎస్పీ గిరిధర్ తో పాటు ఈగల్ ఫోర్స్‌కు చెందిన ఇతర సీనియర్ అధికారులు పాల్గొన్నారు.

# రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించాలి

## - డీజీపీ సి.వి. ఆనంద్







**హైదరాబాద్,క్రైమ్ బ్యూరో జూలై 15 (పీపుల్స్ న్యూస్)**
రాష్ట్రంలో రోడ్డు ప్రమాదాలను సమర్థవంతంగా నియంత్రించాలని డీజీపీ సి.వి. ఆనంద్ అన్నారు. రోడ్డు భద్రతపై ఈ నూతన సంస్థ ఏర్పాటు గురించి బుధవారం డీజీపీ సి.వి. ఆనంద్ పోలీస్ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు భద్రతను మరింత బలోపేతం చేయడానికి ప్రత్యేక " ట్రాఫిక్ మేనేజ్మెంట్ ఉ రోడ్ సేఫ్టీ బ్యూరో" ఏర్పాటు దిశగా తెలంగాణ పోలీస్ శాఖ చర్యలు ప్రారంభించిందన్నారు.ట్రాఫిక్ నియంత్రణ , రోడ్డు భద్రత సంస్థ నిర్మాణం, విధులు, సిబ్బంది, సంస్థ చేపట్టాల్సిన చర్యలు, చట్టపరమైన అంశాలు, పరిపాలనా విధానాలపై డీజీపీ ఉన్నతాధికారులతో చర్చించారు. ప్రస్తుత పరిస్థితులు, ప్రమాదాల నివారణకు తీసుకోవాల్సిన చర్యలు, ఇతర రాష్ట్రాల్లో అమలవుతున్న ఉత్తమ విధానాలు, సుప్రీంకోర్టు మార్గదర్శకాలు, కేంద్ర ప్రభుత్వ నిబంధనలు, రోడ్డు భద్రతకు సంబంధించిన ప్రభుత్వ ఉత్తర్వులు (జీవోలు) తదితర అంశాలపై విస్తృతంగా చర్చించారు. రోడ్ సేఫ్టీ బ్యూరో బలోపేతం చేయడం, సంబంధిత శాఖలతో సమన్వయం పెంచడం, ప్రజల్లో రోడ్డు భద్రతపై విస్తృత అవగాహన కల్పించడం వంటి అంశాలపై కార్యాచరణ రూపొందించాలని, మరో సారి పోలీస్ అధికారుల తో సమావేశం కూడా నిర్వహించనున్నట్లు డీజీపీ తెలిపారు. ఈ కార్యక్రమంలో డి జి (ఆర్గనైజేషన్) స్వాతి లక్రా, రోడ్ భద్రత విభాగం ఐ జి రమేష్ నాయుడు, ఐ జి (పి ఉ ఎల్) గజరావు భూపాల్, జాయింట్ సిపిలు సన్ ప్రీత్ సింగ్ సింగ్, జోయల్ డేవిస్ తదితర అధికారులు పాల్గొన్నారు.

# తుది దశకు అహ్మదాబాద్ విమాన ప్రమాద దర్యాప్తు

**ఢిల్లీ, జులై 15 :** అహ్మదాబాద్ ఎయిర్ ఇండియా విమాన ప్రమాద దర్యాప్తు తుది దశకు చేరిందని కేంద్ర పౌర విమానమాన శాఖ మంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు స్పష్టం చేశారు. అతి త్వరలోనే ఈ ప్రమాదానికి సంబంధించిన తుది నివేదిక వస్తోందని పేర్కొన్నారు. త్వరగా నివేదిక ఇవ్వడం కంటే.. ప్రమాదం అసలు నిజాన్ని బయటపెట్టడమే తమకు ముఖ్యమని తెలిపారు. ఈ ఘటనపై దర్యాప్తు బృందం ఇచ్చిన నివేదికపై పూర్తి విశ్వాసం వ్యక్తం చేస్తున్నట్లు చెప్పుకొచ్చారు. గతేడాది జూన్ 12వ తేదీన అహ్మదాబాద్ ఎయిర్‌పోర్ట్‌లో ఎయిర్ ఇండియా ూూ×-171 బోయింగ్ విమానం కుప్పకూలిన విషయం తెలిసిందే. ఈ ప్రమాదంలో 229 మంది ప్రయాణికులు, 12 మంది సిబ్బందితో పాటు భూమిపై ఉన్న 19 మంది.. మొత్తం 260 మంది మృతిచెందారు. ఈ ఘటనలో విమాన వ్యవస్థలు, బ్లాక్ బాక్స్ 



డేటా, ఇంజిన్ భాగాల విశ్లేషణలో ూూ×దీ కీలక పురోగతి సాధించింది. పౌర విమానయాన శాఖకు ఐదు ప్రధాన డిమాండ్లతో బాధితుల కుటుంబ సభ్యులు లేఖలు రాశారు. ఫైనల్ రిపోర్ట్ ఇచ్చే ముందు స్వతంత్ర 'ఫుల్ ఫ్లైట్ సిమ్యులేటర్ వాలిడేషన్ టెస్టులు' నిర్వహించాలని డిమాండ్ చేశారు. దర్యాప్తు పురోగతిపై ప్రతి 15 లేదా 30 రోజులకు ఒకసారి కుటుంబాలకు అధికారికంగా సమాచారం అందించాలని అధికారులకు కేంద్రమంత్రి సూచించారు. ఈ కేసు విచారణ బృందంలో బోయింగ్ 787 నడిపిన అనుభవం ఉన్న సీనియర్ కమర్షియల్ పైలట్‌ను చేర్చాలని బాధితులు విజ్ఞప్తి చేశారు. భవిష్యత్తు చట్టపరమైన హక్కులను కోల్పోయేలా బాధితులపై ఎలాంటి బలవంతపు ఒప్పందాల సంతకాలు చేయించవద్దని అధికారులను కేంద్రమంత్రి ఆదేశించారు. ఈ ఘటనపై తుది నివేదిక విడుదలకు ఓ కచ్చితమైన కాలపరిమితిని ప్రకటించాలని కుటుంబ సభ్యులు కోరారు. బాధితుల కుటుంబ సభ్యుల లేఖపై కేంద్రమంత్రి స్పందించారు. అంతర్జాతీయ దర్యాప్తు నిబంధనల ప్రకారమే విచారణ వేగంగా సాగుతోందని కేంద్రమంత్రి రామ్మోహన్ స్పష్టం చేశారు.

# దేశంలోనే ప్రభుత్వ ఆధ్వర్యంలోని తొలి ఏఐ యూనివర్సిటీ

**కర్ణాటక:** దేశంలో ఏఐ విద్య, టెక్నాలజీ, ఆవిష్కరణలకు సంబంధించి కర్ణాటకను ఒక ప్రముఖ కేంద్రంగా తీర్చిదిద్దేందుకు రంగం సిద్ధమైంది. ఈ మేరకు 6వ తరగతి నుంచే ఏఐ విద్యను ప్రవేశపెట్టాలని, అలాగే బెంగళూరులో భారతదేశపు మొట్టమొదటి ఏఐ యూనివర్సిటీని ఏర్పాటు చేయాలని ప్రభుత్వం యోచిస్తుందని ఆ రాష్ట్ర డిప్యూటీ సీఎం డీకే శివకుమార్ బుధవారం ఎక్స్‌లో తెలిపారు. విద్య, పరిశోధన, డిజిటల్ మౌలిక సదుపాయాల్లో పెట్టుబడులు పెట్టడం ద్వారా రాష్ట్రం 'ఏఐ-స్థానిక కర్ణాటక'ను నిర్మించే దిశగా కృషి చేస్తుందని అన్నారు. ప్రతిపాదిత ఏఐ యూనివర్సిటీని బెంగళూరులో స్థాపిస్తామని, ఏఐ, వర్ధమాన సాంకేతికత ల్లో నైపుణ్యం కలిగిన నిపుణులను అభివృద్ధి చేయడంపై దృష్టిసారిస్తుందని తెలిపారు.



విద్యాసంస్థలు, స్టార్టప్‌లు, పరిశ్రమల మధ్య పరిశోధన, ఆవిష్కరణ, సహకారానికి మద్దతు ఇవ్వడానికి ప్రభుత్వం ఒక ఏఐ హబ్‌ను కూడా ఏర్పాటు చేయాలని ఆలోచిస్తుందని వెల్లడించారు. ఈ ప్రణాళికలోని ముఖ్యమైన అంశాల్లో ఏఐ విద్యను పరిచయం చేయడం అని శివకుమార్ అన్నారు. ఏఐపై విద్యార్థులకు ప్రాథమిక అవగాహన కల్పించడం, టెక్నాలజీ రంగంలో వారిని సిద్ధం చేయడమే లక్ష్యమని పేర్కొన్నారు.

# సుప్రీంకోర్టులో విచారణకు అంతరాయం





**న్యూఢిల్లీ:** సుప్రీంకోర్టులో న్యాయ విచారణకు అంతరాయం కలిగించడంతో పాటు భద్రతా సిబ్బందిపై దాడి చేసిన ఇద్దరు న్యాయ విద్యార్థులను పోలీసులు అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. (శ్రీఖష ర్బసవత్ం ఖతీతీవర్వఉ) ఉత్తరప్రదేశ్‌లోని ఎటావా జిల్లాకు చెందిన, లక్నో విశ్వవిద్యాలయంలో మూడో సంవత్సరం న్యాయ విద్యార్థి అయిన 24 ఏళ్ల ప్రబల్ ప్రతాప్ సింగ్, రాయ్‌బరేలికి చెందిన రెండవ సంవత్సరం న్యాయ విద్యార్థి 23 ఏళ్ల చందర్ భాన్ కలిసి జూలై 10న సుప్రీంకోర్టులో హంగామా చేశారు. ప్రబల్ ప్రతాప్ సింగ్ దాఖలు చేసిన స్పెషల్ లీవ్ పిటిషన్‌పై సర్వోన్నత న్యాయస్థానంలో విచారణ జరుగుతుండగా కోర్టు కార్యకలాపాలకు అంతరాయం కలిగించారు. కాగా, పిటిషనర్ అయిన ప్రబల్ ప్రతాప్ స్వయంగా కోర్టుకు హాజరై గందరగోళం సృష్టించాడు. న్యాయమూర్తులను దుర్భాషలాడటంతో పాటు కోర్టు హాలులో కాగితాలు విసిరేశాడు. అదుపు చేసేందుకు జోక్యం చేసుకున్న భద్రతా సిబ్బందిపై న్యాయ విద్యార్థులు దాడి చేసి వారి విధులను అడ్డుకున్నారు. మరోవైపు సుప్రీంకోర్టు భద్రతా సిబ్బంది ఫిర్యాదుపై ఢిల్లీ పోలీసులు స్పందించారు. ఇద్దరు న్యాయ విద్యార్థులను అరెస్ట్ చేశారు. వారిపై పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేశారు. నిందితుల ప్రవర్తనపై సుప్రీంకోర్టు సూచనల మేరకు వైద్య పరీక్షల కోసం ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హ్యూమన్ బిహేవియర్ అండ్ అలైడ్ సైన్సెస్‌కు తీసుకువెళ్లారు. అయితే ఇద్దరు న్యాయ విద్యార్థుల మానసిక ఆరోగ్యం బాగానే ఉన్నట్లుగా వైద్యులు నిర్ధారించారని పోలీస్ అధికారి తెలిపారు. దీంతో నిందితులిద్దరినీ రెండు రోజుల పోలీస్ కస్టడీకి తరలించినట్లు చెప్పారు. వారి వద్ద ఉన్న అభ్యంతరకర విషయాల కరపత్రాలను కూడా స్వాధీనం చేసుకున్నట్లు వెల్లడించారు.

# కేబీఆర్ పార్క్ చుట్టూ వన్ వే ప్రతిపాదనలపై క్షేత్రస్థాయిలో పరిశీలించిన ఉన్నతాధికారులు







**హైదరాబాద్ కమిషనరేట్,క్రైమ్ బ్యూరో జూలై 15 (పీపుల్స్ న్యూస్) :** కేబీఆర్ పార్క్ పరిసరాల్లో ట్రాఫిక్ ఇబ్బందులను తొలగించి, వాహనాల సాఫీ రాకపోకల కోసం ప్రతిపాదించిన వన్‌వే మార్గ పనులను బుధవారం ఉదయం వివిధ విభాగాల ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో ఉమ్మడిగా పరిశీలించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్, , హైదరాబాద్ పోలీస్ కమిషనర్ వీసీ సజ్జనర్, జాయింట్ సీపీ (ట్రాఫిక్) డి. జోయల్ డెవిస్, సహా వివిధ నిర్మాణ సంస్థల ప్రతినిధులు, పోలీసు అధికారులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఉదయం 7 నుంచి 9 గంటల వరకు అధికారులు కేబీఆర్ పార్క్ చుట్టూ దాదాపు ఐదు కిలోమీటర్ల మేర కాలినడకన రోడ్లు, ప్రధాన జంక్షన్లను నిశితంగా పరిశీలించారు. అగ్రసేన్ కూడలి, ఫిలింనగర్, జర్నలిస్ట్ కాలనీ, జూబ్లీహిల్స్ రోడ్ నంబర్ 45, జూబ్లీహిల్స్ చెక్‌పోస్ట్, కేబీఆర్ పార్క్ ప్రధాన ద్వారం తదితర ప్రాంతాలను సందర్శించి, అక్కడి ట్రాఫిక్ సరళిని అడిగి తెలుసుకున్నారు. హెచ్-సిటీ' ప్రాజెక్టు పనుల నేపథ్యంలో ఇటీవల ఈ మార్గంలో చేపట్టిన వన్‌వే ట్రయల్ రన్ సమయంలో తలెత్తిన సమస్యలపై చర్చించారు. కొన్ని ప్రాంతాల్లో రహదారులు ఇరుకుగా ఉండటం వల్లే రద్దీ వేళల్లో ట్రాఫిక్ స్తంభిస్తోందని గుర్తించిన అధికారులు.. ఆయా చోట్ల తక్షణమే రోడ్డు విస్తరణ పనులు చేపట్టాలని జీహెచ్‌ఎంసీ సిబ్బందిని ఆదేశించారు. అనంతరం సీపీ వీసీ సజ్జనర్ మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ చుట్టూ వన్‌వే మార్గాన్ని విజయవంతంగా అమలు చేసేందుకు వివిధ విభాగాలు చేపట్టాల్సిన పనుల పురోగతిని సమీక్షించినట్లు తెలిపారు. వాహనదారులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఉండేందుకు అవసరమైన చిన్నపాటి సివిల్ పనులను త్వరగా పూర్తి చేయాలని అధికారులకు సూచించామన్నారు. ముఖ్యంగా రోడ్డు దాటే పాదచారుల రక్షణ కోసం లేన్ మార్కింగ్‌లు, పెలికాన్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని స్పష్టం చేశారు. వీటితో పాటు ప్రస్తుతం సాగుతున్న పార్కు అభివృద్ధి పనులను మరింత వేగవంతం చేయాలని నిర్మాణ సంస్థ ప్రతినిధులకు సూచించారు. జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ మాట్లాడుతూ కేబీఆర్ పార్క్ పరిసరాల్లో రద్దీని నివారించేందుకు ప్రతిపాదించిన వన్‌వే విధానాన్ని సమర్థవంతంగా అమలు చేస్తామని చెప్పారు. హైదరాబాద్ సిటీ పోలీస్ సూచించిన పనులను త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పనులు జరిగే సమయంలో ప్రజలు సహకరించాలని కోరారు. నగరవాసులకు ప్రయాణ పరంగా ఎలాంటి ఇబ్బందులు లేకుండా చేసేందుకు పోలీస్, జీహెచ్‌ఎంసీ విభాగాలు నిరంతరం సమన్వయంతో ముందుకు సాగుతున్నాయని వివరించారు. ఈ క్షేత్రస్థాయి పరిశీలనలో ఖైరతాబాద్ జోనల్ కమిషనర్ సంతోష్, డీసీపీ (ట్రాఫిక్) కాజల్‌తో పాటు జీహెచ్‌ఎంసీ, పోలీస్ విభాగాలకు చెందిన పలువురు ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

# రష్యా చమురుపై అమెరికా టారిఫ్ బిల్లు- కేంద్రాన్ని నిలదీసిన కాంగ్రెస్


**న్యూ ఢిల్లీ :** రష్యా నుంచి చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై అమెరికాలో ప్రతిపాదిత టారిఫ్ బిల్లు రాజకీయంగా చర్చనీయాంశమైంది. ముఖ్యంగా భారత్‌పై 100 శాతం వరకు సుంకాలు విధించే అవకాశాన్ని కల్పించే బిల్లు అమెరికా సెనేట్‌లో ప్రవేశపెట్టడంతో కాంగ్రెస్ పార్టీ కేంద్ర ప్రభుత్వాన్ని ప్రశ్నించింది. ఈ అంశంపై కేంద్ర వాణిజ్య మంత్రి పీయూశ్ గోయల్ స్పష్టమైన వివరణ ఇవ్వాలని డిమాండ్ చేసింది. అమెరికాలో రిపబ్లికన్, డెమొక్రాట్ పార్టీలకు చెందిన సెనేటర్లు కలిసి రూపొందించిన ఆ బిల్లు రష్యాపై ఆర్థిక ఒత్తిడి పెంచడాన్ని లక్ష్యంగా పెట్టుకుంది. ఉక్రెయిన్‌పై రష్యా యుద్ధం కొనసాగుతున్న నేపథ్యంలో మాస్కోకు ఆర్థిక 



వనరులు అందకుండా చేయాలనే ఉద్దేశంతో ఈ ప్రతిపాదనను తీసుకొచ్చారు. రష్యా నుంచి పెద్దఎత్తున చమురు కొనుగోలు చేస్తున్న దేశాలపై టారిఫ్‌లు విధించే అధికారం అమెరికా అధ్యక్షుడికి కల్పించేలా బిల్లును రూపొందించారు. ఆ బిల్లుపై ఢిల్లీలో కాంగ్రెస్ మీడియా, ప్రచార విభాగం చైర్మన్ పవన్ ఖేరా తీవ్రంగా స్పందించారు. అమెరికాతో వాణిజ్య ఒప్పందాలపై వార్తలను ఖండించడంలో ముందుండే కేంద్ర మంత్రి పీయూశ్ గోయల్ ఇప్పుడు ఈ అంశంపై స్పందించాలని ఆయన డిమాండ్ చేశారు. అమెరికా హౌస్‌లోని డెమొక్రాట్లు మాత్రమే కాకుండా, ట్రంప్‌నకు మద్దతుగా ఉన్న రిపబ్లికన్ సెనేటర్లు కూడా ఈ బిల్లును సమర్థిస్తున్నారని ఆయన గుర్తు చేశారు. సోషల్ మీడియా వేదిక ఎక్స్‌లో పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా ప్రాధాన్యం సంతరించుకున్నాయి. "రష్యా చమురు కొనుగోలు చేయడానికి ట్రంప్ అనుమతి అవసరమైన పరిస్థితి వచ్చిందా? ఇప్పుడు అదే కారణంతో భారత్‌పై శిక్షాత్మక టారిఫ్‌లు విధిస్తామని హెచ్చరించవేదిక ఎక్స్‌లో పవన్ ఖేరా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా దం అవమానకరం" అని ఆయన పేర్కొన్నారు. భారత విదేశాంగ విధానం, ఇంధన విధానం స్వతంత్రంగా ఉండాలని, దేశ ప్రయోజనాలే ప్రధానంగా ఉండాలని కాంగ్రెస్ అభిప్రాయపడుతోంది.

# సర్‌లో పాల్గొన్న సిబ్బందికి 6 వేల గౌరవ వేతనం

**న్యూఢిల్లీ:** కేంద్ర ఎన్నికల సంఘం ఓటర్ల జాబితా సమగ్ర ప్రత్యేక సవరణ. కార్యక్రమాన్ని నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. పంజాబ్, హర్యానా, చండీఘడ్‌తో పాటు అనేక రాష్ట్రాల్లో సర్ ప్రక్రియ జరుగుతోంది. అయితే స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ వివరాలు సేకరిస్తున్న బూత్ లెవల్ ఆఫీసర్లు(బీఎల్వోలు), బూత్ లెవల్ సూపర్‌వైజర్లు(బీఎల్ఎస్)కు గౌరవ వేతనంగా 6 వేలు ఇవ్వాలని కేంద్రం ఎన్నికల సంఘం ఆదేశాలు జారీ చేసింది. మంగవారం రాత్రి ఆ ఆదేశాలు ఇచ్చారు. ప్రస్తుతం తెలంగాణలోనూ సర్ ప్రక్రియ నిర్వహిస్తున్న విషయం తెలిసిందే. తమ విధులకు ఇచ్చే జీతంతో పాటు ఒక్కసారి మాత్రమే అదనంగా 6వేల గౌరవ వేతనాన్ని ఇవ్వనున్నట్లు ఈసీ పేర్కొన్నది. ఆంధ్రప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్, దాద్రా నగర్ హవేలీ, డామన్ డయూ, జార్ఖండ్, మహారాష్ట్ర, కర్నాటక, మణిపూర్, మేఘాలయా, మిజోరం, 



నాగాలాండ్, ఒడిశా, సిక్కిం, తెలంగాణ, త్రిపుర, ఉత్తరాఖండ్ రాష్ట్రాల్లో ప్రస్తుతం సర్ ప్రక్రియ చేపట్టారు. అయితే ఓటర్ల వివరాలను సేకరిస్తున్న బూత్ లెవల్ అధికారులకు ఈ ప్రక్రియ వల్ల లబ్ధి చేకూరనున్నది.


# దీదీని వీడిన సీనియర్ నేత.. టీఎంసీ రెబల్స్ బృందంలోకి మదన్ మిత్రా



**కోల్‌కతా:** తృణమూల్ కాంగ్రెస్ పార్టీకి మరో జలక్ తగిలింది. సీనియర్ నేత మదన్ మిత్రా ఆ పార్టీకి గుడ్‌బై చెప్పారు. ఇవాళ ఆయన రిపోర్టర్లతో మాట్లాడారు. తృణమూల్ పార్టీ ఇప్పుడు ముక్కలైందన్నారు. పశ్చిమ బెంగాల్‌లోని నార్త్ 24 పరగనాస్ జిల్లాలో ఉన్న కామర్‌హాతి సీటు నుంచి ఆయన ఎమ్మెల్యేగా గెలుపొందారు. నేను టీఎంసీలో ఉన్నానని, టీఎంసీలోనే కొనసాగు తానని, కానీ అసెంబ్లీలో మాత్రం తన రూమ్‌ను మార్చుకున్నట్లు ఆయన చెప్పారు. ఇటీవల మమతా బెనర్జీ నేతృత్వంలోని టీఎంసీ పార్టీని అనేక మంది నేతలు వీడిన విషయం తెలిసిందే. దీదీకి చెందిన పార్టీ నుంచి తప్పుకున్న మదన్ మిత్రా.. రెబల్స్ దళంలో చేరినట్లు తెలుస్తోంది.

# నోయిడాలో భారీ అగ్ని ప్రమాదం- ఇద్దరు మృతి- భవనంలో చిక్కుకున్న 50 కుటుంబాలు!

**నోయిడా:** ఉత్తరప్రదేశ్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. నోయిడాలో బుధవారం నాలు గంతస్తుల భవనంలో మంటలు చెలరేగాయి. దీంతో ఆ ప్రాంతంలో దట్టమైన పొగ అలుముకుంది. ఈ ప్రమాదంలో ఇద్దరు మృతి చెందినట్లు పోలీసులు తెలిపారు. సుమారు 50 మందిని సురక్షితంగా బయటకు తీసుకువచ్చామని పేర్కొన్నారు. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం, సెక్టార్ 66లోని మామురా గ్రామంలో ఉన్న గ్రౌండ్ ప్లస్ ఫోర్ భవనంలో పలు కుటుంబాలు అద్దెకు నివాసం ఉంటున్నాయి. అయితే, బుధవారం భవనం లోపల ఓ ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనానికి ఛార్జింగ్ పెడుతున్న సమయంలో అకస్మాత్తుగా మంటలు 



చెలరేగాయి. ఆ మంటలు ఆ ప్రాంతంలో పార్క్ చేసి ఉన్న ద్విచక్ర వాహనాలకు కూడా వ్యాపించాయి. ఈ ప్రమాదం గురించి సమాచారం అందిన వెంటనే అధికారులు అప్రమత్తమయ్యారు. మంటల్లో చిక్కుకున్న సుమారు 50 కుటుంబాలను, హైడ్రాలిక్ యంత్రాల సహాయంతో రక్షించారు. వీటి సహాయంతో కిటికీలు, భవన పైకప్పుల ద్వారా మంటల్లో చిక్కుకున్న వారిని వేగంగా ఖాళీ చేయించడం సాధ్యమైందని పోలీసులు తెలిపారు. అలాగే, ఘటనా స్థలికి అగ్నిమాపక వాహనాలను పంపించి మంటలను అదుపులోకి తీసుకువచ్చామన్నారు. స్థానిక నివాసితులను సురక్షితంగా ఖాళీ చేయించామని పేర్కొన్నారు. ఇదిలా ఉండగా ఈ ఘటనపై సెంట్రల్ నోయిడా డీసీపీ శైలేంద్ర సింగ్ వివరాలు వెల్లడించారు. "ఒక నివాస భవనం మొదటి అంతస్తులో ఎలక్ట్రిక్ (జుం) స్కూటర్ స్పార్కింగ్ (నిప్పురవ్వలు) కారణంగా వాహనానికి మంటలు అంటుకున్నాయి. ఆ తర్వాత, దాని చుట్టూ పార్క్ చేసిన ఇతర వాహనాలకు కూడా మంటలు వ్యాపించాయి. మంటల వల్ల వచ్చిన పొగ పై అంతస్తుల వరకు చేరాయి. సమాచారం అందుకున్న వెంటనే పోలీసులు, అగ్నిమాపక సిబ్బంది ఘటనా స్థలానికి చేరుకుని సహాయక చర్యలు చేపట్టారు. అక్కడి నుంచి సుమారు 100కు పైగా కుటుంబాలను సురక్షితంగా బయటకు తరలించాం. ఈ ఘటనలో ఎవరికీ గాయాలు కాలేదు, కానీ ఇద్దరి ఆరోగ్యం క్షీణించడంతో వారిని ఆసుపత్రికి తరలించారు. భవన నిర్వాహకుడిపై కేసు నమోదు చేసి, అతన్ని అదుపులోకి తీసుకున్నాం. తదుపరి చర్యలు కొనసాగుతున్నాయి" అని తెలిపారు.

# సంపాదకీయం



## నదుల అనుసంధానమే పరిష్కారం

ఎల్‌నినో ప్రభావంతో దేశవ్యాప్తంగా వర్షాలు వెనక్కి పోయాయి. ఇప్పట్లో వానలు పడతాయన్న భరోసా లేదు. ఈ క్రమంలో తాగు,సాగునీటి సమస్యలతో పాటు ఆహార పదార్థాల లభ్యతపైనా ఆందోళన కలుగుతోంది. ఈ క్రమంలో ప్రత్యామ్నాయ చర్యలపై కేంద్రం నిర్ణయాలు తీసుకోవాలి. ఈ నెల 20 నుంచి పార్లమెంట్ సమావేశాలు ప్రారంభం కాబోతున్నాయి. ఈ సమావేశాల్లో ఎల్‌నినో పరిస్థితులు, ప్రత్యామ్నాయాలపై చర్చించాలి. సాగు,తాగునీటికి శాశ్వత ప్రణాళికలపై చర్చించాలి. కేవలం రాజకీయ ఎజెండాలతో ముందుకు సాగకుండా, వాటిని పక్కన పెట్టి ప్రజల కోసం నేతలు ఆలోచన చేయాలి. నదుల అనుసంధానం ఇందులో ప్రధానమైన సమస్య. మనదేశంలో ఎన్నో జీవనదులు ఉన్నాయి. వీటిని సన్మార్గం పట్టిస్తే దేశంలో కరువు కాటకాలకు వీలుండదు. నదులను అనుసంధానించడం, జలరక్షణను జాతీయ విధానంగా తీసుకోవడం తక్షణావసరంగా గుర్తించాలి. రాష్ట్రాల మధ్య తగవులు తీరాలంటే ఇదే మంచి పద్ధతి. నదుల్లో నీరు సముద్రంలోకి వృధాగా పోకుండా మళ్లింపు చర్యలు తీసుకోవాలి. దీనికి నదుల అనుసందానం చేయాలి. అలాగే నీటి సంరక్షణను కేంద్రం ఆధీనంలోకి తీసుకుని ఆయా రాష్ట్రాల అవసరాలను నెరవేర్చగలగాలి. ఇది చాలా ప్రధానమైన సమస్య. ఈ వర్షాకాల సమావేశంలో పార్లమెంట్ దీనిపై ఎన్నిరోజులైనా చర్చించాలి. అలాగే సమగ్ర ప్రణాళికలు సిద్దం చేయాలి. ఎన్నివేల కోట్లు అయినా నిధులు కేటాయించాలి. అప్పుడే దేశం ఎల్‌నినో లాంటి పరిస్థితులు వచ్చినా తట్టుకుంటుంది. ఎల్‌నినో ప్రభావాన్ని మనం ఆపలేం కనుక, దాని వల్ల కలిగే నష్టాన్ని తగ్గించవచ్చు. అందుకు ఇప్పటి నుంచే సరైన ప్రణాళిక, శాస్త్రీయ దృష్టి, సమర్థమైన ప్రభుత్వ విధానాలు, రైతులకు సకాలంలో మద్దతు అత్యవసరం. లేకపోతే వాతావరణ సంక్షోభం కేవలం వ్యవసాయాన్నే కాదు.. దేశ ఆహార భద్రతను, గ్రామీణ ఆర్థిక వ్యవస్థను, కోట్లాది ప్రజల జీవనోపాధిని తీవ్రంగా దెబ్బతీసే ప్రమాదం ఉంది. భారతదేశంలో దాదాపు 60 శాతం వ్యవసాయం ఇప్పటికీ వర్షాలపైనే ఆధారపడి ఉంది. ముఖ్యంగా పప్పుధాన్యాలు, నూనెగింజలు, చిరుధాన్యాలు, పత్తి వంటి పంటలు ఎక్కువగా వర్షాధార ప్రాంతాల్లోనే సాగవుతాయి. వర్షాలు తగ్గితే దిగుబడులు పడిపోతాయి. రైతుల ఆదాయం తగ్గుతుంది. అప్పులు పెరుగుతాయి. చివరకు దేశ ఆహార భద్రత కూడా ప్రమాదంలో పడుతుంది. అందుకే వాతావరణ మార్పు అనేది కేవలం ప్రకృతి సమస్య కాదు.. అది ఆర్థిక, సామాజిక, ఆహార భద్రతకు సంబంధించిన పెద్ద సవాల్‌గా గుర్తించాలి. ఇటీవలి సంవత్సరాల్లో భారతదేశం తీవ్ర వాతావరణ వైపరీత్యాలను వరుసగా చూస్తోంది. ఒకవైపు రికార్డు స్థాయి ఉష్ణోగ్రతలు నమోదవుతుండగా, మరోవైపు కొద్ది గంటల్లోనే నెల రోజుల వర్షం కురిసే పరిస్థితులు కనిపిస్తున్నాయి. జూన్‌లో భారీ వర్షాలు, ఆగస్టు లేదా అక్టోబరులో తీవ్ర పొడి వాతావరణం వంటి అసాధారణ పరిస్థితులు సాధారణమైపోతున్నాయి. పశ్చిమ వాతావరణ కల్లోలాలు, వేడి గాలులు, ఆకస్మిక తుఫాన్లు సంప్రదాయ వాతావరణ చక్రాన్ని పూర్తిగా మార్చేశాయి. ఈ పరిస్థితుల్లో రైతులు గత అనుభవాల ఆధారంగా పంటలు వేయడం ప్రమాదకరంగా మారుతోంది. ఆహార ధాన్యాల ఉత్పత్తి తగ్గితే దాని ప్రభావం కేవలం రైతులకే పరిమితం కాదు. మార్కెట్లో ధరలు పెరుగుతాయి. పేద, మధ్యతరగతి కుటుంబాలపై అదనపు భారం పడుతుంది. గోధుమలు, బియ్యం, పప్పులు, వంటనూనెల ధరలు పెరిగితే ద్రవ్యోల్బణం కూడా అధికమవుతుంది. గతంలో గోధుమలు, కొన్ని రకాల బియ్యం, చక్కెర ఎగుమతులపై ఆంక్షలు విధించాల్సి వచ్చిన సందర్భాలు ఉన్నాయి. దీనికి ప్రధాన కారణం దేశీయ అవసరాలను ముందుగా తీర్చాల్సిన పరిస్థితి ఏర్పడటమే. వాతావరణ మార్పులు ఇప్పుడు భవిష్యత్ ప్రమాదం కాదు.. వర్తమాన వాస్తవం. ఒకప్పుడు ఋతువులు సమయానికి వచ్చేవి. వర్షాలు ఒక క్రమంలో కురిసేవి. రైతులు వాటిని ఆధారంగా చేసుకుని సాగు ప్రణాళికలు రూపొందించేవారు. కానీ ఇప్పుడు పరిస్థితి పూర్తిగా మారిపోయింది. ప్రపంచ పరిస్థితులు కూడా భారత్‌కు కొత్త సవాళ్లు విసురు తున్నాయి. అంతర్జాతీయ ఉద్రిక్తతలు, యుద్దాలు, సరఫరా వ్యవస్థల్లో అంతరాయాలు కారణంగా ఇంధనాలు, ఎరువులు, ఖనిజాల ధరలు పెరుగుతున్నాయి. ఇవి వ్యవసాయ వ్యయాన్ని మరింత పెంచుతున్నాయి. ఖరీఫ్ సీజన్‌కు ఎరువుల నిల్వలు ఉన్నప్పటికీ, రబీ సీజన్‌కు సరిపోతాయా అనే సందేహాలు ఉన్నాయి. వాతావరణ మార్పుల కారణంగా పంటలపై తెగుళ్లు పెరిగితే పురుగుమందుల అవసరం కూడా అధికమవుతుంది. ఇలాంటి పరిస్థితుల్లో సంప్రదాయ వ్యవసాయ పద్ధతులు మాత్రమే సరిపోవు. రైతులు వాతావరణానికి అనుగుణంగా పంటల ఎంపిక, సాగు పద్ధతులు మార్చుకోవాలి. మట్టిలో సేంద్రియ పదార్థాన్ని పెంచడం కూడా అత్యంత అవసరం. ఆవుపేడ, కంపోస్ట్, పెరటి ఎరువులు, జీవబొగ్గు వంటి సహజ వనరులను వినియోగించడం ద్వారా నేల నీటిని నిల్వ చేసుకునే సామర్థ్యం పెరుగుతుంది. దీంతో వర్షాలు ఆలస్యమైనా పంటలకు రక్షణ లభిస్తుంది. రసాయన ఎరువులపై ఆధారపడటాన్ని క్రమంగా తగ్గిస్తూ సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించాల్సిన అవసరం ఉంది. అదే సమయంలో పంటల బీమా వ్యవస్థను మరింత సమర్థవంతంగా అమలు చేయాలి. ముఖ్యంగా వర్షాధార ప్రాంతాల్లోని రైతులంద రికీ బీమా రక్షణ కల్పించాలి. ప్రకృతి వైపరీత్యాల వల్ల నష్టపోయిన రైతులకు త్వరితగతిన పరిహారం అందేలా వ్యవస్థను బలోపేతం చేయాలి. అలాగే బహుళ పంటల సాగును ప్రోత్సహించడం ద్వారా ఒకే పంటపై ఆధారపడే ప్రమాదాన్ని తగ్గించవచ్చు. దేశ ఆహార భద్రతను కాపాడాలంటే ఉత్పత్తి పెరగడం మాత్రమే కాదు.. నిల్వ సామర్థ్యం కూడా పెరగాలి. ప్రస్తుతం పంట కోత తర్వాత సరైన గిడ్డంగులు లేక లక్షల టన్నుల ధాన్యం వృథా అవుతోంది. ప్రతి గ్రామం లేదా మండల స్థాయిలో ఆధునిక గిడ్డంగులు నిర్మించి, రైతుల భాగస్వామ్యంతో నిర్వహించే విధానాన్ని అమలు చేయాలి. యువ పారిశ్రామికవేత్తలను ఈ రంగంలో ప్రోత్సహిస్తే గ్రామీణ ఉపాధి పెరగడంతో పాటు ఆహార నిల్వ వ్యవస్థ కూడా బలపడుతుంది.వాతావరణ మార్పులు ఇక తాత్కాలిక సమస్య కాదు. రాబోయే దశాబ్దాల్లో ఇవే వ్యవసాయ విధానాలను నిర్ణయించే ప్రధాన అంశంగా మారనున్నాయి. అందువల్ల ప్రభుత్వాలు, శాస్త్రవేత్తలు, రైతులు, సమాజం కలిసి ముందస్తు ప్రణాళికతో పనిచేయాలి.

# నియోజకవర్గ సమస్యలపై ఎమ్మెల్యే దీక్ష

### ఇంట్లోనే గృహనిర్బంధం చేసిన పోలీసులు

### పోలీసుల తీరుపై మండిపడ్డ మాజీమంత్రి వేముల

### వెంటనే బాల్కొండ సమస్యలు పరిష్కరించాలని డిమాండ్




**నిజామాబాద్,జూలై15:** బాల్కొండ నియోజకవర్గం, భీంగల్ ప్రజల దశాబ్దాల కల అయిన అభివృద్ధి పనులను తక్షణమే పూర్తి చేయాలని డిమాండ్ చేస్తూ బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డిఒకరోజు నిరాహారదీక్ష చేపట్టారు. అయితే తాను తలపెట్టిన శాంతియుత 'కఠోర నిరాహార దీక్ష'ను పోలీసు బలగాలతో అడ్డుకోవడం రాష్ట్ర ప్రభుత్వ అప్రజాస్వామిక, రాక్షస చర్య అని ప్రశాంత్ రెడ్డి తీవ్రస్థాయిలో మండిపడ్డారు. ప్రజా సమస్యల సాధన కోసం తాను అహింసా మార్గంలో నిరసన తెలియజేస్తుంటే, ప్రభుత్వం పోలీసులతో ఉక్కుపాదం మోపాలని చూడటం శోచనీయమన్నారు. ఈ మేరకు బుధవారం ఆయన ఒక పత్రికా ప్రకటన విడుదల చేశారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరై, దాదాపు 75 శాతం పనులు పూర్తి చేసుకున్న భీంగల్ 100 పడకల ఆసుపత్రి నిర్మాణాన్ని వెంటనే పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని వేముల ప్రశాంత్ రెడ్డి డిమాండ్ చేశారు. అలాగే, భీంగల్ ఇంటిగ్రేటెడ్ మార్కెట్ పనులు పూర్తి చేయాలని, మూతపడిన భీంగల్ బస్ డిపోను పునఃప్రారంభించాలని కోరారు. గత మున్సిపల్ ఎన్నికల ముందు రూ. 12 కోట్ల నిధులతో ప్రారంభించిన సీసీ రోడ్ల నిర్మాణ పనులు ఇంకా అసంపూర్తిగా ఉన్నాయని, వాటిని వెంటనే పూర్తి చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ఈ పెండింగ్ పనుల సాధన కోసమే 15వ తేదీన చుక్క మంచి నీరు కూడా ముట్టకుండా ఒక రోజు కఠోర నిరాహార దీక్షకు పూనుకున్నట్లు ఆయన స్పష్టం చేశారు. ప్రజలకు ఇబ్బంది కలగకుండా, ఎలాంటి రాస్తారోకోలు, ధర్నాలు చేయకుండా, తనకు తాను శిక్ష వేసుకుంటూ అత్యంత శాంతియుతంగా ఒకరోజు దీక్ష చేస్తానని ప్రకటిస్తే ప్రభుత్వం ఎందుకు ఉలిక్కిపడు తోందని ప్రశాంత్ రెడ్డి ప్రశ్నించారు. తాను ఉదయం నిద్రలేవక ముందే, కనీసం స్నానం కూడా చేయకముందే వందలాది మంది పోలీసులు తన ఇంటిని చుట్టుముట్టి తనను బయటకు వెళ్లనివ్వకుండా గృహ నిర్బంధం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. నియోజకవర్గంలోని అన్ని మండలాల్లో పార్టీ కార్యకర్తలను ఎక్కడికక్కడ అక్రమంగా అరెస్టు చేసి జైళ్లలో పెడుతున్నారని, భీంగల్ లో ఏర్పాటు చేసిన దీక్షా శిబిరాన్ని తొలగించి, ఫ్లెక్సీలను సైతం చించేయడం ప్రభుత్వ రాక్షసత్వానికి నిదర్శనమన్నారు. ప్రభుత్వానికి నిజంగా ప్రజల పట్ల చిత్తశుద్ధి ఉంటే, ఈ అభివృద్ధి పనులను నెల లేదా రెండు నెలల్లో పూర్తి చేస్తామని అధికారికంగా స్పష్టమైన హామీ ఇస్తే తాను తక్షణమే ఈ ఒక్కరోజు చేపట్టిన దీక్ష విరమిస్తానని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. అది చేతకాక, పోలీసులతో బెదిరిస్తే భయపడేది లేదని తేల్చిచెప్పారు. ప్రజా ప్రతినిధిగా ప్రజల పక్షాన పోరాడాల్సిన బాధ్యత తనపై ఉందన్నారు. తనను ఇంట్లో నిర్బంధించినా, పోలీస్ స్టేషన్ కు తరలించినా, లేదా జైల్లో పెట్టినా తన సత్యాగ్రహం, కఠోర నిరాహార దీక్ష ఎక్కడ ఉంటే అక్కడే కొనసాగుతుందని వేముల ప్రశాంత్ రెడ్డి స్పష్టం చేశారు. భీంగల్ పట్టణ, మండల ప్రజలు, యువత, కుల సంఘాలు, వీడీసీ సభ్యులు, బాల్కొండ నియోజ కవర్గ ప్రజలందరూ ఈ న్యాయమైన పోరాటానికి మరియు నిరాహార దీక్షకు మనస్ఫూర్తిగా మద్దతు తెలపాలని విజ్ఞప్తి చేశారు. మరోవైపు బాల్కొండ ఎమ్మెల్యే వేముల ప్రశాంత్ రెడ్డి తలపెట్టిన నిరాహార దీక్షను భగ్నం చేసేందుకు. ఉదయం నుంచి బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఎక్కడికక్కడ గృహనిర్బంధాలతో పాటు అరెస్టు చేసి పలు పోలీస్ స్టేషన్లకు తరలించారు. ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని వేల్పూర్‌లోని ఆయన నివాసంలో పోలీసులు హౌస్ అరెస్ట్ చేశారు. శాంతియుతంగా నిరసన చేయాలని తలపెట్టగా రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఉదయం నుంచి నిర్బంధాలతో బీఆర్ఎస్ పార్టీ శ్రేణులను ఇబ్బందులకు గురిచేస్తుందని ఆరోపించారు.



# అమెరికాలో టైమ్ సవరణ విధానానికి చెక్

- బిల్లును ఆమోదించిన ప్రతినిధుల సభ



**వాషింగ్టన్,జూలై15:** ఏటా రెండుసార్లు గడియారాల్లో సమయాన్ని మార్చే విధానానికి స్వస్తి పలికేందుకు అమెరికా ప్రభుత్వం కీలక ముందడుగు వేసింది. 'డేలైట్ సేవింగ్ టైమ్'ను ఏడాది పొడవునా శాశ్వతం చేయడం కోసం ప్రవేశపెట్టిన 'సన్‌÷న్ ప్రొటెక్షన్ యాక్ట్' బిల్లుకు అక్కడి ప్రతినిధుల సభ ఆమోదం తెలిపింది. ప్రతినిధుల సభలో మంగళవారం జరిగిన ఓటింగ్‌లో 308-117 ఓట్ల భారీ మెజారిటీతో ఈ బిల్లు ఆమోదం పొందింది. ప్రతినిధుల సభలో ఆమోదం పొందిన ఈ బిల్లు అధ్యక్షుడు సంతకం చేస్తే అధికారిక చట్టంగా మారుతుంది. అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఈ బిల్లుకు పూర్తి మద్దతు ప్రకటించారు. తాను అధికారంలోకి వస్తే ఈ గడియారాలు మార్చే విధానాన్ని ముగిస్తానని గతంలోనే ఆయన హామీ ఇచ్చారు. ఈ చట్టం వల్ల ప్రజలకు సాయంత్రం పూట ఎక్కువ సమయం లభిస్తుందని ఆయన పేర్కొన్నారు. ట్రంప్ ఈ బిల్లుపై అతి త్వరలో సంతకం చేయనున్నారు. సూర్యుడు త్వరగా ఉదయించే వేసవి నెలల్లో.. ఉదయం 4 నుంచి 5 గంటలకే ఎండ వచ్చేస్తుంది. ఆ సమయంలో చాలామంది నిద్రపోతుంటారు. చాలా వరకు సమయం నిద్రలోనే వృధా అవుతుంది. గడియారాన్ని ఒక గంట ముందుకు జరపడం వల్ల.. సాయంత్రం పూట సహజమైన సూర్యకాంతిని ఎక్కువ సమయం ఉపయోగించుకోవడానికి అవకాశం ఉంటుంది. అమెరికా, కెనడా, బ్రిటన్, ఐరోపా దేశాలతో పాటు దాదాపు 70కి పైగా దేశాలు ఈ విధానాన్ని పాటిస్తున్నాయి. అమెరికన్లు వేసవి కాలంలో గడియారాలను ఒక గంట ముందుకు జరుపుతారు. దీన్నే 'స్ప్రింగ్ ఫార్వర్డ్' అంటారు. శీతాకాలంలో మళ్లీ ఒక గంట వెనక్కి జరుపుతారు. దీన్నే 'ఫాల్ బ్యాక్' అంటారు. ఇలా సమయాన్ని మార్చే విధానాన్ని పూర్తిగా ఆపేసి.. ఏడాది పొడవునా ఒకే టైమ్ ఉంచాలనే ఉద్దేశంతోనే అమెరికా ప్రభుత్వం కొత్త బిల్లును తీసుకువచ్చింది.



# ఎమ్మెల్యేను నిర్బంధించడం దారుణం

- ఇదేనా ప్రజాప్రభుత్వం

### అంటూ హరీష్ రావు ఫైర్

**హైదరాబాద్,జూలై15:** నిజామాబాద్ జిల్లా బాల్కొండ నియోజకవర్గం వేల్పూర్‌లోని తన నివాసంలో ఎమ్మెల్యే ప్రశాంత్ రెడ్డిని పోలీసులు నిర్బంధించడాన్ని బీఆర్ఎస్ పార్టీ తీవ్రంగా ఖండిస్తోందని డిప్యూటీ ఎ÷-లోర్ లీడర్ హరీశ్‌రావు తెలిపారు. భీంగల్ మున్సిపాలిటీ అభివృద్ధి, 100 పడకల ఆసుపత్రి నిర్మాణం, ఆర్టీసీ డిపో పునరుద్ధరణ వంటి ప్రజా సమస్యలపై కాంగ్రెస్ ప్రభుత్వాన్ని నిలదీస్తూ శాంతియుతంగా నిరాహార దీక్ష చేపట్టాలని ప్రశాంత్ రెడ్డి నిర్ణయించుకుంటే? ఆయనను పోలీసులు నిర్బంధించడం రేవంత్ రెడ్డి ప్రభుత్వ ప్రజాస్వామ్య వ్యతిరేక పాలనకు నిదర్శనమని మండిపడ్డారు. తమది 'ప్రజా ప్రభుత్వం' అని చెప్పుకుంటూ ప్రతిపక్షాన్ని నిర్బంధించడం, పోలీసు రాజ్యాన్ని నడపడం రేవంత్ రెడ్డి ప్రభుత్వానికి అలవాటుగా మారిందని హరీశ్‌రావు విమర్శించారు. హిట్లర్ స్ఫూర్తితో ప్రజాస్వామ్యాన్ని ఖూనీ చేస్తూ అధికార అహంకారంతో వ్యవహరిస్తున్న రేవంత్ రెడ్డికి ప్రజలే తగిన బుద్ధి చెబుతారని అన్నారు. ప్రజా సమస్య లపై ప్రశ్నించే ప్రతిపక్ష గొంతులపై అణిచివేత చర్యలను కాంగ్రెస్ వెంటనే విరమించుకోవాలని డిమాండ్ చేశారు.

గురువారం, జూలై 16, 2026
హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక
8

# గరుడ పురాణాన్ని ఇంట్లో ఉంచుకోవచ్చా? మరణానంతరం మాత్రమే చదవాలా? నిజమెంత?

అష్టాదశ పురాణాల్లో గరుడ పురాణానికి ఎంతో ప్రత్యేకత ఉంది. శ్రీమహావిష్ణువు తన వాహనమైన గరుత్మంతునికి బోధించిన వైష్ణవ పురాణమే గరుడ పురాణం. ఇందులో మొత్తం 18,000 శ్లోకాలు ఉన్నాయి. మనిషి పుట్టినప్పటి నుంచి మరణించే వరకు చేయాల్సిన కర్మలు, ఆచారాల గురించి ఇందులో వివరించబడింది. గరుడ పురాణం ఎక్కువగా మరణానంతర విషయాలకు సంబంధించిన సమాచారాన్ని కలిగి ఉండడం చేత మిగిలిన పురాణాల మాదిరిగా ఈ పురాణాన్ని ఇంట్లో ఉంచుకోవచ్చా అనే సందేహం చాలా మందికి ఉంటుంది. ఈ అంశంపై మరింత సమగ్రంగా తెలుసుకోవాలంటే ఈ కథనాన్ని పూర్తిగా చదవాల్సిందే!



గరుడ పురాణం విశిష్టత

వ్యాస మహర్షి రచించిన అష్టాదశ పురాణాల్లో గరుడ పురాణం కూడా ఒకటి. ఈ గరుడ పురాణంలో ఒక వ్యక్తి చనిపోయినప్పుడు, తాము చేసిన పనులను బట్టి ఎలాంటి శిక్షలు అనుభవిస్తారో వివరించబడింది. అంతేకాదు మనం పుట్టినప్పటి నుంచి మరణించే వరకు ఏమేమి జరుగుతాయనే పూర్తి వివరాలు గరుడ పురాణంలో ఉన్నాయని పండితులు చెబుతారు. మనం మరణించిన తర్వాత మన ఆత్మ ఎక్కడికి వెళ్తుందనే వివరాలను కూడా పొందుపరిచారు. అసలు గరుడ పురాణం మామూలు వ్యక్తులు చదవచ్చా? చదవాలంటే ఎలాంటి నియమాలు లి? అనే విషయాలు ఇప్పుడు చూద్దాం.

గరుత్మంతునికి శ్రీ మహావిష్ణువు బోధించిన గరుడ పురాణం పేరుకు పురాణం అయినప్పటికీ మిగతా పురాణాలు చదివినంత తేలికగా, ఆసక్తిగా గరుడ పురాణం చదవడానికి చాలా మంది ఇష్టపడరు. అందుకు కారణం గరుడ పురాణం పట్ల ప్రచారంలో ఉన్న అపోహలే అని చెప్పవచ్చు. ఈ పురాణం లోని సందేహాలను తీర్చడానికి శ్రీమహావిష్ణువు చెప్పే సమాధా నాలుగా కనిపిస్తాయి.

మరణానంతరం మాత్రమే చదవాలా?

పురాణాల ప్రకారం, గరుడ పురాణాన్ని కుటుంబ సభ్యుల మరణం తర్వాత మాత్రమే పారాయణ చేస్తారు. చనిపోయిన వారి ఆత్మ 13 రోజుల పాటు ఇంట్లో ఉంటుందని నమ్ముతారు. అందుకే ఈ సమయంలో గరుడ పురాణం చదవం వల్ల చనిపోయిన వారి ఆత్మకు శాంతి చేకూరుతుందని, మోక్షం లభిస్తుందని పండితులు చెబుతారు.

గరుడ పురాణంలోని ముఖ్యాంశాలు

గరుడ పురాణంలో మరణించిన వ్యక్తి దేహాన్ని వదిలిన తరువాత ఆత్మ ప్రయాణం ఎలా సాగుతుంది? ఆ సమయంలో జీవికి ఎదురయ్యే పరిస్థితులు ఈ పురాణంలో స్పష్టంగా పేర్కొనడం జరిగింది. ఈ కారణంగా కొన్ని ప్రాంతాల్లో, కొన్ని కుటుంబాల్లో శ్రాద్ధ సమయాల్లో గరుడ పురాణం చదవడం ఆనవాయతీగా వస్తోంది.

మరణించిన వారికి ఉత్తమ గతులు

ఇంట్లో ఎవరైనా మరణించిన సందర్భాల్లో గరుడ పురాణం చదవడం వల్ల చనిపోయిన తమ కుటుంబ సభ్యులకు ఉత్తమగతులు కల్పించడానికి ఎలాంటి ఆచార వ్యవహారాలు పాటించాలి? ఎలాంటి విధులు నిర్వహించాలి అనే విషయాల గురించి తెలుసుకునే అవకాశం కలుగుతుంది. నిజానికి ఈ విషయాలన్నీ ప్రతి ఒక్కరూ తెలుసుకోవలసినవే!

మరుగున పడుతున్న నిజాలు

ప్రస్తుత కాలంలో ఎవరైనా చనిపోయినప్పుడు గరుడపురాణం చదవాలనే విషయం మరుగున పడిపోయింది. ఎందుకు వచ్చిందో, ఎలా వచ్చిందో తెలియదు కానీ, గరుడ పురాణం చదవడం వలన ఎవరైనా మరణిస్తారేమో అనే సందేహం ప్రచారంలోకి వచ్చింది. ఈ కారణంగానే గరుడ పురాణం ఇంట్లో ఉంచుకోవడం అశుభం అనే భావన ప్రతి ఒక్కరిలో పెరిగి పోయింది. అందుకే ఎంతో గొప్పదైన గరుడ పురాణం ఎవరి ఇంట్లో కనిపించకుండా పోయింది. ఎవరి నోటా వినిపించకుండా పోయింది.

పండితులు ఏమి చెబుతున్నారు?

పరలోకంలో ఆత్మగా జీవుడు కొనసాగించే యాత్ర గురించి అందరికీ తెలియాలనే ఉద్దేశంతోనే వ్యాసభగవానుడు రచించిన పురాణం కాబట్టి నిస్సందేహంగా ఈ పురాణాన్ని అందరూ ఇంట్లో ఉంచుకుని చదువుకోవచ్చని పండితులు చెబుతున్నారు.

గరుడ పురాణం నిషేధించిన కర్మలు

కొన్ని విషయాలను పాపాలని గరుడ పురాణం చెబుతోంది. అవి బ్రహ్మహత్య, శిశుహత్య, గో హత్య, స్త్రీ హత్యల వంటివి. అలాగే రహస్యంగా పాపపు పని చేసేవారు, గురువులు, పండితులు, దేవతలు, స్త్రీ, శిశు ధనం హరించేవారు కూడా నరకంలో శిక్షలను అనుభవించక తప్పదంటుంది. అలాగే పుణ్యతీర్థాలను, సజ్జనులను, సత్కర్ములను, గురువులను, దేవతలను నిందించేవారు యమలోకంలో దక్షిణపు మార్గాన నడవాల్సి ఉంటుందట.

భయంకర పాపాలు ఇవే!

పురాణాలను, వేదాలను, మీమాంస, న్యాయశాస్త్రాలను, వేదాంత శాస్త్రాలను దూషించేవారు, ఇతరులు సంతోషంగా ఉంటే దుఃఖించేవారు, ఎదుటివారు దుఃఖిస్తుంటే ఆనందించేవారు, చెడుమాటలు పలికేవారు కూడా దుర్గతుల పాలు కాక తప్పదు. పెద్దల

# గురు మూఢంతో శుభకార్యాలకు బ్రేక్- అసలు మూఢం అంటే ఏంటి? ఈ సమయంలో చేయాల్సిన పనులు ఇవే!

భారతీయ జ్యోతిష్యం, ముహూర్త శాస్త్రంలో గురుశుక్ర మూఢాలు అత్యంత ముఖ్యమైన కాలం. మూఢం ఉన్న సమయంలో శుభకార్యాలు నిలిపి వేయడం అనాదిగా వస్తున్న సంప్రదాయం. ఈ సందర్భంగా ఈ ఏడాది మూఢం ఎప్పటి నుంచి ప్రారంభం కానుందో తెలుసుకునే ముందు అసలు మూఢం అంటే ఏంటి, మూఢాలు ఎలా ఏర్పడుతాయి, మూఢంలో శుభకార్యాలు ఎందుకు చేయరు అనే ఆసక్తికరమైన విషయాలు ఈ కథనంలో తెలుసుకుందాం.



మూఢం అంటే ఏమిటి?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం మనకు గ్రహాలు 9 ఉన్నప్పటికీ మూఢాలు ఏర్పడేది మాత్రం ప్రధానంగా గురు శుక్ర గ్రహాల్లోనే కావడం గమనార్హం. గురుడు, శుక్రుడు అనే ఈ రెండు గ్రహాలు సూర్యునితో కలిసుండే కాలాన్ని మౌఢ్యమి అంటారు. దీనినే వాడుకలో మూఢమి అని కూడా అంటారు. 'మూఢమి' అనే పదానికి చీకటి అనే అర్థం ఉంది. నవగ్రహాల్లో గురుడు లేదా శుక్రుడు సూర్యునికి అత్యంత సమీపంలో వచ్చినప్పుడు ఆ గ్రహాలు తమ కాంతిని కోల్పోవడం వలన మూఢమి సంభవిస్తుంది.

గురు శుక్ర గ్రహాలే ఎందుకు?

జ్యోతిష్య శాస్త్రం ప్రకారం గురు, శుక్ర గ్రహాలు శుభ గ్రహాలు. ఏదైనా శుభకార్యం తలపెట్టినప్పుడు ముహూర్తం నిర్ణయించాల్సి వచ్చినప్పుడు పండితులు గురు, శుక్ర గ్రహాల బలాన్ని, అనుకూలతను పరిశీలించి ముహూర్తాన్ని నిర్ణయిస్తారు. మూఢమి ఏర్పడినప్పుడు గురు, శుక్ర గ్రహాల తేజస్సు తగ్గి మూఢమి అంటే చీకటి ఏర్పడి ఉంటుంది కాబట్టి ఈ సమయంలో శుభకార్యాలకు ముహూర్తాలు నిర్ణయించడం జరగదు. అందుకే మూఢమిలో శుభకార్యాలు వాయిదా వేస్తారు.

మూఢం ఎప్పటి నుంచి?

తెలుగు పంచాంగం ప్రకారం ఈ ఏడాది జులై 15, బుధవారం రాత్రి 2:44 నిమిషాలకు గురు మూఢం ప్రారంభం కానుంది. ఈ గురు మూఢమి ఆగస్టు 12, బుధవారం ఉదయం 7:29 నిముషాలకు పూర్తి కానుంది. దాదాపు 28 నుంచి 29 రోజుల పాటు కొనసాగనున్న ఈ గురు మూఢమిలో ఎలాంటి శుభకార్యాలు నిషిద్ధం? ఎలాంటి పనులు చేయవచ్చు అనే విషయాలు ఇప్పుడు తెలుసుకుందాం.

మూఢమిలో ఈ శుభకార్యాలు నిషిద్ధం

గురు మూఢమి సమయంలో పెళ్లి చూపులు, వివాహం, ఉపనయనం, నూతన గృహారంభానికి ఆచరించే గృహప్రవేశం, శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతం, యజ్ఞాలు, వధూ ప్రవేశం, దేవతా ప్రతిష్టలు, ధ్వజస్థంభం స్థాపనలు, దీక్షోపనయనం, వాహనాలు కొనడం, బోరు బావులు, చెరువులు తవ్వడం, పుట్టు వెంట్రుకలు తీయించడం, విద్యారంభానికి ఆచరించే అక్షరాభ్యాస కార్యక్రమాలు, చెవులు కుట్టించడం, నూతన వ్యాపారాలు ప్రారంభించడం, మహాదానాలు, అపూర్వ దేవతీర్థ దర్శనం, యాత్రలకు వెళ్లడం, కొత్త ప్రయాణాలు ఆరంభించడం, రాజ దర్శనం, రాజ్యాభిషేకం వంటి కార్యక్రమాలు మూఢమిలో ఆచరించకూడదని జ్యోతిష్య శాస్త్ర పండితులు చెబుతున్నారు. అయితే కొన్ని కార్యక్రమాలకు మాత్రం శాస్త్రం మినహాయింపునిచ్చింది. అవేంటో చూద్దాం.

గురు మూఢమిలో ఏయే కార్యక్రమాలు ఆచరించవచ్చు?

ముహూర్త గ్రంథ శాస్త్రం కొన్ని అనివార్య కర్మలకు, నిత్య కర్మలకు గురు మూఢమి దోషం వర్తించదని స్పష్టం చేస్తోంది. అందుచేత గురు మూఢమిలో రోజువారీ ప్రయాణాలు, నిత్య నైమిత్తిక కర్మలు, నిత్యపూజలు, శివాభిషేకాలు, నవగ్రహ శాంతి హోమాలు, జపాలు, సీమంతం, నామకరణం, అన్నప్రాశనాది కార్యక్రమాలు, పాత ఇంటికి మరమ్మత్తులు, నూతన వస్త్రధారణ, చాతుర్మాస వ్రతాలు వంటివి నిరభ్యంతరంగా ఆచరించవచ్చు. అయితే ఏ శుభకార్యం తలపెట్టినా ముందుగా గణపతిని, కుల దైవాన్ని, ఇష్ట దైవాన్ని పూజించి ప్రారంభించడం మంచిది.

రానున్న గురు మూఢమి సమయంలో మనం కూడా శాస్త్రం సమ్మతించిన శుభకార్యాలు జరుపుకుంటూ తక్కిన సమయాన్ని దైవారాధనలో గడుపుదాం.

శుభం భూయాత్!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం

# వేంకటేశుని నామస్మరణతో 32 వేల సంకీర్తనల- భక్తి సాగరంలో అమృతధారగా అన్నమయ్య జీవితం

బ్రహ్మమొక్కటే పరబ్రహ్మమొక్కటే!' అంట ఈ చరాచర సృష్టి మొత్తం వ్యాపించి ఉన్నది శ్రీనివాసుడే అని భావించి తన కీర్తనలతో కొండలలో నెలకొన్న కోనేటిరాయుని స్వరాభిషేకం చేసిన శ్రీ తాళ్లపాక అన్నమాచార్యుని జయంతి సందర్భంగా ఆ మహనీయుని జీవిత విశేషాలు ఈ కథనంలో తెలుసుకుందాం. జననంఎందరో మహనీయులు జన్మించిన వైశాఖమాసంలోనే శ్రీ అన్నమాచార్యులు కూడా జన్మించాడు. అన్నమయ్య మే 9, 1408 వ సంవత్సరంలో కడప జిల్లా మండలంలోని తాళ్లపాకలో జన్మించారు.



**అదృశ్య తేజస్సు ప్రసాదించిన దివ్య ఖడ్గం**

శ్రీనివాసుని భక్తులైన నారాయణసూరి, లక్కమాంబ దంపతులకు సంతానం లేకపోవడంతో తీవ్ర వ్యధకు గురయ్యారు. ఈ పుణ్య దంపతులు సంతానం కోసం చేయని వ్రతం లేదు. తమకు సంతానం ప్రసాదించమని ఆ దంపతులు వేంకటేశ్వరస్వామి దర్శనం కోసం తిరుమల చేరుకొని స్వామి మందిరంలోకి ప్రవేశించారు. గరుడ స్థంభం వద్ద సాష్టాంగపడి మొక్కారు. ఆ సమయంలో వాళ్లకు ఏదో మైకం కమ్మినట్లైంది. కళ్లు మిరుమిట్లు గొలిపే ఒక తేజస్సు కనిపించి ధగధగ మెరిసే ఖడ్గాన్ని వాళ్ల చేతుల్లో పెట్టి అదృశ్యమైంది. ఆ విధంగా వేంకటేశ్వరస్వామి తన నిజ ఖడ్గమైన నందకాన్ని ఆ పుణ్య దంపతులకు ప్రసాదించాడు. వాళ్లు పరమానందంతో వేంకటపతిని దర్శించి, సంతోషంతో తాళ్లపాకకు తిరిగి వచ్చారు.

**అన్నమయ్య జననం**

కొంతకాలానికి లక్కమాంబ గర్భవతి అయింది. వైశాఖ మాసం పౌర్ణమి రోజు విశాఖ నక్షత్రంలో ఆ పుణ్య దంపతులకు అన్నమయ్య జన్మించాడు. ఆ దంపతుల సంతోషానికి అవధులు లేకుండా పోయింది. బాల్యంలో అన్నమయ్య మాటిమాటికీ వెంకన్న పేరు చెబితేనే ఉగ్గుపాలు త్రాగేవాడు. వేంకటపతికి మొక్కమని చెబితేనే మొక్కేవాడు. వేంకటపతి మీద జోల పాడితే నిద్ర పోయేవాడు.

**తిరుమల పయనం**

ఊరికే పాటలు పాడుతూ ఉంటే జీవనం ఎలా సాగుతుందని పెద్దలు మందలించిన మీదట పశువుల కోసం గడ్డి కోయడానికి అడవికి వెళ్లిన అన్నమయ్య జీవితం ఆ రోజు నుంచి గొప్ప మలుపు తిరిగింది. వేంకటనాథుని దర్శనం కోసం తిరుమల వెళ్తున్న యాత్రికుల గుంపుతో కలిసి తిరుమల చేరుకున్నాడు.

**శ్రీవారి దివ్య దర్శనం**

బంగారు వాకిలి చెంతకు చేరి, దివ్య పాదాలతో, కటివరద హస్తాలతో సకలాభరణ భూషితుడైన దివ్యమంగళ శ్రీమూర్తిని దర్శించుకొన్నాడు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి, శఠగోపంతో ఆశీర్వచనం పొంది, ఆ రాత్రి ఒక మండపంలో విశ్రమించాడు. తరువాత అన్నమయ్య కొండపై కుమార ధార, ఆకాశ గంగ, పాప వినాశం వంటి తీర్థాలను దర్శించి, కొండపైనే స్వామిని కీర్తిస్తూ ఉండిపోయాడు. అతని కీర్తనలు విని అర్చకులు అతనిని ఆదరించసాగారు.

**వివాహం**కటివరద హస్తాలతో సకలాభరణ భూషితుడైన దివ్యమంగళ శ్రీమూర్తిని దర్శించుకొన్నాడు. తీర్థ ప్రసాదాలను స్వీకరించి, శఠగోపంతో ఆశీర్వచనం పొంది, ఆ రాత్రి ఒక మండపంలో విశ్రమించాడు. తరువాత అన్నమయ్య కొండపై కుమార ధార, ఆకాశ గంగ, పాప వినాశం వంటి తీర్థాలను దర్శించి, కొండపైనే స్వామిని కీర్తిస్తూ ఉండిపోయాడు. అతని కీర్తనలు విని అర్చకులు అతనిని ఆదరించసాగారు.

అన్నమయ్య తిరుమలలో ఉన్నాడని తెలిసి అతని తల్లిదండ్రులు ఇంటికి రమ్మని బ్రతిమాలి తిరిగి తీసుకు వెళ్లారు. తిమ్మక్క, అక్కమ్మ అనే ఇద్దరు కన్యలను వివాహం చేసుకున్నాడు. తిరిగి తన భార్యలతో కలిసి శ్రీనివాసుని దర్శించినప్పుడు శ్రీవారికి రోజుకొక సంకీర్తన వినిపించాలని నిర్ణయిం చుకుంటాడు. అప్పటి నుంచి అన్నమయ్య శ్రీవారి మీద పుంఖానుపుంఖాలుగా కీర్తనలు రచించగా, అతని శిష్యులు వాటిని గానం చేస్తూ తాళపత్రాలకు ఎక్కించసాగారు.

**రాజాశ్రయం**

కొంతకాలం అన్నమయ్య సాళ్వ నరసింగరాయలు ఆస్థానంలో రాజును ఆశ్రయించి ఉన్నాడు. కానీ రాజాశ్రయం తనకు సరైనది కాదని తలచిన అన్నమయ్య తిరుమల చేరాడు. తన శేషజీవితాన్ని స్వామి సన్నిధిలో నిత్యారాధనలో, సంకీర్తనా దీక్షలో గడిపాడు. ఈ దశలో బహుశా ఆధ్యాత్మిక సంకీర్తనలు అధికంగా రచించాడు.

**వేంకటేశ్వరునితో ఐక్యం**

95 సంవత్సరాలు జీవించి, వేంకటేశుని సేవలో తన జీవితాన్ని చరితార్థం చేసుకున్న అన్నమయ్య ఫాల్గుణ బహుళ ద్వాదశి నాడు 1503 ఫిబ్రవరి 23 రోజున శ్రీ వేంకటేశ్వరుని సన్నిధిలో స్వామిలో ఐక్యమయ్యాడు. ఆ కాలంలో రాగిరేకుల మీద రాసిన తిధుల కారణంగా అన్నమయ్య జనన, మరణ విశేషాలు లోకానికి తెలుస్తున్నాయి. నేటికీ ఏడుకొండలవాడు అన్నమయ్య వంశస్థులు పాడే సుప్రభాతంతో మేల్కొంటాడు. లాలిపాట తో నిద్రపోతాడు. భక్తి మార్గంలో పయనిస్తూ దాదాపు 32 వేల సంకీర్తనలతో శ్రీనివాసునికి స్వరాభిషేకం చేసిన అన్నమయ్య జయంతి ఉత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం ఘనంగా నిర్వహిస్తారు. ఆ మహనీయుని జన్మదినం రోజు అన్నమయ్య చూపిన భక్తి మార్గంలో నడవడమే ఆయనకు మనమిచ్చే నిజమైన నివాళి. ఓం నమో వేంకటేశాయ!

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# మహాభారతంలో త్యాగధనుడు సుగంధుడు! ఆదిశేషుని కుమారుడైన ఈ మహానాగుడి గొప్పతనం తెలుసా?



దివ్యమైన సువాసన, అపారమైన ప్రశాంతత కలిగిన ఒక మహోన్నత ఆత్మ!

ఆదిశేషుని మహోన్నత వంశావళిలో తన పేరులోనే దైవత్వాన్ని నింపుకుని, మహాభారతంలో ప్రత్యేకంగా కీర్తించిన ఆదిశేషుని పుత్రుడు 'సుగంధుడు'.

**మహాభారతం వెల్లడించిన అరుదైన నాగ రహస్యం!**

సాధారణంగా పాములు అనగానే మనకు ఒక రకమైన భయం, వాటిలో దాగివుండే విషపూరితమైన స్వభావమే గుర్తొస్తాయి. కానీ, దానికి పూర్తిగా భిన్నంగా, తన పవిత్రమైన గుణాలతో చుట్టుపక్కల వాతావరణాన్నే పవిత్రం చేసిన ఒక మహోన్నత నాగ యువరాజు గురించి మహాభారతం పేర్కొంటుంది. ఆయనే ఈ సుగంధుడు! ఇంతకూ మహాభారతం అంతగా కొనియాడిన ఈ సుగంధుడు ఎవరు? ఆయన పుట్టు పూర్వోత్తరాలేంటో చూద్దాం.

**ఎవరీ సుగంధుడు?**

మహాభారతంలోని 'ఆది పర్వం' కథనాల ప్రకారం, ఆదిశేషుని పుత్రుల్లో అమితమైన తపోశక్తి, సాత్విక గుణం కలిగినవాడిగా సుగంధుడు వర్ణించారు. 'సుగంధుడు' అనే పేరుకు 'మంచి సువాసన గలవాడు' లేదా 'సద్గుణాల పరిమళాన్ని వెదజల్లేవాడు' అని అర్థం. తన తండ్రి ఆదిశేషుని వలెనే, ఆయన అంతరంగంలోని ఆధ్యాత్మిక పవిత్రత, తపోనిష్ఠ ఆయన సమగ్ర వ్యక్తిత్వంలో ఒక దివ్యమైన ప్రకంపనగా ఆరాగా వ్యక్తమయ్యేది. అందుకే సుగంధుడు సార్థక నామధేయుడయ్యాడు.

**సుగంధుని మహోన్నత వ్యక్తిత్వ విశేషాలు**

సుగంధుడు పేరుకు తగ్గట్లే మహోన్నతమైన వ్యక్తిత్వంతో, సుగుణాలతో ప్రకాశిస్తుండేవాడు. ఆయన సుగుణాల్లో మచ్చుకు కొన్ని తెలుసుకుందాం.

**వాతావరణాన్ని పవిత్రం చేసే గుణం**

నాగ వంశంలోని కొన్ని సర్పాలు తమ కోపంతో, విషపూరిత శ్వాసతో అడవులను భయభ్రాంతులకు గురిచేసేవి. కానీ, సుగంధ నాగుడు తపస్సు చేసిన ప్రదేశం మాత్రం ఆయన తపోశక్తి వల్ల ఎలాంటి దుష్టశక్తులు చేరలేక, చూసేవారి మనస్సుకు ప్రశాంతతను ఇచ్చే దివ్యత్వంతో విలసిల్లుతుండేది.

**అహింస, శాంతం**

సుగంధుడు తన తండ్రి ఆదిశేషుని లాగే కోపాన్ని పూర్తిగా జయించిన శాంత స్వరూపుడు ఈయన. ఇతర జీవులకు హాని చేయకపోవడం, బాధించకపోవడం, అహింస అనే ధర్మాన్ని తన జీవితాంతం అత్యంత నిష్ఠతో ఆచరించాడు.

**రుషుల ప్రేమాభిమానాలు పొందినవాడు**

సుగంధ నాగుడు అడవుల్లో యజ్ఞయాగాలు చేసే మునివులకు, భగవదారాధనలో మునిగిపోయే వారికి ఎటువంటి అసుర శక్తుల వల్ల అంతరాయం కలగకుండా, తన తపోశక్తితో రక్షణ కవచంగా నిలిచాడు. అందుకే ఆయన రుషుల ప్రేమాశీస్సులను అమితంగా పొందాడు.

**మహాభారత జనమేజయ సర్పయాగం**

పాండవ వంశానికి చెందిన కురు రాజు జనమేజయుడు తన తండ్రి అయిన 'పరీక్షిత్తు' మరణానికి కారణమైన 'తక్షకుడు' అనే సర్పంపై ప్రతీకారం తీర్చుకోవడానికి భయంకరమైన సర్పయాగాన్ని నిర్వహిస్తాడు. సర్పజాతిని అంతం చేయడం కోసం జరిగిన ఈ 'సర్ప సత్ర' అనే సర్పయాగం మహా క్రతువులో, మంత్ర శక్తుల ప్రభావంతో ఆకర్షితులై ఎన్నో సర్పాలు అగ్నికి ఆహుతి అవుతాయి. అలా అగ్ని ఆహుతి అయిన ఉత్తమ నాగ ప్రముఖుల జాబితాలో సుగంధుని పేరు కూడా మహాభారతంలో స్పష్టంగా పేర్కొని ఉంది. చివరకు ఆస్తిక మహర్షి, జనమేజయుడిని శాంతింపజేయడంతో ఈ యాగం ఆగిపోయి, తక్షకుడు ప్రాణాలతో బయటపడతాడు.

**ఆత్మత్యాగంతో నాగవంశ రక్షణకు బాటలు వేసిన సుగంధుడు**

కలలో కూడా ఎవరికీ ఎన్నడూ ఎలాంటి కీడు తలపెట్టని ఇలాంటి పవిత్ర ఆత్మలు ఈ యాగంలో తమను తాము అర్పించుకున్నప్పటికీ, వీరి శాంతం, ధర్మమే తర్వాతి కాలంలో ఆస్తీక ముని ద్వారా మిగిలిన నాగ వంశాన్ని రక్షించడానికి పునాదిగా నిలిచాయి. అందుకే మహా భారతం సుగంధుని ఇంతలా కొనియాడింది.

**సుగంధుని జీవితం నేర్పే సత్యం**

మన చుట్టూ ఉన్న వాతావరణం ఎలా ఉన్నప్పటికీ, మన సద్గుణాలతో ఆ ప్రదేశాన్ని సుగంధ భరితంగా అంటే ఆహ్లాదకరంగా మార్చవచ్చు అనే మహోన్నత జీవిత సత్యాన్ని సుగంధుని జీవితం మనకు ఇచ్చే సందేశం.

**ఓం నమో నారాయణాయ!**

ముఖ్య గమనిక : పైన తెలిపిన వివరాలు కొందరు నిపుణులు, వివిధ శాస్త్రాల్లో పేర్కొన్న అంశాల ఆధారంగా అందించినవి మాత్రమే. వీటిలో అన్నిటికీ ఆధునిక శాస్త్రీయ ఆధారాలు లేకపోవచ్చుననే విషయాన్ని పాఠకులు గమనించాలి. దీన్ని ఎంతవరకు విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# చంద్రగిరి నగర్‌లో SIR ఓటరు మ్యాపింగ్ కార్యక్రమాన్ని పర్యవేక్షించిన డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్

గాజులరామారం: గాజులరామారం డివిజన్ పరిధిలోని చంద్రగిరి నగర్‌లో నిర్వహించిన SIR ఓటరు మ్యాపింగ్ కార్యక్రమాన్ని డీసీసీ ఉపాధ్యక్షులు కూన శ్రీనివాస్ గౌడ్ పర్యవేక్షించారు. ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకుడు రషీద్ బేగ్ ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన ఓటరు అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై స్థానిక ఓటర్లను ఉద్దేశించి మాట్లాడారు. SIR కార్యక్రమం ఉద్దేశ్యం, ఓటరు వివరాల మ్యాపింగ్ ప్రాముఖ్యతను వివరిస్తూ, ప్రతి అర్హుడైన ఓటరు తన వివరాలను సక్రమంగా నమోదు చేసుకోవాలని కూన శ్రీనివాస్ గౌడ్ సూచించారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనదని, ప్రతి ఓటరు తన పేరు ఓటరు జాబితాలో సరిగా నమోదై ఉందో లేదో తప్పనిసరిగా ధృవీకరించుకోవాలని కోరారు. ఎన్నికల ప్రక్రియను మరింత పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు SIR కార్యక్రమం దోహదపడుతుందని పేర్కొంటూ, ప్రజలు ఈ కార్యక్రమానికి పూర్తి సహకారం అందించాలని ఆయన విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో బూత్ లెవల్ అధికారులు (BLO\T), కాంగ్రెస్ పార్టీ మైనార్టీ నాయకులు రషీద్ బేగ్, లాల్ మహమ్మద్, రాజేందర్ పటేల్, ఖదీర్, నవాబ్, సుఖ్ దేవ్, యూత్ కాంగ్రెస్ నాయకులు సంతోష్, సతీష్‌తో పాటు స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.



# ఆపదలో ఉన్న కుటుంబానికి అండగా శాపురం నర్సింహా రెడ్డి

- 5,000 ఆర్థిక సాయం అందజేత



పటాన్‌చెరు, జూలై 15: సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు నియోజకవర్గం పరిధిలోని ముత్తంగి డివిజన్ పరిధిలోని పాటి గ్రామానికి చెందిన గుంటి అంతయ్య ఇటీవల అనారోగ్యంతో మరణించగా, వారి కుటుంబ సభ్యులను కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకులు శాపురం నర్సింహా రెడ్డి మంగళవారం పరామర్శించారు. ఈ సందర్భంగా మృతుని చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించిన ఆయన, కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతిని తెలిపారు. బాధిత కుటుంబానికి అండగా ఉంటామని భరోసా ఇస్తూ, తన సొంత నిధుల నుంచి ₹5,000 ఆర్థిక సహాయాన్ని అందజేశారు. ఈ సందర్భంగా శాపురం నర్సింహా రెడ్డి మాట్లాడుతూ.. "ప్రజల కష్టసుఖాల్లో భాగస్వామ్యం కావడం ప్రతి ఒక్కరి బాధ్యత. ఆపదలో ఉన్న కుటుంబాలకు మనవంతు సహాయం అందించడం మానవత్వానికి నిదర్శనం" అని పేర్కొన్నారు. ఈ కష్టకాలంలో ఆ కుటుంబానికి ధైర్యం చెప్పిన ఆయన, భవిష్యత్తులో కూడా పార్టీ పరంగా, వ్యక్తిగతంగా అండగా ఉంటామని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు, స్థానిక కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలు మరియు గ్రామస్తులు పాల్గొన్నారు.

# SIR కార్యక్రమంలో ప్రతి ఓటరు భాగస్వామి కావాలి

-- ధరావత్ స్వామి నాయక్ పిలుపు



మహేశ్వరం :: మహేశ్వరం నియోజకవర్గంలోని బడంగ్‌పేట్ సర్కిల్--16, మీర్‌పేట్ పరిధిలోని లెనిన్ నగర్, చింతల్‌కుంట ప్రాంతాల్లో కొనసాగుతున్న SIR (Special Intensive Revision) కార్యక్రమంలో ప్రతి ఓటరు చురుకుగా పాల్గొనాలని ఇందిరమ్మ కమిటీ ఇన్‌ఛార్జ్ & కోఆర్డినేటర్, అధికార కాంగ్రెస్ పార్టీ నాయకుడు ధరావత్ స్వామి నాయక్ కోరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సంఘం అందిస్తున్న SIR రిటర్నింగ్ ఫారాలను ప్రతి అర్హత కలిగిన ఓటరు తప్పనిసరిగా స్వీకరించి, వాటిని పూర్తిగా నింపి వెంటనే సంబంధిత బూత్ లెవల్ అధికారులకు అందజేయాలని విజ్ఞప్తి చేశారు. ప్రజాస్వామ్యంలో ఓటు హక్కు అత్యంత విలువైనది, ఓటరు జాబితాలో ప్రతి ఒక్కరి వివరాలు సక్రమంగా నమోదు కావాలంటే ప్రతి ఓటరు బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆయన అన్నారు. ఎన్నికల ప్రక్రియను పారదర్శకంగా, సమర్థవంతంగా నిర్వహించేందుకు SIR కార్యక్రమానికి ప్రజలు పూర్తి సహకారం అందించాలని పిలుపునిచ్చారు. ఈ వార్తను పత్రికా శైలిలో లేదా సోషల్ మీడియా పోస్టు రూపంలో కూడా సిద్ధం చేయగలను.

# చేగుంట శ్రీ మహంకాళి బోనాల ఉత్సవాలకు ఉప సర్పంచ్ రఫీ బారి విరాళం




చేగుంట జూలై 15 చేగుంట మండలం చేగుంట శ్రీ శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల ఉత్సవాల వచ్చే నెల 9వ తేదీన మొదలవుతున్న సందర్భంగా చేగుంట ఉపసర్పంచ్ మహమ్మద్ రఫీ 1,50,000( ఒక లక్ష యాభై వేల రూపాయలు) తన వంతుగా విరాళం ఇచ్చారు. డబ్బులను ఆలయ కమిటీ సభ్యులకు అందజేయడం జరిగినది వారు మాట్లాడుతూ ఆ తల్లి దీవెనలతో గ్రామ ప్రజలందరూ సుఖ సంతోషాలతో ఉండాలి, మంచిగా వర్షాలు పడాలి ప్రజలకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆ దేవత కరుణించాలి అని అన్నారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు పాల్గొనడం జరిగింది

# 28న జరగబోయే సాంస్కృతిక బోనాల జాతర పోస్టర్ ను ఆవిష్కరించిన సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ బృందం.

(కుత్బుల్లాపూర్ ) తెలంగాణ ఆషాఢ మాస బోనాల జాతర సంప్రదాయాలను కనులపండువగా నిర్వహించాలని ఈ నెల 28న సీజీఎన్ కల్చరల్ అసోసియేషన్ ఆధ్వర్యంలో, ఆర్గనైజర్ సందీప్ నేతృత్వంలో భారీ సాంస్కృతిక బోనాల జాతర నిర్వహించనున్నట్లు అసోసియేషన్ వ్యవస్థాపకుడు సందీప్ తెలిపారు. ఈ రోజు కొంపల్లిలోని ఏఎంఆర్ గార్డెన్స్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు చేరవేయాలనే ఉద్దేశంతో ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని చెప్పారు. బోనాల జాతర విశిష్టతను ప్రతిబింబించేలా సంప్రదాయ బోనాలు, పోతురాజుల విన్యాసాలు, శివసత్తుల ప్రదర్శనలు, డప్పు వాయిద్యాలు, జానపద కళారూపాలు, సాంస్కృతిక ప్రదర్శనలను ఏర్పాటు చేస్తున్నామని తెలిపారు. అలాగే తెలంగాణ రాష్ట్ర గొప్ప సాంస్కృతిక వారసత్వాన్ని ప్రతిబింబించే ఈ జాతరను కొంపల్లి పరిసర ప్రాంతాలలోని ప్రజలు,యువత, మహిళలు పెద్ద సంఖ్యలో పాల్గొని ఈ సాంస్కృతిక బోనాల జాతరను విజయవంతం చేయాలని విజ్ఞప్తి చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకులు సందీప్ తో పాటు,హేమంత్, కార్తీక్, మహేష్, నందిని.మమతా,సునీత. చంద్ర శేఖర్. అనిల్. పాల్గొన్నారు..



# తెలంగాణలో ఎస్ఐఆర్ గడువు పెంపు - ఎన్నికల సంఘం ప్రకటన



హైదరాబాద్ : తెలంగాణ రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ గడువు పది రోజులు పొడిగించారు. ఈ నెల 24న పూర్తి కావల్సిన ఎన్యుమరేషన్ ప్రక్రియను ఆగస్టు 3వ తేదీ వరకు పొడిగిస్తూ కేంద్ర ఎన్నికల కమిషన్ నిర్ణయం తీసుకుంది. ముసాయిదా జాబితా ఆగస్టు 10న పబ్లిష్ కానుంది. ఆ రోజు నుంచి సెప్టెంబరు 9 వరకు అభ్యంతరాలను స్వీకరిస్తారు. అక్టోబరు 8వ తేదీ వరకు అభ్యంతరాలను పరిశీలించి అదే నెల 12న తుది జాబితాను ప్రకటిస్తారు. ఎన్యుమరేషన్ ఫారాలు పంపిణీ దాదాపు పూర్తయినప్పటికీ, ఓటర్లు వాటిని నింపి ఇవ్వాల్సి ఉంది. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియ దాదాపు సగమే పూర్తయింది. రాష్ట్రంలో ఎస్ఐఆర్ షెడ్యూలును కేంద్ర ఎన్నికల కమిషన్ సవరించింది. రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి వినతి మేరకు పది రోజులు పొడిగించింది. గత నెల 25 నుంచి రాష్ట్రంలో ఓటరు జాబితా ప్రత్యేక సమగ్ర సవరణ జరుగుతోంది. పాత షెడ్యూలు ప్రకారం ఈనెల 24వరకు ఎన్యుమరేషన్ ప్రక్రియ జరగాల్సి ఉంది. రాష్ట్రంలో 3 కోట్ల 38 లక్షల 26 వేల 448 మంది ఓటర్లందరికీ ఎన్యుమరేషన్ ఫారాలు ఇచ్చే ప్రక్రియ కొనసాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా ఎన్యుమరేషన్ ఫారాల పంపిణీ 99.99శాతం పూర్తయింది. ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలో ఇంకా కొన్ని ఫారాలు ఇవ్వాల్సి ఉండగా హైదరాబాద్‌తో పాటు రాష్ట్రమంతటా ఫారాల పంపిణీ పూర్తయిందని సీఈవో కార్యాలయం వెల్లడించింది. అయితే ఓటర్లు ఎన్యుమరేషన్ ఫారాలు నింపి తిరిగి ఇచ్చే ప్రక్రియ మందకొడిగా సాగుతోంది. రాష్ట్రవ్యాప్తంగా సుమారు 55 శాతం ఓటర్లే ఫారాలు నింపి ఇచ్చారు. ఎన్యుమరేషన్ ఫారాల డిజిటలైజేషన్ ప్రక్రియలో హైదరాబాద్, ఉమ్మడి రంగారెడ్డి జిల్లాలు వెనకబడి ఉన్నాయి.

అక్టోబర్ 12న తుది ఓటరు జాబితా విడుదల : ఓటర్లకు 2002 జాబితాలో పేర్లు వెదకడం కష్టంగా ఉండటం బీఎల్ఓలు అందుబాటులో లేకపోవడం వంటి ఇబ్బందులు తలెత్తుతున్నాయి. ఈ నేపథ్యంలో ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని ఓటర్లతో పాటు రాజకీయ పార్టీలు కోరాయి. క్షేత్రస్థాయి పరిస్థితులను వివరిస్తూ ఎస్ఐఆర్ గడువు పొడిగించాలని కేంద్ర ఎన్నికల కమిషన్‌కు రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి సుదర్శన్ రెడ్డి లేఖ రాశారు. కొత్త షెడ్యూలు ప్రకారం ఎన్యుమరేషన్ ప్రక్రియ ఆగస్టు 3వ తేదీ వరకు జరగనుంది. ఆగస్టు 3వరకు ఎన్యుమరేషన్ ఫారాలన్నీ నింపి బీఎల్ఓలకు ఇవ్వాల్సి ఉంటుంది. ఎన్యుమరేషన్ ఫారం నింపి ఇవ్వకపోతే ముసాయిదా జాబితాలో ఓటు ఉండదని ఈసీ అధికారులు స్పష్టం చేస్తున్నారు. ఎన్యుమరేషన్ ప్రక్రియ పూర్తయ్యాక ఆగస్టు 10 వతేదీన డ్రాఫ్ట్ జాబితాను ఎన్నికల కమిషన్ ప్రకటించనుంది. ముసాయిదా జాబితాలో పేరు లేకపోయినా ఎలాంటి అభ్యంతరాలున్నా ఆగస్టు 10 నుంచి సెప్టెంబరు 9 వరకు సమర్పించవచ్చు. ఓటర్ల అభ్యంతరాలు, క్లెయిమ్‌లను ఆగస్టు 10 నుంచి అక్టోబరు 8 వరకు పరిశీలించి, పరిష్కరిస్తారు. ప్రక్రియ అంతా పూర్తి చేసి అక్టోబరు 12న తుది ఓటరు జాబితాను కేంద్ర ఎన్నికల కమిషన్ ప్రకటిస్తుంది.

# బాలానగర్ లో ఘనంగా బండి రమేష్ జన్మదిన వేడుకలు

(కుత్బుల్లాపూర్ ) టీపీసీసీ ఉపాధ్యక్షుడు, తెలంగాణ ఖమ్మ కార్పొరేషన్ చైర్మన్, కూకట్‌పల్లి నియోజకవర్గ కాంగ్రెస్ ఇంచార్జి, ప్రజా నాయకుడు శ్రీ బండి రమేష్ జన్మదిన వేడుకలను బుధవారం బాలానగర్ డివిజన్ కాంగ్రెస్ అధ్యక్షుడు పులి శివకుమార్ గౌడ్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి కూకట్‌పల్లి మార్కెట్ కమిటీ చైర్మన్ కె. పుష్పారెడ్డి, మేడ్చల్--మల్కాజ్‌గిరి డీసీసీ ఉపాధ్యక్షుడు పులి శ్రీకాంత్ పటేల్, జిల్లా అధికార ప్రతినిధి మధుమోహన్ తదితరులు హాజరై కేక్ కట్ చేసి బండి రమేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పులి శివకుమార్ గౌడ్ మాట్లాడుతూ, బండి రమేష్ ప్రజా సమస్యల పరిష్కారానికి నిరంతరం కృషి చేస్తూ ప్రజల అభిమానాన్ని చూరగొన్న నాయకుడిగా గుర్తింపు పొందారని అన్నారు. తెలంగాణ రాష్ట్ర అభివృద్ధి, కాంగ్రెస్ పార్టీ బలోపేతానికి ఆయన అందిస్తున్న సేవలు ప్రశంసనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో ఆయన మరిన్ని ఉన్నత పదవులను అలంకరించి ప్రజలకు మరింత సేవ చేయాలని ఆకాంక్షిస్తూ జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.. ఈ కార్యక్రమంలో డివిజన్ మహిళా అధ్యక్షులు రేణుక, సాయి భారతి, సుగుణ, ఊర్మిళ, పద్మావతి, శ్వేత, ఇందిరా, కూకట్‌పల్లి కోఆర్డినేటర్ గజానంద్ శేఖర్, శ్రీకాంత్ గౌడ్, రవి ముదిరాజ్, దండు రవి గౌడ్, కుమార్, జల శివ, సత్యపాల్ రెడ్డి, రామ్మోహన్ రావు, అనిల్ పాల్గొన్నారు.



# గుండెపోటుతో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవి నాయక్ ఆకస్మిక మృతి

**– పరామర్శించిన దిండిగాల రాజేందర్ బావ్ సింగ్ నాయక్**



ఇల్లందు న్యూస్ :- ఇల్లందు బంజారా ముద్దుబిడ్డ సీనియర్ యువ న్యాయవాది బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవి నాయక్ బుధవారం గుండె నొప్పితో ప్రభుత్వ ఆసుపత్రికి వెళ్లి ఆకస్మిక మృతి బారిన పడ్డారు. విషయం తెలుసుకున్న బిఆర్ఎస్ పార్టీ ఉమ్మడి ఖమ్మం జిల్లా మాజీ అధ్యక్షులు దిండిగాల రాజేందర్, ఆత్మ కమిటీ మాజీ చైర్మన్ బావ్ సింగ్ నాయక్, టిఆర్ఎస్ పార్టీ సీనియర్ నాయకులు డేరంగుల పోశం, సనా రాజేష్, బజారు సత్యనారాయణ, ఉమారాజు, లవ్ కుష్లు తదితరులు భూక్య రవి నాయక్ పార్ధివ దేహాన్ని సందర్శించి పార్ధివ దేహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళు లర్పించారు. వారి కుటుంబ సభ్యులను పరామర్శించి ఓదార్చారు. ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవి నాయక్కు ఘనంగా నివాళులర్పించిన ఇల్లందు న్యాయవాదులు.ఇల్లందుకు చెందిన ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షులు భూక్య రవి నాయక్ గుండెలో కొద్దిగా నొప్పి ఉందని ఇంట్లో చెప్పి ఇల్లందు ప్రభుత్వాసుపత్రికి వెళ్ళాడు. వైద్యులు హుటాహుటిన సిపిఆర్ చేస్తూ ట్రీట్మెంట్ చేస్తుండగానే భూక్య రవి నాయక్ ఆకస్మికంగా మృతి చెందారు. ఆయనకు భార్య ఇద్దరు కుమారులు ఉన్నారు. పెద్ద కుమారుడు బీటెక్ పూర్తి చేశారు. చిన్న కుమారుడు ఎల్.ఎల్.బి మొదటి సంవత్సరం చదువుతున్నాడు. భూక్య రవి నాయక్ తల్లిదండ్రులు వృద్యాపంలో ఉన్నారు. చలాకిగా ఉషారుగా ఉంటూ తన సహా న్యాయవాదుల పట్ల కక్షి దారుల పట్ల ఎంతో ప్రేమగా ఆప్యాయంగా మాట్లాడుతుండేవాడని పలువురు పేర్కొంటున్నారు. తొలుత భూక్య రవి నాయక్ సీనియర్ న్యాయవాదుల వద్ద అసిస్టెంట్ గా పనిచేస్తూ ఎల్ఎల్బీ చేసి న్యాయవాద వృత్తిలో మంచి పేరును సంపాదించారు. ఇటీవల జరిగిన బార్ అసోసియేషన్ ఎన్నికల లో సీనియర్, జూనియర్ న్యాయవాదుల అభిమానంతో ఇల్లందు బార్ అసోసియేషన్ అధ్యక్షుడుగా రెండవసారి ఎన్నికయ్యాడు. ఎంతో యంగ్ గా, ఎంతో హుషారుగా ఆరోగ్యంగా ఉండే భూక్య రవి నాయక్ ఇంత తొందరగా గుండెపోటుతో చనిపోతాడనే విషయం కలలో కూడా అనుకోలేదని, ఊహించలేదని పలువురు పేర్కొంటున్న న్యాయవాదులు షాక్ లో మునిగిపోయారు. భూక్య రవి నాయక్ పార్ధివ దేహాన్ని సందర్శించి న ఆదివాసి అడ్వకేట్ అసోసియేషన్ రాష్ట్ర కార్యదర్శి సువర్ణ బాక సత్యనారాయణ, విశ్వ సమాజం వ్యవస్థాపకులు ప్రముఖ న్యాయవాది జంపాల విశ్వ, తెలంగాణ ప్రజా ఫ్రంట్ ఉమ్మడి ఖమ్మం జిల్లా అధ్యక్షుడు రామటెంకి అశోక్, ఇల్లందు సీనియర్ న్యాయవాది దంతాల ఆనంద్, ఇల్లందు బార్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి నవీన్, ఇల్లందు బార్ అసోసియేషన్ మాజీ అధ్యక్షులు ఉమామహేశ్వరరావు, సీనియర్ న్యాయవాదులు మల్లికార్జునరావు, కీర్తి కార్తిక్, పి వెంకట నరసయ్య తదితరులు భూక్య రవి నాయక్ పార్ధివ దేహానికి పూలదండలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

# కాంగ్రెస్ నాయకులతో కలిసి ఇంటింటి ప్రచారం చేసిన కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్



ఇల్లందు న్యూస్ :-పట్టణంలోని 22వ వార్డులో భారత ఎన్నికల సంఘం ఆదేశాల మేరకు జరుగుతున్న స్పెషల్ ఇన్సెంటివ్ రివిజన్ – సర్ ప్రక్రియ తుది దశకు చేరుకుంది. ఈ ప్రక్రియను విజయవంతం చేసేందుకు వార్డు కౌన్సిలర్ కొర్లపాటి శివ కిరణ్ బుధవారం కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో కలిసి వార్డులోని పలు కాలనీల్లో విస్తృతంగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు.ఈ సందర్భంగా ప్రతి ఇంటికి వెళ్లి ఓటర్లను కలిసిన కౌన్సిలర్ శివ కిరణ్, సర్ అప్లికేషన్ ఫారాలను అందజేసి వాటిని ఎలా నింపాలో క్షుణ్ణంగా వివరించారు. కొత్తగా ఓటు నమోదు చేసుకోవాల్సిన వారు, పేరు, అడ్రస్ మార్పులు చేయించుకోవాల్సిన వారు, పేరులో తప్పులు దిద్దించుకోవాల్సిన వారు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.
బూత్ లెవల్ అధికారులు , బూత్ లెవల్ ఏజెంట్లు ల ఆధ్వర్యంలో ఫారాల సేకరణ ప్రక్రియ వేగంగా జరుగుతోందని ఆయన తెలిపారు. ప్రజలందరూ సహకరించి తమ ఓటు హక్కును కాపాడుకోవాలని విజ్ఞప్తి చేశారు.
ఈ సందర్భంగా కౌన్సిలర్ శివ కిరణ్ మాట్లాడుతూ
"ప్రజాస్వామ్యంలో ప్రతి ఓటు విలువైనది. ఎవరూ కూడా తమ ఓటు హక్కును కోల్పోవద్దు. ముఖ్యంగా కొత్తగా 18 సంవత్సరాలు నిండిన యువత, ఇతర ప్రాంతాల నుంచి వచ్చి ఇక్కడ స్థిరపడిన వారు, పేరులో లేదా చిరునామాలో తప్పులున్న వారు తప్పనిసరిగా సర్ ఫారం నింపాలి. పార్టీ నాయకులు, కార్యకర్తలు, అధికారులందరూ సమన్వయంతో పనిచేస్తూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తున్నారు" అని అన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కాంగ్రెస్ నాయకులు పొట్ల శీను, కోలాపురి ఝాన్సీ, ఆలేటి చిన్ని, బూత్ కమిటీ సభ్యులు, సూపర్వైజర్ బాలరాజు, బి ఎల్ ఓ లు అజ్మీర సక్కుబాయి, వార్డ్ ఆఫీసర్ రజిని, ఆర్పి మమత, బి ఎల్ ఎ లు స్థానిక కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# రాయల చంద్రశేఖర్ ఆశయ సాధన కోసం పనిచేయాలి చంద్ర అరుణ




ఇల్లందు న్యూస్ :-దేశంలో పాలకులు మారుతున్నారు కానీ రైతుల జీవితాలు మారటం లేదని అలాంటి రైతాంగం కోసం అహోర్నిశలు శ్రమించి వారి హక్కుల కోసం జీవితాన్ని త్యాగం చేసిన ఆదర్శ రైతుల పక్షపాతి అమరుడు రాయల చంద్రశేఖర్ రెండో వర్ధంతి సభ జిల్లా సహాయ కార్యదర్శి నాయిని రాజు అధ్యక్షతన ఇల్లందు ఎల్లన్న విజ్ఞాన భవనంలో జరిగింది. ఈసభలో సిపిఐ ఎంఎల్ ప్రజాపంథా రాష్ట్ర నాయకులు పాయం చిన్న చంద్రన్న, చంద్ర అరుణ,
రాయల చంద్రశేఖర్ చిత్రపటానికి పూలమాల తో నివాళు లర్పించారు. అనంతరం వారు పాల్గొని మాట్లాడుతూ కామ్రేడ్ రాయల చంద్రశేఖర్ రైతాంగ ఉద్యమంలో అఖిలభారత స్థాయి నాయకుడిగా ఉత్తర దేశ పర్యటన చేశారని, చరిత్రక మైన ఢిల్లీ సరిహద్దులో కొనసాగిన రైతాంగ పోరాటంలో పాల్గొని మూడు నల్ల చట్టాలను రద్దు చేసేంతవరకు చంద్రశేఖర్ పోరాటంలో కొనసాగారని అన్నారు.చంద్రశేఖర్ అమరుడై 2026జూలై 16 కు రెండు సంవత్సరాలు పూర్తవుతున్న సందర్భంగ
ఎమర్జెన్సీ అనంతరం సిపిఎంఎల్ పార్టీ ఇచ్చిన పిలుపుని అందుకొని లీగల్, బహిరంగ అవకాశాలు రావడంతో రైతు కూలీ సంఘం ఖమ్మం జిల్లా అధ్యక్షునిగా. రాష్ట్ర నాయకుడిగా సిపిఐ (ఎంఎల్) మాస్ లైన్ కేంద్ర కంట్రోల్ కమిషన్ చైర్మన్ స్థాయికి ఎదిగిన నాయకుడు మన మధ్య దూరం కావడం తీరనీ నష్టమని అన్నారు. 16-7- 26న పార్టీ రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో ఖమ్మం రామ నరసయ్య విజ్ఞాన కేంద్రంలో సంతాప సభ జరుగుతుందని,దీనిని జయప్రదం చేయాలని వారు పిలుపునిచ్చారు.
ఈ కార్యక్రమంలో సిపిఐ ఎంఎల్ మాస్ లైన్ జిల్లా నాయకులు బుర్ర వెంకన్న, ఎదలపల్లి సావిత్రి వీడియోస్ రాష్ట్ర అధ్యక్షులు కే పృధ్వి కొమరారం, టేకులగూడెం సర్పంచులు అజ్మీర బిచ్చ గుమ్మడి సందీప్, షేక్ యాకుబ్ షావలి, బానోత్ రామ్ సింగ్ పాయం వెంకన్న, శ్రీరామ్ కోటయ్య బుర్ర రాఘవులు కోటి, మల్లెల వెంకటేశ్వర్లు వేముల గురునాథం, మాజీ సర్పంచ్ ముత్తక్క తదితరులు పాల్గొన్నారు.

# అద్దాల చీర, మల్లెపూల కొప్పుతో మాధురీ దీక్షిత్ లేటెస్ట్ రాయల్ లుక్ వైరల్!




కలర్స్‌లో మెజెంటా కలర్‌కు ఉన్న ప్రత్యేకత వేరు. అది ఎక్కడున్నా అందరి దృష్టినీ తన వైపు తిప్పుకుంటుంది. తాజాగా ప్రముఖ నటి మాధురీ దీక్షిత ధరించిన అనితా డోంగ్రే డిజైనర్ శారీ ఈ విషయాన్ని మరోసారి రుజువు చేసింది. అద్భుతమైన అద్దాల పనితనం, సీక్విన్ ఎంబ్రాయిడరీతో కూడిన ఈ చీరలో ఆమె పండుగ శోభను ఉట్టిపడేలా చేసుకున్నారు. చీరకు నప్పేలా అదే కలర్ బ్లౌజ్, కుందన్ నగలు, తలలో మల్లెపూల కొప్పుతో తనదైన హుందాతనాన్ని చాటారు. మితిమీరిన హంగులు లేకుండా సంప్రదాయ కళాత్మకతనే హైలైట్ చేస్తూ ఆమె స్టైలింగ్ ఎంతో అద్భుతంగా నిలిచింది.
కొన్ని కలర్స్ అందరి దృష్టిని ఆకర్షిస్తాయి. వాటిలో ప్రముఖంగా మెజెంటా కలర్ ఖచ్చితంగా ఒకటి. ఈ విషయాన్ని ప్రముఖ నటి మాధురీ దీక్షిత్ తన తాజా లుక్‌తో మరోసారి నిరూపించారు. అనితా డోంగ్రే డిజైన్ చేసిన చీరలో పండుగ వాతావరణాన్ని ప్రతిబింబించేలా మెరిసిపోయారు. ఎంతో శ్రమతో కూడిన మిర్రర్ వర్క్, సున్నితమైన సీక్విన్ ఎంబ్రాయిడరీ, సంప్రదాయ చేతిపని నైపుణ్యంతో రూపొందించిన ఈ చీరలో మాధురీ దీక్షిత్ ఎంతో హుందాగా అందరినీ ఆకట్టుకున్నారు.
మాటలతో పనిలేకుండా తన అందంతోనే మాట్లాడేలా ఉన్న మిర్రర్ ఎంబ్రాయిడరీ చీర. చీర నిండా అక్కడక్కడ అల్లిన అద్దాల పనితనం, అంచులకు మంచి ఎంబ్రాయిడరీతో భారతీయ హస్తకళ నైపుణ్యాన్ని మరోసారి చాటి చెప్పింది. ఒంటిపై చీర కదిలినప్పుడల్లా చిన్న చిన్న అద్దాలు మెరిసిపోతుంటే సున్నితమైన సీక్విన్ డిజైన్ చీర పట్టుదనాన్ని ఏ మాత్రం తగ్గించకుండా మరింత నిండుదనాన్ని జోడించింది. ఆకర్షణీయమైన మెజెంటా రంగు ఈ సంప్రదాయ శైలి చీరకు సరికొత్త ఆధునిక హంగులు తీసుకొచ్చింది.ఒకే కలర్ కాంబినేషన్ అద్భుతంగా ప్రదర్శించిన సందర్భమిది. రంగుల కలయికలో ఎలాంటి మార్పులు చేయకుండా ఆ చీరకు తగ్గుట్లుగా మెంజాటాలో కలర్‌లో ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను ధరించారు. ఈ సింపుల్, క్లీన్ డిజైన్ వల్ల చీరపై ఉన్న అందమైన ఎంబ్రాయిడరీ వర్క్ మరింత హైలైట్ అయ్యింది. ఈ కాంబినేషన్ ఆమె మొత్తం లుక్‌కు పరిపూర్ణత ఇచ్చింది.ఒకే రంగు కాంబినేషన్‌ను (మోనోక్రోమ్) అద్భుతంగా ప్రదర్శించిన సందర్భమిది. రంగుల కలయికలో ఎలాంటి మార్పులు చేయకుండా, మాధురి ఆ చీరకు తగ్గట్టుగా అదే మెజెంటా రంగులో ఉన్న స్లీవ్‌లెస్ బ్లౌజ్‌ను ధరించారు. ఈ సింపుల్ మరియు క్లీన్ డిజైన్ వల్ల చీరపై ఉన్న అందమైన ఎంబ్రాయిడరీ వర్క్ మరింత హైలైట్ అయింది. అదే సమయంలో, ఈ కాంబినేషన్ ఆమె మొత్తం లుక్‌కు ఒక పరిపూర్ణమైన, ఆధునికమైన ముగింపును ఇచ్చింది.తిరుమల శ్రీవారి సేవలో హీరోయిన్ నిధి అగర్వాల్?..చీర అందాన్ని తగ్గించకుండా దానికి మరింత వన్నె తెచ్చేలా ఆమె ధరించిన నగలు కూడా ఇదే స్టైల్‌ని ప్రతిబింబించాయి. పెద్ద కుందన్ చాన్ బావ్‌లీ కమ్మలు, చేతి నిండా వేసుకున్న గాజులు, క్లాసిక్ ఉంగరాలు చీరపై ఉన్న మిర్రర్ వర్క్ అందాన్ని ఏ మాత్రం తక్కువ చేయకుండా ఆమె లుక్‌కు రాజసం ఉట్టిపడేలా చేశాయి. చీరకు భిన్నంగా ఉండే రత్నాలను గానీ, ఇతర రంగులను గానీ వాడకుండా చీరలో ఉండే ఎంబ్రాయిడరీకి సరిపోయేలా ఉన్న గోల్డ్ టోన్స్ నగలను ఆమె సెలక్ట్ చేసుకున్నారు. ఇది ఆమె రూపానికి చక్కటి సమతూకాన్ని, సంపూర్ణత్వాన్ని అందించింది.వీటితో పాటు తాజా మల్లెపూలు చుట్టిన లో బన్ ఆమెకు హుందాతనాన్ని తీసుకురాగా, తేలికగా బ్లెండ్ చేసిన స్మోకీ ఐస్, మెరిసే చర్మం, గ్లోసీ పింక్ లిప్స్ ఆమె ఆహ్లాదకరంగా, హుందాగా నిలిచింది.

# 40 ఏళ్లు దాటినా ముఖంపై ముడతలు కనిపించకుండా యవ్వనంగా ఉంచే గుమ్మడికాయ, దీన్ని ఎలా ఉపయోగించాలంటే?



అందం కోసం కేవలం మార్కెట్‌లో దొరికే కెమికల్ ప్రొడక్ట్‌లే కాదు.. కొన్ని సహజసిద్ధమైన పదార్థాలు కూడా ఉపయోగపడుతాయి. ముఖ్యంగా కొన్ని కాయలు చర్మ సౌందర్యాని ఎంతో మేలు చేస్తాయి. అలాంటి వాటిలో ప్రధానమైనది గుమ్మడికాయ. గుమ్మడికాయ మన ఆరోగ్యానికే కాదు, మన సౌందర్యాన్ని రెట్టింపు చేయడానికీ ఎంతో సహాయపడుతుందని నిపుణుల చెబుతున్నారు. దీనిలో ఉండే విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, నేచురల్ ఎంజైమ్‌లు చర్మాన్ని మృదువుగా ఉంచడంతో పాటు సహజమైన కాంతిని అందిస్తాయని నిపుణులు అంటున్నారు. గుమ్మడికాయ వల్ల మన చర్మానికి కలిగే ప్రయోజనాల ఏమిటో ఈ స్టోరీలో చూద్దాం.గుమ్మడికాయ అంటే చాలామందికి ముందుగా గుర్తొచ్చేది దప్పలం, కూర, ఇగురు, సుప్ లాంటి వంటకాలే గుర్తొస్తాయి. గుమ్మడి కాయ ఆరోగ్యానికీ ఎంతో మేలు చేస్తాయి. గుమ్మడికాయ మన ఆరోగ్యాన్ని రక్షించడానికే కాదు, సౌందర్య సంరక్షణకూ ఎంతో సహాయపడుతుందని నిపుణులు అంటున్నారు. విటమిన్లు, యాంటీఆక్సిడెంట్లు, సహజ ఎంజైమ్‌లు సమృద్ధిగా ఉండే గుమ్మడికాయను అనేక స్కిన్‌కేర్ ఉత్పత్తుల్లో ఉపయోగిస్తున్నారు. ముఖ్యంగా ఫేస్ మాస్క్‌లు, ఎక్స్‌ఫోలియేటింగ్ క్రీమ్‌లు, సీరమ్‌లలో గుమ్మడికాయ ఎక్స్‌ట్రాక్ట్‌ను ఉపయోగిస్తున్నారు.
ఇందులోని విటమిన్‌–ఎ, ఇ, జు, బీటా–కెరోటిన్, సహజ ఫ్రూట్ ఎంజైమ్‌లు చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచడంలో, మృతకణాలను తొలగించడంలో, చర్మానికి సహజ కాంతిని అందించడానికి సహాయపడుతుందని నిపుణులు చెబుతున్నారు. మన బ్యూటీకేర్ రొటీన్‌లో గుమ్మడికాయ ఎలా సహాయపడుతుంది, దీన్ని స్కిన్‌కేర్ రొటీన్‌లో ఎలా ఉపయోగించాలో ఈ స్టోరీలో చూద్దాం..గుమ్మడికాయలో సహజంగా ఉండే ఫ్రూట్ ఎంజైమ్‌లు, ఆల్ఫా హైడ్రాక్సీ యాసిడ్లు చర్మంపై పేరుకుపోయిన మృత కణాలను మృదువుగా తొలగిస్తుంది. గుమ్మడికాయ చర్మాన్ని మరింత మృదువుగా, తాజాగా కనిపించేలా చేస్తుంది. మీరు స్క్రబ్ తయారు చేసుకోవడానికి మెత్తగా చేసిన గుమ్మడికాయ చెంచా ఓట్స్, కాస్త తేనె కలిపి పేస్ట్‌లా చేసుకోండి. దీంతో ముఖమంతా మృదువుగా మర్దన చేయాలి. తర్వాత గోరువెచ్చని నీటితో శుభ్రం చేసుకోండి. ఇది చర్మానికి మంచి స్క్రబ్‌లా పనిచేసి చర్మంపై మృత కణాలను తొలగిస్తుంది.గుమ్మడికాయలో ఉండే విటమిన్ ఇ, బీటా–కెరోటిన్ వంటి యాంటీఆక్సిడెంట్లు ఫ్రీ రాడికల్స్ వల్ల చర్మానికి కలిగే నష్టాన్ని తగ్గించడంలో కీలక పాత్ర పోషిస్తాయి. గుమ్మడికాయలోని పోషకాలు చర్మాన్ని కాంతివంతంగా మారుస్తాయి. సహజమైన మెరుపును నిలబెట్టందుకు ఇవి సహాయపడతాయని నిపుణులు చెబుతున్నారు. గుమ్మడి పేస్ట్‌కు కొద్దిగా పెరుగు, కొన్ని చుక్కల నిమ్మరసం, కాస్త తేనె కలిపి పేస్ట్‌లా చేయండి. దీన్ని ఫేస్‌కు అప్లయ్ చేసి 15 నిమిషాలు ఆరనివ్వాలి. ఆ తర్వాత నీటితో శుభ్రం చేసుకోండి. మీ ముఖానికి ఇన్‌స్టెంట్ గ్లో వస్తుంది.
గుమ్మడికాయలో నీటి శాతం ఎక్కువగా ఉండటంతో పాటు విటమిన్ జు, ఫ్యాటీ యాసిడ్స్ కూడా ఉంటాయి. ఇవి చర్మంలోని తేమను నిల్వ చేయానికి సహాయపడతాయి. అందుకే పొడి చర్మం ఉన్నవారు ఉపయోగించే కొన్ని మాయిశ్చరైజర్లలో గుమ్మడికాయ సారం లేదా గుమ్మడికాయ గింజల నూనెను ఉపయోగిస్తున్నారు. ఇదే విషయాన్ని రీసెర్చ్‌గేట్ అధ్యయనం సైతం పేర్కొంది.గుమ్మడికాయలోని విటమిన్‌–ఎ, జు కొల్లాజెన్ ఉత్పత్తికి మద్దతు ఇస్తాయి. దీంతో చర్మం బిగుతుగా కనిపించడానికి, సన్నని గీతలు త్వరగా కనిపించకుండా ఉండేందుకు కొంత మద్దతు లభిస్తుంది. అయితే ఇది వృద్ధాప్యాన్ని పూర్తిగా ఆపదు. ఆరోగ్యకరమైన జీవనశైలి, సన్‌స్క్రీన్ వాడకం కూడా అంతే ముఖ్యం. అందుకే మీ ఆహారంలోనూ, బ్యూటీ కేర్‌లోనూ గుమ్మడికాయను యాడ్ చేసుకోండి.సున్నితమైన చర్మం ఉన్నవారు కొత్త ఉత్పత్తిని ముఖమంతా రాసే ముందు చేతి లోపలి భాగంలో ప్యాచ్ టెస్ట్ చేయాలి. మంట, దురద, ఎర్రబడటం వంటి లక్షణాలు కనిపిస్తే వెంటనే వాడకం ఆపాలి. అలాగే గుమ్మడికాయలో సహజ ఎంజైమ్‌లు ఉండటం వల్ల ఎక్స్‌ఫోలియేటింగ్ ఉత్పత్తులను ప్రతిరోజూ కాకుండా, నిపుణుల సూచనల ప్రకారం మాత్రమే ఉపయోగించడం మంచిది.ముఖ్య గమనిక: ఈ కథనంలోని సమాచారం కేవలం అవగాహన కోసం మాత్రమే. కొన్ని అధ్యయనాలు, కొందరు నిపుణులు పేర్కొన్న అంశాల ఆధారంగా తెలియజేశాము. వీటిని పాటించే ముందు నిపుణుల సలహా తీసుకోండి. అలాగే వీటిని ఎంత వరకు పాటించాలనేది, విశ్వసించాలనేది పూర్తిగా మీ వ్యక్తిగత విషయం.

# జలుబు దగ్గు గొంతు నొప్పి తగ్గించే మిరియాలు చిట్కా, ఎలా వాడాలంటే?



వర్షాకాలం వచ్చిందంటే చాలు జలుబు, దగ్గు, ఇన్ఫెక్షన్ల సమస్య పెరుగుతుంది. ముఖ్యంగా జలుబు, దగ్గు, గొంతు నొప్పి నుంచి ఉపశమనం పొందడానికి రకరకాల మందులు, ట్యాబ్లెట్లు వేసుకుంటూ ఉంటాం. అయితే జలుబు, దగ్గు, గొంతు నొప్పి నివారణకు ఇంటి చిట్కాలు ఎఫెక్టివ్‌గా సహాయపడతాయని మన పూర్వకాలం నుంచి తెలిసిందే. ముఖ్యంగా మిరియాలు జలుబు, దగ్గు సమస్యకు అద్భుతంగా పనిచేస్తాయి. అయితే ఈ సమస్యలను తగ్గించడానికి మిరియాలు ఎలా సహాయపడతాయో ఈ స్టోరీలో చూద్దాం.వర్షాకాలం మొదలైతే చల్లటి వాతావరణం, తేమ పెరగడం, వైరల్ ఇన్‌ఫెక్షన్లు వేగంగా వ్యాపించడం వల్ల జలుబు, దగ్గు, గొంతు నొప్పి వంటి సమస్యలు చాలా మందిని ఇబ్బంది పెడుతుంటాయి. ముఖ్యంగా పిల్లలు, వృద్ధులు, రోగనిరోధక శక్తి తక్కువగా ఉన్నవారిలో ఈ సమస్యలు తీవ్రంగా ఉంటాయి. జలుబు, గొంతునొప్పి, చికాకును తగ్గించడానికి ఇంటి చిట్కాలు ఎఫెక్టివ్‌గా సహాయపడతాయి. అలాంటి వాటిలో వంటింట్లో తప్పనిసరిగా ఉండే మిరియాలు ఒకటని అధ్యయనం పేర్కొంది. మసాలా దినుసుగా మాత్రమే కాకుండా, ఆయుర్వేదంలో కూడా మిరియాలకు ప్రత్యేక స్థానం ఉంది.ఇందులో ఉండే పైపరిన్ అనే సహజ సమ్మేళనానికి యాంటీఆక్సిడెంట్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ గుణాలు ఉంటాయి. వీటిలో మెగ్నీషియం, ఐరన్, పొటాషియం, సి, కె విటమిన్లు, ఫైబర్ వంటి పోషకాలు ఉంటాయి. దీనిలో యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఫంగల్, యాంటీ బ్యాక్టీరియల్, యాంటీ ఇన్‌ఫ్లమేటరీ, యాంటీ వైరల్ గుణాలు ఉంటాయి. వర్షాకాలంలో జలుబు, గొంతు నొప్పిని తగ్గించడానికి మిరియాలు ఎంత ఎఫెక్టివ్‌గా సహాయపడతాయో ఈ స్టోరీలో చూద్దాం..గొంతునొప్పి నుంచి ఉపశమనంజలుబు వచ్చినప్పుడు గొంతులో మంట, నొప్పి, గరుకుదనం వంటి సమస్యలు సాధారణం. గోరువెచ్చని నీటిలో చిటికెడు మిరియాల పొడి కలిపి తీసుకున్నా, తేనెతో కొద్దిగా మిరియాల పొడి కలిపి తీసుకున్నా గొంతు నొప్పి నుంచి ఉపశమనం లభిస్తుంది. దీనిలోని యాంటీ బ్యాక్టీరియల్, యాంటీఆక్సిడెంట్ గుణాలు గొంతు చికాకును దూరం చేస్తాయి. గొంతులోని కఫాన్ని పలుచన చేసి రిలీఫ్ ఇస్తాయి.
జలుబు, దగ్గు నుంచి ఉపశమనంనల్ల మిరియాలలో పైపరిన్ ఉంటుంది. ఇది శక్తివంతమైన యాంటీఆక్సిడెంట్. అంతే కాకుండా.. యాంటీ బాక్టీరియల్, యాంటీ ఇన్ఫ్లమేటరీ గుణాలు ఇవి గొంతు నొప్పి, దగ్గు, ముక్కు దిబ్బడ సమస్యను పరిష్కరిస్తాయి. ఆయుర్వేదం ప్రకారం మిరియాలు శరీరంలో పేరుకుపోయిన కఫాన్ని కరిగించే గుణాలు ఉంటాయి.



# సీనియర్ల రాకతో బలంగా టీమిండియా జట్టు

ఇంగ్లండ్ పర్యటనలో టీమిండియా ఎట్టకేలకు విజయాన్ని అందుకుంది. ఐదు మ్యాచ్‌ల టి20 సిరీస్‌లో చిత్తు చిత్తుగా ఓడిన భారత జట్టు.. తొలి వన్డేలో మాత్రం ఘనవిజయాన్ని అందుకుంది. సీనియర్లు రావడంతో జట్టు బలంగా తయారైంది. మొదట బౌలర్లు ప్రతాపం చూపిస్తే.. ఆ తర్వాత బ్యాటర్లు రెచ్చిపోయారు. ఫలితంగా భారత జట్టు 6 వికెట్ల తేడాతో ఘనవిజయం సాధించింది. ఈ మ్యాచ్‌లో స్టార్ ప్లేయర్లు విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మలు విఫలం అయ్యారు. కోహ్లీ కేవలం 5 పరుగులు చేసి అవుటైతే.. రోహిత్ శర్మ 11 పరుగులు మాత్రమే చేశాడు. అయితే గిల్ (80 రిటైర్డ్ హర్ట్) జట్టుకు విజయాన్ని ఖాయం చేశాడు. అయితే ఈ మ్యాచ్‌లో భారత్ గెలవడానికి ముఖ్య కారణం బౌలర్లు. తొలుత బ్యాటింగ్‌కు దిగిన ఇంగ్లండ్ ఆరంభంలో మంచి ప్రదర్శన చేసింది. ముఖ్యంగా బెన్ డకెట్ (43) అద్భుతంగా ఆడాడు. తొలి వికెట్‌కు బెతెల్ (14)తో కలిసి 61 పరుగులు జోడించారు. ఈ దశలో ఇంగ్లండ్ 300కు పైగా పరుగులు చేస్తుందని అంతా అనుకున్నారు. అయితే ఇక్కడే మ్యాచ్ మలుపు తిరిగింది. కొత్త బౌలర్ గుర్నార్ బ్రార్ టీమిండియాకు బ్రేక్ ఇచ్చాడు. బంతిని అందుకున్న అతడు 3 బంతుల వ్యవధిలో 2 వికెట్లు తీశాడు. 13వ ఓవర్ వేసిన బ్రార్.. మొదట జాకబ్ బెతెల్‌ను అవుట్ చేశాడు. అనంతరం డేంజరస్ ప్లేయర్ బెన్ డకెట్‌ను అవుట్ చేశాడు. దాంతో ఇంగ్లండ్ 2 పరుగుల తేడాతో రెండు వికెట్లను కోల్పోయింది. ఇక ఇక్కడి నుంచి భారత జట్టు పుంజుకుంది. ఆ వెంటనే మరో డేంజరస్ ప్లేయర్ హ్యారీ బ్రూక్‌ను బుమ్రా అవుట్ చేశాడు. అంతే ఇంగ్లండ్ వెంటవెంటనే 3 వికెట్లను కోల్పోయింది. ఆ తర్వాత కూడా ఇంగ్లండ్ క్రమం తప్పకుండా వికట్లను కోల్పోయింది. ఒక దశలో 61 పరుగులకు వికెట్ లేకుండా ఉన్న ఇంగ్లండ్.. 46 పరుగుల తేడాతో 6 వికెట్లను కోల్పోయింది. గుర్నూర్ బ్రార్ 9 ఓవర్లలో 2 వికెట్లు తీశాడు. అయితే మ్యాచ్ మధ్యలో కాస్త అతి కూడా చేశాడు. బెన్ డకెట్ నేరుగా కొట్టిన షాట్‌ను అడ్డుకున్న బ్రార్.. బంతిని డకెట్ వైపు విసిరాడు. ఆ తర్వాత బంతిని డకెట్ సిక్సర్ బాదాడు. సోషల్ మీడియాలో.. ఇలాంటి అతి పనులు చేయకు బ్రార్.. నీలో గొప్ప ట్యాలెంట్ ఉందంటూ ఫ్యాన్స్ కామెంట్స్ పెడుతున్నారు.

# కోహ్లీతో కలిసి వరల్డ్‌కప్ 2027 ప్లాన్..

## కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలు

భారత వన్డే జట్టు భవిష్యత్తుపై వస్తున్న ఊహాగానాలకు కెప్టెన్ శుభ్‌మన్ గిల్ కీలక వ్యాఖ్యలతో తెరదించారు. ముఖ్యంగా 2027 వన్డే ప్రపంచకప్‌ను దృష్టిలో పెట్టుకుని జట్టు ప్రణాళికలు ఇప్పటికే ప్రారంభమయ్యాయని, అందులో స్టార్ బ్యాటర్ విరాట్ కోహ్లీ కీలక పాత్ర పోషిస్తున్నట్లు వెల్లడించారు. దీంతో కోహ్లీ భవిష్యత్తుపై జరుగుతున్న చర్చలకు కొత్త కోణం లభించింది. ఇంగ్లండ్‌తో తొలి వన్డేకు ముందు నిర్వహించిన మీడియా సమావేశంలో గిల్ చేసిన వ్యాఖ్యలు ప్రస్తుతం క్రికెట్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారాయి. ఇటీవలి కాలంలో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ వన్డే కెరీర్‌పై అనేక ఊహాగానాలు వినిపిస్తున్నాయి. వీరిద్దరూ 2027లో జరిగే ఐసీసీ వన్డే ప్రపంచకప్ వరకు కొనసాగుతారా లేదా అన్న ప్రశ్నలు తరచూ వినిపిస్తున్నాయి. ఈ నేపథ్యంలో గిల్ స్పందిస్తూ, తాను రెండు రోజుల క్రితమే విరాట్ కోహ్లీతో కలిసి 2027 ప్రపంచకప్‌కు సంబంధించిన ప్రణాళికలపై సుదీర్ఘంగా చర్చించినట్లు వెల్లడించారు. “మేము జట్టు కాంబినేషన్ గురించి మాట్లాడుకున్నాం. ప్రపంచకప్ జట్టులో ఎవరెవరు ఉండొచ్చు, ప్రస్తుతం జట్టులో లేకపోయినా భవిష్యత్తులో కీలక పాత్ర పోషించే ఆటగాళ్లు ఎవరు, ఏ ఆటగాడిని ఏ స్థానంలో ఆడించడం జట్టుకు ఉపయోగపడుతుంది వంటి అనేక అంశాలపై చర్చించాం” అని గిల్ తెలిపారు. ఈ వ్యాఖ్యలు చూస్తే కోహ్లీని కేవలం సీనియర్ ఆటగాడిగానే కాకుండా, జట్టు వ్యూహాల రూపకల్పనలో భాగస్వామిగా కూడా భారత జట్టు యాజమాన్యం పరిగణిస్తున్నట్లు స్పష్టమవుతోంది. కొద్ది రోజుల క్రితం విరాట్ కోహ్లీ మాట్లాడుతూ, తాను తన స్థానాన్ని నిరూపించుకోవాల్సిన పరిస్థితి ఉన్న జట్టులో కొనసాగాలని అనుకోవడం లేదని వ్యాఖ్యానించారు. అలాంటి సమయంలో గిల్ చేసిన తాజా వ్యాఖ్యలు కోహ్లీపై జట్టు యాజమాన్యానికి ఉన్న విశ్వాసాన్ని



మరోసారి తెలియజేశాయి. తన నాయకత్వంలో కూడా కోహ్లీ కీలక పాత్ర పోషిస్తారని గిల్ స్పష్టం చేసినట్లుగా ఈ వ్యాఖ్యలను విశ్లేషకులు భావిస్తున్నారు. కెప్టెన్ పదవి నుంచి తప్పుకున్న తర్వాత టెస్టులు, టీ20ల్లో కోహ్లీ ప్రత్యక్షంగా నాయకత్వ వ్యవహారాల్లో పెద్దగా పాల్గొనలేదు. అయితే ఇప్పుడు 2027 ప్రపంచకప్ ప్రణాళికల్లో ఆయనతో కలిసి వ్యూహాలపై చర్చించడం కొత్త పరిణామంగా భావిస్తున్నారు. ఇది జట్టు నిర్మాణంలో కోహ్లీ అనుభవానికి ఇప్పటికీ ఎంత ప్రాధాన్యం ఉందో తెలియజేస్తోందని క్రికెట్ నిపుణులు అంటున్నారు. వన్డే క్రికెట్‌లో కెప్టెన్‌గా కూడా కోహ్లీ అద్భుతమైన రికార్డు సొంతం చేసుకున్నారు. ఆయన భారత జట్టుకు మొత్తం 95 వన్డేల్లో కెప్టెన్‌గా వ్యవహరించి 65 విజయాలు అందించారు. 68.42 శాతం విజయశాతంతో ఒకటి కంటే ఎక్కువ వన్డేలకు కెప్టెన్‌గా వ్యవహరించిన భారత కెప్టెన్లలో అత్యుత్తమ విజయశాతాన్ని నమోదు చేశారు. ఈ గణాంకాలు కూడా ఆయన నాయకత్వ సామర్థ్యాన్ని ప్రతిబింబిస్తాయి. రోహిత్ శర్మ, విరాట్ కోహ్లీ వయస్సు గురించి వస్తున్న ప్రశ్నలపైనా గిల్ స్పందించారు. గత పదేళ్లుగా భారత బ్యాటింగ్‌కు ఈ ఇద్దరూ వెన్నెముకగా నిలిచారని కొనియాడారు. వివిధ దేశాల్లో, భిన్నమైన పరిస్థితుల్లో ఎన్నో మ్యాచ్‌లు గెలిపించిన అనుభవం వారికి ఉందని చెప్పారు. వారి అనుభవం, నైపుణ్యం జట్టుకు ఇప్పటికీ ఎంతో విలువైనవని స్పష్టం చేశారు. భారత వన్డే జట్టు భవిష్యత్తు నిర్మాణంలో యువ ఆటగాళ్లకు అవకాశాలు కల్పిస్తూనే, అనుభవజ్ఞులైన కోహ్లీ, రోహిత్‌ల మార్గదర్శకత్వాన్ని కూడా వినియోగించుకోవాలనే ఆలోచనలో జట్టు యాజమాన్యం ఉన్నట్లు గిల్ వ్యాఖ్యలు సూచిస్తున్నాయి. 2027 ఐసీసీ వన్డే ప్రపంచకప్ లక్ష్యంగా భారత జట్టు ఇప్పటి నుంచే ప్రణాళికాబద్ధంగా అడుగులు వేస్తుండగా, కోహ్లీ, రోహిత్ ఇద్దరూ ఆ ప్రణాళికల్లో కీలక భాగస్వాములుగానే కొనసాగుతున్నారని గిల్ వ్యాఖ్యలు స్పష్టం చేశాయి.

# ఫైనల్‌కు దూసుకెళ్లిన స్పెయిన్

టెక్సాస్‌లోని అర్లింగ్టన్‌లో మంగళవారం జరిగిన ఈ కీలక పోరులో స్పెయిన్ తన వ్యూహాత్మక ఆటతీరుతో ఫ్రాన్స్ ఫార్వర్డ్ ఆటగాళ్లను పూర్తిగా కట్టడి చేసింది. ఈ విజయంతో మూడోసారి ప్రపంచకప్ గెలవాలనే ఫ్రాన్స్ కలలను స్పెయిన్ చెదరగొట్టింది. ఈ టోర్నమెంట్‌లో వరుస విజయాలతో ఫ్రాన్స్ హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగినప్పటికీ, స్పెయిన్ ఆటగాళ్ల జోరు ముందు నిలవలేకపోయింది. మ్యాచ్ మొదటి సగభాగంలో ఫ్రాన్స్ డిఫెండర్ లూకాస్ డిగ్నే, స్పెయిన్ వింగర్ లామిన్ యమల్‌ను ఫౌల్ చేయడంతో రిఫరీ స్పెయిన్‌కు పెనాల్టీ ఇచ్చారు. దీనిని మైకెల్ ఓయర్జబల్ గోల్‌గా మలిచి స్పెయిన్‌కు 1-0 ఆధిక్యాన్ని అందించాడు. ఈ టోర్నమెంట్‌లో ఫ్రాన్స్ జట్టు ప్రత్యర్థికి ఆధిక్యం ఇవ్వడం ఇదే మొదటిసారి. ఆ తర్వాత కొద్దిసేపటికే ఫ్రాన్స్ కీలక డిఫెండర్ విలియం సలిబా వెన్నునొప్పి కారణంగా మైదానాన్ని వీడడం ఆ జట్టుకు పెద్ద దెబ్బగా మారింది. ద్వితీయార్థంలో ఫ్రాన్స్ కోచ్ డిడియర్ డెషాంప్స్ తమ అటాకింగ్‌ను బలోపేతం చేసేందుకు మార్పులు చేసినప్పటికీ ఫలితం లేకపోయింది. మ్యాచ్ 58వ నిమిషంలో స్పెయిన్ డిఫెండర్ పెడ్రో పోరో, డాని ఓల్మో అందించిన పాస్‌ను అద్భుతమైన గోల్‌గా మలిచి జట్టు ఆధిక్యాన్ని 2-0కి పెంచాడు. కిలియన్ ఎంబాపె, ఉస్మాన్ డెంబెలే వంటి స్టార్ ఆటగాళ్లు ఉన్నప్పటికీ ఫ్రాన్స్ ఒక్క గోల్ కూడా చేయలేకపోయింది. ఈ టోర్నమెంట్‌లో స్పెయిన్ డిఫెన్స్ అత్యంత బలంగా ఉంది, వారు మొత్తం టోర్నీలో కేవలం ఒకే ఒక్క గోల్ సమర్పించుకున్నారు. ఇప్పుడు స్పెయిన్ జట్టు ఆదివారం జరగబోయే ఫైనల్‌లో ఇంగ్లాండ్ లేదా అర్జెంటీనాతో తలపడనుంది. మరోవైపు, గత రెండు ప్రపంచకప్‌లలో ఫైనల్‌కు చేరిన ఫ్రాన్స్ జట్టుకు ఈ ఓటమి పెద్ద షాక్ ఇచ్చింది. ఈ టోర్నమెంట్ తర్వాత ఫ్రాన్స్ కోచ్‌గా 14 ఏళ్ల సుదీర్ఘ ప్రయాణాన్ని ముగించి తప్పుకోనున్న డిడియర్ డెషాంప్స్‌కు నిరాశే మిగిలింది. ఓడిపోయిన ఫ్రాన్స్ జట్టు శనివారం జరిగే మూడో స్థానం కోసం ప్లే-ఆఫ్ మ్యాచ్ ఆడనుంది. ఈ విజయంపై స్పెయిన్ గోల్ స్కోరర్ పెడ్రో పోరో స్పందిస్తూ, ఇది ఒక “కల నిజమవ్వడం” లాంటిదని, జట్టు సమిష్టికృషి వల్లే ఈ విజయం సాధ్యమైందని ఆనందం వ్యక్తం చేశాడు.



# 2027 వన్డే ప్రపంచకప్‌లో సరికొత్త ఫార్మాట్

## • కీలక మార్పులు చేసిన ఐసీసీ

అంతర్జాతీయ క్రికెట్ కౌన్సిల్ (ఐసీసీ) పురుషుల టోర్నమెంట్ల విధానాలలో కీలక మార్పులు తీసుకొచ్చింది. టోర్నీల్లో పోటీ స్థాయిని పెంచడం, ప్రతి మ్యాచ్‌కు మరింత ప్రాధాన్యం కల్పించడం, అభిమానులకు మరింత ఆసక్తికర అనుభవాన్ని అందించడమే లక్ష్యంగా కొత్త విధానాలను ప్రవేశపెట్టింది. చీఫ్ ఎగ్జిక్యూటివ్స్ కమిటీ సిఫార్సుల మేరకు ఎడిన్‌బర్గ్‌లో జరిగిన ఐసీసీ బోర్డు వార్షిక సమావేశాలలో ఈ నిర్ణయాలు తీసుకుంది. 2027 వన్డే ప్రపంచకప్‌లో మొత్తం 14 జట్లు బరిలోకి దిగనున్నాయి. 2019, 2023 ప్రపంచకప్‌ల్లో 10 జట్లు మాత్రమే పాల్గొనగా, 2015 తర్వాత మళ్లీ 14 జట్లతో టోర్నీ నిర్వహించనున్నారు. అయితే నాకౌట్ రౌండ్లకు ముందు ఇది మూడు దశల్లో మ్యాచులు నిర్వహిస్తారు. ఈ ఫార్మాట్ ప్రకారం తొలుత అర్హత సాధించిన జట్లలో అత్యల్ప ర్యాంకింగ్ కలిగిన మూడు జట్లు (12, 13, 14వ స్థానాల్లో ఉన్నవి) మొదట ‘సూపర్ సిరీస్’ (రౌండ్-రాబిన్)లో పాల్గొంటాయి. ఇందులో అగ్రస్థానంలో నిలిచిన జట్టు తదుపరి దశలో మిగిలిన 11 జట్లతో కలుస్తుంది. అప్పటి నుంచి అసలైన టోర్నీ ప్రారంభం అవుతుంది. రెండో దశలో ఆరు జట్ల చొప్పున రెండు గ్రూపులు ఉంటాయి. ప్రతి గ్రూప్ రౌండ్-రాబిన్ పద్ధతిలో పోటీపడుతుంది. ప్రతి గ్రూప్ నుంచి మొదటి మూడు స్థానాల్లో నిలిచిన జట్లు సూపర్ 7 దశకు చేరుకుంటాయి. ఈ ఆరు జట్లు కాకుండా ఈ రెండు గ్రూప్‌లలో కలిపి అత్యుత్తమ ప్రదర్శన చేసిన మరో జట్టు కూడా సూపర్ 7కు చేరుతుంది. ‘సూపర్ 7’ దశలో ఏడు జట్ల మధ్య సింగిల్ రౌండ్-రాబిన్ పోటీ జరుగుతుంది. ‘సూపర్ 7’ దశలో మొదటి 4 స్థానాల్లో నిలిచిన జట్లు సెమీ-ఫైనల్స్‌కు అర్హత సాధిస్తాయి. ఇందులో మొదటి స్థానంలో ఉన్న జట్టు నాలుగో స్థానంలో ఉన్న జట్టుతోనూ, రెండో స్థానంలో ఉన్న జట్టు మూడో స్థానంలో ఉన్న జట్టుతోనూ తలపడతాయి. విజేతలు ఫైనల్‌లో పోటీపడతారు. మరిన్ని జట్లకు అతిపెద్ద వేదికపై పోటీపడే అవకాశాలను కల్పిస్తూనే, టోర్నమెంట్ ప్రారంభం నుంచే ప్రతి మ్యాచ్ ప్రాముఖ్యతను పెంచేలా ఈ కొత్త విధానాన్ని రూపొందించినట్లు ఐసీసీ తెలిపింది.





# ఆదివారం ముగింపు వేడుక.. ఆస్కార్, సినీ సెలబ్రిటీలకు ఆహ్వానం..!

ఫిఫా వరల్డ్ కప్ తుది అంకానికి చేరడంతో ముగింపు వేడుకలపై నిర్వాహకులు దృష్టి సారించారు. 48 జట్లతో మొదలైన ఈ మెగా టోర్నీ జూలై 19 ఆదివారంతో పూర్తి కానున్నందున.. అభిమానులను రంజింపజేసేందుకు భారీగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. న్యూయార్క్‌లోని న్యూ జెర్సీ స్టేడియంలో జరుగనున్న ‘క్లోజింగ్ సెరెమొనీ’లో హాలీవుడ్ నటుడు టామ్ క్రూజ్, ఇంటర్నెట్ సెన్సేషన్ ‘ఐషోస్పీడీ’ సహా పలువురు సినీ సెలబ్రిటీలు పాల్గొననున్నారు.
సాకర్ అభిమానులను ఉర్రూతలూగిస్తున్న ఫిఫా వరల్డ్‌కప్ విజేత ఎవరో ఆదివారంతో తేలిపోనుంది. ఫ్రాన్స్‌ను చిత్తుచేసిన స్పెయిన్‌ను ఢీకొట్టే జట్టేదో రెండో సెమీఫైనల్‌లో ఖరారు కానుంది. దాంతో, టైటిల్ పోరుకు ముందు ఆనావాయితీ అయిన ముగింపు వేడుకలను ఘనంగా నిర్వహించాలని భావిస్తోంది. న్యూ జెర్సీ స్టేడియంలో మ్యాచ్‌కు 90 నిమిషాల ముందు ఆటగాళ్లతో పాటు అభిమానులను అలరించేందుకు పలువురు సినీ సెలబ్రిటీలను ఆహ్వానించింది.

గురువారం, జూలై 16, 2026

హైదరాబాద్ పీపుల్స్ న్యూస్ దినపత్రిక



# 23న నే జననాయగన్ విడుదలకు రెడీ




తమిళనాడు ముఖ్యమంత్రి, కథానాయకుడు విజయ్ అభిమానులకు శుభవార్త. ఆయన కీలక పాత్రలో నటించిన ఆఖరి చిత్రం 'జన నాయగన్' విడుదల తేదీ ఖరారైంది. జులై 23న ఈ మూవీ విడుదల చేయనున్నట్లు ఓ టికెట్ బుకింగ్ యాప్ ప్రకటించింది. 24న విడుదలవుతుందని తొలుత ప్రకటించారు. కానీ ఒకరోజు ముందే వస్తోంది. దీంతో సామాజిక మాధ్యమాల వేదికగా విజయ్ అభిమానులు ఆనందం వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది సంక్రాంతి కానుకగా ప్రేక్షకుల ముందుకు రావాల్సిన ఈ మూవీ సెన్సార్ సమస్య కారణంగా వాయిదా పడుతూ వచ్చింది. ఈ మధ్యలో కోర్టు కేసులు, విచారణలు, సీబీఎఫ్‌సీపునః పరిశీలన తర్వాత ఇటీవల సెన్సార్ పూర్తి చేసుకుంది. ఈ చిత్రానికి 'ఏ' సర్టిఫికెట్‌ను సెన్సార్ బోర్డు జారీ చేసింది. దాదాపు 183 నిమిషాల నిడివితో 'జన నాయగన్' ప్రేక్షకుల ముందుకు రానుంది. హెచ్.వినోద్ దర్శకత్వంలో ముస్తాబైన ఈ యాక్షన్ ఎంటర్‌టైనర్‌ని కేవీఎన్ ప్రొడక్షన్స్ పతాకంపై వెంకట్ కె.నారాయణ నిర్మించారు. పూజా హెగ్డే కథానాయిక. మమితా బైజు కీలక పాత్ర పోషించింది.

-------

# ప్రభాస్ అంటే ..మాంచి భోజనం గుర్తుకొస్తుంది



స్టార్ హీరోయిన్ పూజా హెగ్డే తాజాగా ప్రభాస్ గురించి చెప్పిన మాటలు సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. ప్రభాస్‌తో కలిసి రాధేశ్యామ్ సినిమాలో నటించిన రోజులను గుర్తు చేసుకుంటూ ప్రభాస్ వ్యక్తిత్వం, ఆయన ఆతిథ్యం గురించి ఆమె చేసిన వ్యాఖ్యలు అభిమానులను ఆకట్టుకుంటున్నాయి.ఇటీవల పూజా ఓ మీడియాకు ఇచ్చిన ఒక ఇంటర్వ్యూలో పూజా హెగ్డే మాట్లాడుతూ.. 'ప్రభాస్ పేరు చెప్పగానే నాకు ముందుగా గుర్తొచ్చేది భోజనమే అని ఆయన భోజనాన్ని దొంగిలించాలనిపిస్తుందని అన్నారు. రాధేశ్యామ్ షూటింగ్ సమయంలో ఆయన పంపించే ఫుడ్ డబ్బా కోసం అందరం ఎదురు చూసేవారని.. నాకు కూడా ప్రతిరోజూ ఎంతో రుచికరమైన వంటకాలు పంపించేవారు' అని చెప్పారు.ఆమె ఇంకా మాట్లాడుతూ.. 'రాధేశ్యామ్ షూటింగ్‌కు సంబంధించిన ఎన్నో జ్ఞాపకాలు ఉన్నాయి. కానీ వాటిలో నాకు ఎక్కువగా గుర్తుండిపోయింది ప్రభాస్ పంపించే భోజనమే. ఆయన పంపించే డబ్బా ఎప్పుడూ ప్రత్యేకంగా ఉండేది. ఎంతో ప్రేమగా అందరికీ ఆహారం పంపించేవారు. నాకు కూడా చాలా రకాల వంటకాలు తినిపించారు. ఆ ఆతిథ్యాన్ని ఎప్పటికీ మర్చిపోలేను' అని తెలిపారు. ఇదిలాఉంటే.. ప్రభాస్ షూటింగ్ సెట్స్‌లో తన సమచర నటులు, సాంకేతిక నిపుణులకు ఇంటి భోజనం పంపించడం కొత్త విషయం కాదు. ఇప్పటికే సైఫ్ అలీఖాన్, కరీనా కపూర్, శ్రద్ధా కపూర్, పృథ్వీ రాజ్ సుకుమారన్ వంటి స్టార్లు ఆయన ఆతిథ్యానికి ఫిదా అయ్యారు. ఇప్పుడు పూజా హెగ్డే కూడా అదే విషయాన్ని మరోసారి ప్రస్తావించడంతో ప్రభాస్ అభిమానులు రాజు ఎక్కడ ఉన్నా రాజేరా అంటూ ఈ వ్యాఖ్యలను సోషల్ మీడియాలో వైరల్ చేస్తున్నారు.





# అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా

ఐకాన్ స్టార్ అల్లు అర్జున్‌తో మలయాళ దర్శకుడు బసిల్ జోసెఫ్ సినిమా చేయబోతున్నారనే వార్తలు గత కొంతకాలంగా సోషల్ మీడియాలో వైరల్ అవుతున్నాయి. అయితే ఇప్పటివరకు ఈ ప్రాజెక్టుపై అధికారిక ప్రకటన రాకపోయినా, తాజాగా బసిల్ జోసెఫ్ చేసిన ఓ సోషల్ మీడియా పోస్ట్ ఈ వార్తలకు మరింత బలం చేకూర్చింది. బసిల్ జోసెఫ్ తన ఇన్‌స్టాగ్రామ్ స్టోరీలో ఐకాన్ అని రాసి ఉన్న క్యాప్ ఫొటోను షేర్ చేశారు. ఈ ఒక్క పోస్టే ప్రస్తుతం టాలీవుడ్, మాలీవుడ్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. 'ఐకాన్' అనేది అల్లు అర్జున్‌కు అభిమానులు పెట్టిన బిరుదు కావడంతో, ఈ పోస్ట్ ఆయనతో చేయబోయే సినిమాపై పరోక్షంగా ఇచ్చిన హింట్ అని నెటిజన్లు భావిస్తున్నారు. అల్లు అర్జున్, బసిల్ జోసెఫ్ కలిసి సినిమా చేయనున్నారనే ప్రచారం చాలా రోజులుగా సాగుతోంది. ఇటీవల అల్లు శిరీష్ వివాహ వేడుకలో బసిల్ జోసెఫ్ పాల్గొనడం కూడా ఈ ఊహాగానాలకు మరింత బలం ఇచ్చింది. ఇద్దరి మధ్య కథా చర్చలు ఇప్పటికే జరిగినట్లు సినీ వర్గాల్లో టాక్ వినిపిస్తోంది. అయితే ప్రాజెక్టును ఇంకా అధికారికంగా ప్రకటించలేదు. 'మిన్నల్ మురళి'తో సూపర్ హీరో జానర్‌లో తన సత్తా చాటిన బసిల్ జోసెఫ్, 'శక్తిమాన్' కథను అల్లు అర్జున్‌తో తెరకెక్కించ బోతున్నారనే ప్రచారం కూడా జరిగింది. అయితే ఆ వార్తలను దర్శకుడు ఇప్పటికే ఖండించారు. బన్నీతో చేయబోయేది పూర్తిగా కొత్త కథేనని స్పష్టం చేశారు. కథ వివరాలను మాత్రం గోప్యంగా ఉంచుతున్నారు. ఈ క్రేజీ ప్రాజెక్ట్‌ను అల్లు కుటుంబానికి చెందిన ప్రముఖ నిర్మాణ సంస్థ గీతా ఆర్ట్స్ నిర్మించే అవకాశాలు ఉన్నట్లు ఇండస్ట్రీ వర్గాలు చెబుతున్నాయి. అధికారిక ప్రకటన వచ్చే వరకు దీనిపై పూర్తి స్పష్టత రానప్పటికీ, ప్రాజెక్ట్ దాదాపు ఖరారైనట్లే ప్రచారం సాగుతోంది.ప్రస్తుతం అల్లు అర్జున్ దర్శకుడు అట్లీ తెరకెక్కిస్తున్న భారీ పాన్ ఇండియా చిత్రం 'రాకా' షూటింగ్‌లో బిజీగా ఉన్నారు. ఈ సినిమా పూర్తయ్యాక దర్శకుడు లోకేష్ కనగరాజ్‌తో మరో భారీ ప్రాజెక్ట్ చేయనున్నారు. ఈ రెండు చిత్రాల తర్వాతే బసిల్ జోసెఫ్ దర్శకత్వంలో సినిమా ప్రారంభమయ్యే అవకాశాలు కనిపిస్తున్నాయి. సమాచారం ప్రకారం, అట్లీ సినిమా బన్నీ కెరీర్‌లో 22వ చిత్రం కాగా, లోకేష్ మూవీ 23వ చిత్రంగా రానుంది. బసిల్ జోసెఫ్ ప్రాజెక్ట్‌ను అల్లు అర్జున్ తన 25వ చిత్రంగా ఎ÷-లాన్ చేస్తున్నట్లు టాలీవుడ్‌లో ప్రచారం జరుగుతోంది.



# వారణాసి కోసం 14 నెలలుగా పనిచేస్తున్నా

## రాజమౌళి టేకింగ్ డిఫరెంట్ అంటూ ప్రియాంక కామెంట్

రాజమౌళి దర్శకత్వంలో మహేశ్ హీరోగా భారీ స్థాయిలో తెరకెక్కుతోన్న చిత్రం 'వారణాసి'. మహేశ్‌కు జోడీగా ప్రియాంక చోప్రా మందాకిని పాత్రలో సందడి చేయనున్నారు. తాజాగా ఓ పాడ్ కాస్ట్‌లో ఆమె ఈ సినిమా గురించి మాట్లాడారు. నేను 14 నెలలుగా ఈ సినిమా కోసం పనిచేస్తున్నాను. సినిమాను తెరకెక్కించడానికి రాజమౌళి చాలా సమయం తీసుకుంటారనే సంగతి మనందరికీ తెలిసిందే. ప్రతి సన్నివేశాన్ని క్షుణంగా పరిశీలిస్తారు. ఈ సినిమాలో నేను అద్భుతమైన స్లో మోషన్ జంప్స్ చాలా చేశాను. ప్రస్తుతానికి నేనింతకంటే ఎక్కువ చెప్పలేనని తెలిపారు. ఇటీవల కూడా వారణాసి గురించి ప్రియాంక మాట్లాడారు. తాను ఇప్పటివరకు చేసిన సినిమాలకు ఇది పూర్తి భిన్నమైనదని పేర్కొన్నారు. ఇప్పటికే ఈ సినిమాలోని కీలక సన్నివేశాల షూటింగ్ పూర్తి చేసినట్లు రాజమౌళి తెలిపారు. అక్టోబరు నాటికి మొత్తం షూటింగ్ పూర్తవుతుందని వెల్లడించారు. ఆ తర్వాత పోస్ట్ ప్రొడక్షన్ పనులు మొదలు పెట్టి, వచ్చే ఏడాది జనవరి లేదా ఫిబ్రవరి నుంచి ప్రమోషన్స్ ప్రారంభించే అవకాశం ఉంది. ఏప్రిల్ 7న ఈ చిత్రం ప్రపంచవ్యాప్తంగా విడుదల కానుంది



# చరణ్ కోసం సుకుమార్ మాస్టర్ ప్లాన్..





మెగా పవర్‌స్టార్ రామ్ చరణ్, ప్రముఖ దర్శకుడు సుకుమార్ కలయికలో రాబోతున్న ప్రతిష్ఠాత్మక చిత్రం 'ఆర్‌సీ17'పై ఇండస్ట్రీలో భారీ అంచనాలు నెలకొన్నాయి. 'రంగస్థలం' వంటి బ్లాక్‌బస్టర్ తర్వాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో వస్తున్న సినిమా కావడంతో ప్రతి చిన్న విషయం కూడా ఆసక్తిని రేకెత్తిస్తోంది. తాజాగా ఈ చిత్రానికి సంబంధించి ఓ సంచలన వార్త ఫిలిం నగర్‌లో చక్కర్లు కొడుతోంది. ఈ సినిమాలో లేడీ సూపర్ స్టార్ నయనతార ఓ అత్యంత కీలకమైన పాత్రలో కనిపించనున్నారని ప్రచారం జోరుగా సాగుతోంది.సుకుమార్ సినిమాల్లో కేవలం హీరో, హీరోయిన్లు మాత్రమే కాకుండా కథాగమనాన్ని మలుపు తిప్పే సహాయ పాత్రలు కూడా చాలా బలంగా, గుర్తుండిపోయేలా ఉంటాయి. ఈ నేపథ్యంలోనే 'ఆర్‌సీ17' కోసం నయనతారకు ఒక పవర్‌ఫుల్ పాత్రను ఆయన డిజైన్ చేసినట్లు తెలుస్తోంది. ఇందులో ఆమె హీరోయిన్‌గా కాకుండా, కథకు వెన్నెముకగా నిలిచే పాత్రను పోషించనున్నారని సమాచారం. దక్షిణాదిలో అగ్రతారగా వెలుగొందుతున్న నయన్ ఎంట్రీతో ఈ సినిమాకు పాన్-ఇండియా స్థాయిలో మరింత బలం చేకూరుతుందని విశ్లేషకులు భావిస్తున్నారు. ఇటీవలే మెగాస్టార్ చిరంజీవితో కలిసి ఆమె నటించిన 'మన శంకర వరప్రసాద్ గారు' చిత్రం భారీ విజయం సాధించిన సంగతి తెలిసిందే. ఇప్పుడు రామ్ చరణ్ సినిమాలో కూడా ఆమె నటిస్తే, సినిమాపై అంచనాలు ఆకాశాన్ని తాకడం ఖాయం. అయితే, ఈ వార్తలపై చిత్ర బృందం నుంచి అధికారిక ప్రకటన రావాల్సి ఉంది.మరోవైపు ఈ చిత్రానికి సంబంధించిన ప్రీ-ప్రొడక్షన్ పనులు శరవేగంగా జరుగుతున్నాయి. ఇటీవలే సుకుమార్ ఈ సినిమా ఫైనల్ నెరేషన్‌ను రామ్ చరణ్‌కు వినిపించగా, ఆయన కథ పట్ల పూర్తి సంతృప్తి వ్యక్తం చేసినట్లు తెలిసింది. స్క్రిప్ట్‌కు తుది మెరుగులు దిద్దేందుకు సుకుమార్ తన రచయితల బృందంతో కలిసి ప్రస్తుతం అమెరికాలో ఉన్నట్లు తెలుస్తోంది. కథలోని భావోద్వేగాలు, పాత్రల మధ్య సంబంధాలను మరింత బలంగా తీర్చిదిద్దే పనిలో ఆయన నిమగ్నమైనట్లు సమాచారం.
అంతా అనుకున్న ప్లాన్ ప్రకారం జరిగితే, ఈ ఏడాది అక్టోబర్‌లో పూజా కార్యక్రమాలతో సినిమాను లాంఛనంగా ప్రారంభించాలని నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఇటీవలే 'పెద్ది' చిత్రంతో మరో బ్లాక్‌బస్టర్‌ను తన ఖాతాలో వేసుకున్న రామ్ చరణ్, ప్రస్తుతం ఈ ప్రాజెక్ట్ కోసం సిద్ధమవుతూ విశ్రాంతి తీసుకుంటున్నారు. మొత్తం మీద 'రంగస్థలం' కాంబినేషన్ రిపీట్ అవుతుండటం, దానికి నయనతార లాంటి స్టార్ యాక్టర్ తోడవుతున్నారనే వార్తలు మెగా అభిమానుల్లో, సినీ ప్రియుల్లో ఆసక్తిని రేకెత్తిస్తున్నాయి. ఈ క్రేజీ ప్రాజెక్టుకు సంబంధించిన అధికారిక వివరాల కోసం మెగా ఫ్యాన్స్ ఎంతో ఉత్సుకతతో ఎదురుచూస్తున్నారు.

Printed, Published & Owned by CH. Rajkumar, Published at H.no. 5-5-616, Kothirampur.Dist- Karimnagar 505001. TELANGANA State printed at SRI BALAJI PRINTING PRESS, H.NO.4-4-55, Tilak Road, Karimnagar -505001,
Head office: 2-66-121/122 near ramky one Marvel gajullaramaram Quthbulapur medchal Malkajgiri district. TELANGANA STATE. CHIEF EDITOR : K.SRAVAN KUMAR 9866330400 , RNI. NO. APTEL/2010/35724. EMAIL:Peoplesnews0909@gmail.com